www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

## జూలైలో వానలే వానలు!

దేశంలోని 80 శాతం ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం

రాష్ట్రంలో ఎక్కువ జిల్లాల్లో మంచి వర్షాలు

కాకినాడ నుంచి నెల్లూరు వరకూ అధికం, రాయలసీమలో సాధారణ వర్షాలు

భారత వాతావరణ శాఖ అంచనా

12

### ఊరించి.. ఉసూరుమనిపించి

'అల్పపీడనం'పై అంచనాలు తలకిందులు

ఆకాశంలో మబ్బులే తప్ప జాడ లేని వర్షం

రాష్ట్రంలో జూన్‌లో 23.8% తక్కువ వానలు

పలు జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు

మంగళవారం | 1-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 76 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, తిథి: షష్ఠి ఉ.10:21 తదుపరి సప్తమి, నక్షత్రం: పుబ్బ ఉ.8:54 తదుపరి ఉత్తర, వర్జ్యం: సా.4:45-6:30. దుర్ముహూర్తం: ఉ.8:24-9:16, రా.10:25-11:07, అమృతఘడియలు: తె. 3:15-4:59, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 5:48, సూర్యాస్తమయం: 6:49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## కర్ణాటక్ బ్యాంక్ ఎండీ, ఈడీ రాజీనామా

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ రంగంలోని కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ శ్రీకృష్ణన్ హరిహర శర్మ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) శేఖర్ రావు తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బ్యాంక్ డైరెక్టర్ల అధికారానికి మించి ఖర్చు చేశారనే ఆరోపణలు వీరిపై ఉన్నాయి. మే నెలలో బ్యాంక్ ఆడిటర్లు, సలహాదారులను నియమించుకోవటంతో పాటు ఇతర అవసరాలకు వీరు రూ.1.53 కోట్లు ఖర్చు చేసినట్లు కర్ణాటక బ్యాంక్ పాలక మండలి తన నోట్‌లో పేర్కొంది. దీంతో పాలక మండలితో ఎండీ,సీఈఓ సహా ఈడీ మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడినట్లు తెలుస్తోంది. కాగా జూలై 15 నుంచి ఎండీ, సీఈఓ శర్మ రాజీనామా అమల్లోకి వస్తుందని బ్యాంక్ వెల్లడించింది. అలాగే ఈడీ శేఖర్ రాజీనామా జూలై 31 నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొంది. వ్యక్తిగత కారణాలతో పాటు ముంబైకి తిరిగి వెళ్లేందుకు రాజీనామా చేస్తున్నట్లు ఎండీ శర్మ పేర్కొన్నారు. శర్మ 2023 మే నెలలో మూడేళ్ల కాలానికి ఎండీ, సీఈఓగా నియమితులయ్యారు. మరోవైపు ఈడీ శేఖర్ రావు మంగళూరుకు బదిలీ కావటం సమస్యగా ఉందని ప్రస్తావిస్తూనే, ఇతర వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు తన లేఖలో తెలిపారు. కాగా కొత్త ఎండీ, సీఈఓకు అవసరమైన అభ్యర్థులను గుర్తించేందుకు సెలెక్షన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు కర్ణాటక బ్యాంక్ తెలిపింది. మరోవైపు బ్యాంక్‌కు కొత్త చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ)ను బ్యాంక్ నియమించింది. ఈయన బుధవారం బాధ్యతలు స్వీకరిస్తారని బ్యాంక్ పేర్కొంది.

**పతనమైన షేరు:** ఎండీ, సీఈఓ హరి, ఈడీ కిశోర్ రాజీనామాలతో సోమవారం కర్ణాటక బ్యాంక్ షేరు 6 శాతం మేర పతనమైంది. ఇంట్రాడేలో బీఎస్ఈలో ఒక దశలో షేరు 8.49 శాతం నష్టంతో రూ.190.05 స్థాయిని తాకింది. చివరకు 5.75 శాతం నష్టంతో రూ.195.75 వద్ద క్లోజైంది. ఎన్ఎస్ఈలో కూడా 5.65 శాతం పతనమై రూ.195.90 వద్ద ముగిసింది.

# ఫార్మసీ, డిజిటల్ హెల్త్ వ్యాపారాల విభజన

అపోలో హాస్పిటల్స్ వెల్లడి



## 18-21 నెలల్లో పూర్తి.. ఆ తర్వాతమార్కెట్లో లిస్టింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రముఖ హాస్పిటల్ దిగ్గజం అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏహెచ్ఈఎల్) తన వ్యాపారాలను పునర్ వ్యవస్థీకరిస్తోంది. ఇందులో భాగంగా అపోలో హాస్పిటల్స్‌కు చెందిన ఫార్మసీ, డిజిటల్ హెల్త్ వ్యాపారాలను ఒక ప్రత్యేక కంపెనీగా విభజించి, ఆ కంపెనీ షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేయాలని నిర్ణయించింది. సోమవారం జరిగిన సమావేశంలో అపోలో హాస్పిటల్స్, దాని అనుబంధ సంస్థ అపోలో హెల్త్ కంపెనీ లిమిటెడ్ (ఏహెచ్ఎల్) డైరెక్టర్ల బోర్డులు ఇందుకు సూత్రప్రాయ ఆమోదం తెలిపాయి. అయితే కొత్త కంపెనీ పేరును ఇంకా నిర్ణయించలేదు. ఈ విభజన, షేర్ల లిస్టింగ్ ప్రక్రియను 18 నుంచి 21 నెలల్లో పూర్తి చేయాలని ఏహెచ్ఈఎల్ భావిస్తోంది.ఈ విభజన ద్వారా ఏహెచ్ఈఎల్ ఈక్విటీలో 100 షేర్లు ఉన్న ప్రతి వాటాదారుకు.. కొత్తగా ఏర్పాటు చేసే ఫార్మసీ, డిజిటల్ హెల్త్ కంపెనీలో 195.2 షేర్లు లభిస్తాయి.

### విభజన ప్రక్రియ ప్రధానాంశాలు

- తొలి దశలో ఫార్మసీ డిస్ట్రిబ్యూషన్, అపోలో 24/7 డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫామ్, రిమోట్ టెలిహెల్త్ వ్యాపారాలను ఏహెచ్ఈఎల్ నుంచి ప్రత్యేక కంపెనీగా విభజిస్తారు.
- రెండో దశలో అపోలో హెల్త్ కంపెనీని కొత్త కంపెనీలో విలీనం చేస్తారు.
- మూడో దశలో హోల్‌సేల్ ఫార్మా డిస్ట్రిబ్యూషన్ కంపెనీ కీమెడ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను కొత్తగా ఏర్పాటు చేసిన కంపెనీలో విలీనం చేస్తారు.
- ఈ విభజనతో గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూ.16,300 కోట్లుగా ఉన్న ఫార్మసీ, డిజిటల్ హెల్త్ విభాగాల ఆదాయం 2027 మార్చి నాటికి రూ.25,000 కోట్లకు చేరుతుందని అంచనా.
- విభజనతో ఏర్పడే కొత్త కంపెనీ పూర్తి భారతీయుల యాజమాన్యం, నిర్వహణలో ఉన్న కంపెనీ (ఐఓసీసీ) అవుతుంది.
- ఈ కొత్త కంపెనీకి అపోలో గ్రూప్ నిర్వహణలోని ఫ్రంట్ ఎండ్ ఫార్మా కంపెనీ అయిన అపోలో ఫార్మసీస్ లిమిటెడ్ (ఏపీఎల్) ఈక్విటీలో 100 శాతం వాటా ఉండనుంది.
- ఏహెచ్ఈఎల్‌కు కొత్త కంపెనీ ఈక్విటీలో 15 శాతం వాటా.
- కొత్తగా ఏర్పడే కంపెనీ బోర్డులోనూ ఏహెచ్ఈఎల్‌కు ఒక నామినీ డైరెక్టర్ పోస్టు.
- వాటాదారులు, రెగ్యులేటరీ సంస్థల ఆమోదం లభించిన తర్వాత కొత్త కంపెనీకి ఫ్రంట్ ఎండ్ ఫార్మా బిజినెస్ కంపెనీ అపోలో మెడికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈక్విటీలోనూ 74.5 శాతం వాటా.
- అపోలో హెల్త్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ శోభన కామినేని.. కొత్తగా ఏర్పాటు చేసే కంపెనీకీ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు.
- ఏహెచ్ఈఎల్ ప్రమోటర్లు అందరూ కొత్త కంపెనీ బోర్డులో సభ్యులుగా ఉంటారు.

"రేపటి డిజిటల్ తరం కోసం ముందుచూపుతో ఈ కొత్త కంపెనీని ఏర్పాటు చేస్తున్నాం."

- ప్రతాప్ సి రెడ్డి, చైర్మన్, అపోలో హాస్పిటల్స్ గ్రూప్

"అపోలో హాస్పిటల్స్ ఆరోగ్య సేవలు అందించడంపైన దృష్టి పెడుతుంది. కొత్తగా ఏర్పడే కంపెనీ కస్టమర్లతో సంబంధాలు, వ్యాప్తిపై దృష్టి పెడుతుంది. రెండు కంపెనీలకు నిధుల కేటాయింపు, అభివృద్ధి ప్రణాళికలు, నిర్వహణ విషయాలు వేరు వేరుగా ఉంటాయి."

- సునీతా రెడ్డి, ఎండీ, ఏహెచ్ఈఎల్.

## చిన్న మొత్తాల పొదుపు వడ్డీరేట్లు యథాతథం

న్యూఢిల్లీ: పీపీఎఫ్, ఎన్ఎస్‌సీ సహా వివిధ చిన్న తరహా పొదుపు మొత్తాలపై వడ్డీ రేట్లను వర్తమాన ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి యథాతథంగా కొనసాగించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. అంటే చిన్న మొత్తాల పొదుపుపై వడ్డీ రేట్లను ఎలాంటి మార్పు లేకుండా యథాతథంగా ఉంచడం వరుసగా ఇది ఆరోసారి. అంటే సెప్టెంబరు చివరి వరకు చిన్న మొత్తాల పొదుపుపై చెల్లించే వడ్డీ ప్రస్తుత స్థాయిలోనే కొనసాగుతుంది.

### ఓపెన్‌ఏఐతో హెచ్‌సీఎల్ టెక్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ: ప్రముఖ జనరేటివ్ ఏఐ అప్లికేషన్ చాట్‌జీపీటీ రూపకర్త ఓపెన్‌ఏఐతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు దేశీయ ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్ టెక్ సోమవారం ప్రకటించింది. ఓపెన్‌ఏకి తొలి వ్యూహాత్మక సేవల భాగస్వాముల్లో తామొకరమని హెచ్‌సీఎల్ టెక్ పేర్కొంది. ఈ బహు వార్షిక భాగస్వామ్యంలో భాగంగా ఓపెన్‌ఏఐకి చెందిన ఏఐ మోడళ్లను హెచ్‌సీఎల్ టెక్ తన సేవలు, ప్లాట్‌ఫామ్స్‌లో వినియోగించుకోనుంది.


- మిచెలిన్ ఇండియా.. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా విజయవాడలో తొలి టైర్స్ అండ్ సర్వీసెస్ స్టోర్‌ను ఏర్పాటు చేసింది. సంఘ్వీ కార్ షాపీ భాగస్వామ్యంలో దీన్ని నెలకొల్పింది.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 1వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 570 | విజయవాడ | 590 |
| వరంగల్ | 572 | గోదావరి | 570 |
| చిత్తూరు | 633 | విశాఖపట్నం | 585 |
| | | దజను గుడ్లు రూ. 78 | |

### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 90 | విజయవాడ | 90 |
| వరంగల్ | 90 | గుంటూరు | 95 |
| కరీంనగర్ | 90 | ఒంగోలు | 98 |
| మహబూబ్‌నగర్ | 90 | చిత్తూరు | 88 |
| కర్నూలు | 90 | నెల్లూరు | 93 |
| విశాఖపట్నం | 79 | అనంతపురం | 93 |
| గోదావరి | 90 | | |

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 97,260 ▼ | 89,150 ▼ | 1,17,700 ▼ |
| విజయవాడ | 99,000 ▲ | 93,000 ▲ | 1,08,500 ▼ |
| విశాఖపట్నం | 99,060 ▲ | 89,150 ▼ | 1,17,700 ▼ |
| రాజమండ్రి | 97,250 ▼ | 89,150 ▼ | 1,09,900 ▲ |
| ప్రొద్దుటూరు | 96,500 ▲ | 88,780 ▲ | 1,07,000 ▲ |
| ముంబై | 95,886 ▲ | 87,832 ▲ | 1,05,510 ▲ |

# జీఎస్‌టీ వసూళ్లు ఐదేళ్లలో రెట్టింపు

## గత ఆర్థిక సంవత్సరంలో రూ.22.08 లక్షల కోట్లకు చేరిక

న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) చట్టం అమలులోకి వచ్చి 8 ఏళ్లు పూర్తయింది. కేంద్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం జీఎస్‌టీ వార్షిక వసూళ్లు గడిచిన ఐదేళ్లలో రెట్టింపయ్యాయి. 2020-21 ఆర్థిక సంవత్సరంలో జీఎస్‌టీ స్థూల వసూళ్లు రూ.11.37 లక్షల కోట్లుగా నమోదుకాగా.. గత ఆర్థిక సంవత్సరం(2024-25)లో సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.22.08 లక్షల కోట్లకు పెరిగాయి. మరిన్ని విషయాలు..

**జీఎస్‌టీ వసూళ్లు**

| ఆర్థిక సంవత్సరం | రూ.లక్షల కోట్లు |
|---|---|
| 2024-25 | 22.08 |
| 2023-24 | 20.18 |
| 2022-23 | 18.08 |
| 2021-22 | 14.83 |
| 202021 | 11.37 |



- 2024-25లో జీఎస్‌టీ ఆదాయం అంతక్రితం ఆర్థిక సంవత్సరం(2023-24)తో పోలిస్తే 9.4 శాతం వృద్ధి చెందాయి.
- 2020-21 ఆర్థిక సంవత్సరంలో నెలవారీ వసూళ్ల సగటు రూ.95,000 కోట్లుగా నమోదుకాగా.. 2021-22లో రూ.1.51 లక్షల కోట్లకు, రూ. 2023-24లో రూ.1.68 లక్షల కోట్లకు, 2024-25లో రూ.1.84 లక్షల కోట్లకు పెరిగాయి.
- జీఎస్‌టీ నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్)లో నమోదు చేసుకున్న వ్యాపారులు (పన్ను చెల్లింపుదారులు) గడిచిన 8 ఏళ్లలో రెట్టింపునకు పైగా పెరిగారు. 2017లో వీరి సంఖ్య 65 లక్షలుగా ఉండగా.. ప్రస్తుతం 1.51 కోట్లు దాటింది.
- ఈ ఏడాది ఏప్రిల్‌లో జీఎస్‌టీ స్థూల వసూళ్లు సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి రూ.2.37 లక్షల కోట్లకు చేరాయి. 2025 మే నెలలో రూ.2.01 లక్షల కోట్లుగా నమోదు కాగా.. జూన్ గణాంకాలు మంగళవారం విడుదల కానున్నాయి.
- దేశవ్యాప్తంగా ఏకరీతి పరోక్ష పన్నుల విధానాన్ని అమలు చేసేందుకు 17 రకాల స్థానిక పన్నులు, 13 రకాల సుంకాల విలీనం ద్వారా రూపొందించిన జీఎస్‌టీ చట్టం 2017 జూలై 1న అమలులోకి వచ్చింది.

## నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్

### సెన్సెక్స్ 452 పాయింట్లు పతనం

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో నాలుగు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. బ్యాంకింగ్‌తో పాటు ఇతర షేర్లలో ఇన్వెస్టర్లు లాభాలు స్వీకరించడంతో ప్రామాణిక సూచీలు సోమవారం నష్టాల్లో ముగిశాయి. ఒక దశలో 576.77 పాయింట్లు పతనమై 83,482.13 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసిన సెన్సెక్స్.. చివరికి 452.44 పాయింట్ల నష్టంతో 83,606.46 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 120.75 పాయింట్లు కోల్పోయి 25,517.05 వద్ద నిలిచింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 18 నష్టాలు చవిచూడగా.. యాక్సిస్ బ్యాంక్, కోటక్ బ్యాంక్ షేర్లు 2 శాతానికి పైగా క్షీణించాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం 0.81 శాతం వరకు పెరిగాయి. రంగాలవారీ సూచీల్లో రియల్టీ, బ్యాంకింగ్ అర శాతానికి పైగా నష్టపోయాయి. క్యాపిటల్ గూడ్స్, సర్వీసెస్ సూచీలు మాత్రం ఒక శాతానికి పైగా పెరిగాయి.

**సిగాచీ షేరు 11.50 శాతం డౌన్**

తెలంగాణకు చెందిన ఫార్మా కంపెనీ సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు పాశమైలారంలో ఉన్న ప్లాంటులో భారీ పేలుడు సంభవించడంతో కనీసం 12 మంది సిబ్బంది మరణించడంతో పాటు పలువురికి గాయాలయ్యాయి. అంతేకాదు, పలు పరికరాలు, మౌలిక వసతులు కూడా ధ్వంసమవడంతో ప్లాంట్‌ను 90 రోజుల పాటు మూసివేస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో సిగాచీ షేరు ఒక దశలో 14.82 శాతం వరకు పతనమైంది. చివరికి 11.58 శాతం నష్టంతో రూ.48.79 వద్ద ముగిసింది.

## ఏఎం గ్రీన్ చేతికి ఓరిక్స్ కార్ప్ వాటా

- గ్రీన్‌కో ఎనర్జీ హోల్డింగ్స్‌లో 17.5% వాటా కొనుగోలు
- డీల్ విలువ రూ.11,000 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గ్రీన్‌కో ఎనర్జీ హోల్డింగ్స్ కంపెనీలో జపాన్‌కు చెందిన ఆర్థిక సర్వీసుల కంపెనీ ఓరిక్స్ కార్పొరేషన్‌కు గల 17.5% వాటాను ఏఎం గ్రీన్ బీవీ కొనుగోలు చేయనుంది. ఈ డీల్ విలువ 128 కోట్ల డాలర్లు (రూ.11,000 కోట్లు). గ్రీన్‌కో వ్యవస్థాపకులు అనిల్ చలమలశెట్టి, మహేశ్ కొల్లి ఇద్దరి యాజమాన్యంలోని సంస్థ ఏఎం గ్రీన్‌కు ఈ లావాదేవీ అనంతరం గ్రీన్‌కోలో 25% వాటాలుంటాయి. గ్రీన్‌కోలో తనకు గల 20% వాటాలో 17.5% వాటాను ఏఎం గ్రీన్ పవర్ బీవీకి బదిలీ చేయడంతో పాటు దాని మాతృసంస్థ ఏఎం గ్రీన్ (లగ్జెంబర్గ్), సరళ్ (ఏఎంజీ లక్స్) జారీ చేసే కన్వర్టిబుల్ నోట్లలో 73.1 కోట్ల డాలర్లు (రూ.6,286.6 కోట్లు) ఓరిక్స్ కార్పొరేషన్ ఇన్వెస్ట్ చేస్తుంది. గ్రీన్‌కో దేశంలో పునరుత్పాదక ఇంధన కంపెనీలను కలిగి ఉండడంతో పాటు 10 గిగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యం కూడా కలిగి ఉంది. 2021 నుంచి గ్రీన్‌కో వ్యాపార వృద్ధికి ఓరిక్స్ మద్దతు ఇస్తోంది.

# స్పోర్ట్స్

## ట్రేడ్‌మార్క్‌గా 'కెప్టెన్ కూల్'

రిజిస్టర్ చేసిన ధోనీ



**న్యూఢిల్లీ:** 'కెప్టెన్ కూల్' అంటే క్రికెట్ అభిమానులకు వెంటనే స్ఫురించే పేరు ధోనీ. మైదానంలో ఎంతో ఒత్తిడి ఉన్నా.. ప్రశాంతంగా తనదైన వ్యూహాలను అమలు చేయడం ధోనీ స్టైల్. ఇప్పుడు ఆ 'కెప్టెన్ కూల్'నే మహీ ట్రేడ్ మార్క్‌గా మార్చాడు. క్రీడలకు సంబంధించి ట్రైనింగ్, ఇతరత్రా సౌకర్యాల కింద 'కెప్టెన్ కూల్' పేరును రిజిస్టర్ చేశాడు. ఈ నెల 5న ఇందు కోసం దరఖాస్తు చేసుకోగా.. వెంటనే ఆమోదించారు. ఈ నెల 16న ట్రేడ్ మార్క్ జర్నల్‌లో పబ్లిష్ కావడం విశేషం. అయితే, ప్రభా స్కిల్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఇంతకంటే ముందే 'కెప్టెన్ కూల్' టైటిల్ కోసం దరఖాస్తు చేసినా.. మార్చుకోవాలని సూచించినట్టు సమాచారం.

### పాక్ టెస్ట్ జట్టు కోచ్‌గా అజర్ మహమూద్

**లాహోర్:** మాజీ ఆల్‌రౌండర్ అజర్ మహమూద్ పాకిస్థాన్ టెస్ట్ జట్టు కోచ్‌గా పదోన్నతి పొందాడు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో అతడి పదవీకాలం ముగిసే వరకు ఈ బాధ్యతలు నిర్వర్తిస్తాడని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు సోమవారం తెలిపింది. అన్ని ఫార్మాట్ల జట్లకు సహాయ కోచ్‌గా అజర్ గత ఏప్రిల్‌లో నియమితుడయ్యాడు. అప్పట్లో గిలెస్పీ (టెస్టులు), కిర్‌స్టెన్ (పరిమిత ఓవర్లు)లను కోచ్‌లుగా నియమించింది. అయితే కొద్దికాలానికే వారిద్దరూ వైదొలిగారు. అజర్ 21 టెస్టులు, 143 వన్డేలు ఆడాడు.

# మెద్వెదెవ్ అవుట్

వింబుల్డన్

- రూన్ కూడా ఇంటిబాట
- ఐదు సెట్లు పోరాడి గెలిచిన అల్కారజ్
- సబలెంకా, రదుకాను, కీస్ బోణీ





రదుకాను

**లండన్:** వింబుల్డన్ తొలిరోజే సంచలనాలు చోటు చేసుకున్నాయి. ఎనిమిదో సీడ్ హోల్గర్ రూన్, తొమ్మిదో సీడ్ డానిల్ మెద్వెదెవ్‌కు మొదటి రౌండ్‌లోనే చుక్కెదురైంది. ఇక..మూడో టైటిల్ వేటలో ఉన్న అల్కారజ్ ఆరంభ మ్యాచ్‌లో ఐదు సెట్లు పోరాడాల్సి వచ్చింది. మహిళల టాప్ సీడ్ సబలెంకా, లోకల్ ఫేవరెట్ ఎమ్మా రదుకాను శుభారంభం చేయగా, ఆరో సీడ్ మాడిసన్ కీస్ మూడు సెట్లు శ్రమించాల్సి వచ్చింది. సోమవారం జరిగిన తొలి రౌండ్‌లో చిలీకి చెందిన క్వాలిఫయర్ నికోలాస్ జారీ ఐదు సెట్ల పోరాటంలో 4-6, 4-6, 7-5, 6-3, 6-4తో రూన్‌ను చిత్తు చేశాడు. ఫ్రాన్స్‌కు చెందిన 64వ ర్యాంకర్ బెంజమిన్ బోంజి 7-6 (2), 3-6, 7-6 (3), 6-2తో 2021 యూఎస్ ఓపెన్ విజేత మెద్వెదెవ్ (రష్యా)పై సంచలన విజయం సాధించాడు. ఇటీవల జరిగిన ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ మెద్వెదెవ్ ఆరంభ రౌండ్‌లోనే వెనుదిరిగాడు. ఇక.. 20వ సీడ్ పాపిరిన్ 4-6, 1-6, 6-4, 4-6తో ఆర్థర్ ఫెర్రీ చేతిలో ఓటమి పాలయ్యాడు. డబుల్ డిఫెండింగ్ చాంపియన్ అల్కారజ్‌కు ఇటలీ ఆటగాడు ఫాబియో ఫోనిని గట్టి ప్రతిఘటన ఇచ్చాడు. దాంతో అల్కారజ్ 7-5, 6-7 (7), 7-5, 2-6, 6-1తో గట్టెక్కాడు. 12వ సీడ్ టియఫో 6-3, 6-4, 6-2తో మోలెర్‌ని ఓడించి ముందంజ వేశాడు. మహిళల సింగిల్స్‌లో సబలెంకా 6-1, 7-5తో బ్రాన్‌స్టిన్‌పై సులువుగా నెగ్గగా, ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత కీస్ 6-7 (7), 7-5, 7-5తో గాబ్రియెలాపై పోరాడి గెలిచింది. బ్రిటన్ నెంబర్‌వన్ క్రీడాకారిణి రదుకాను 6-3, 6-3తో తన దేశానికే చెందిన మింగ్ గ్యూపై, 12వ సీడ్ ష్నీడెర్ 7-6 (5), 6-3తో మొయూకాపై, 14వ సీడ్ స్విటోలినా 6-3, 6-1తో అనా బోండర్‌పై విజయాలతో రెండో రౌండ్ చేరారు. 20వ సీడ్ ఒస్టాపెంకోకు 7-5, 2-6, 6-2తో అన్‌సీడెడ్ సోనె కర్తాల్ షాకిచ్చింది. రెండుసార్లు వింబుల్డన్ రన్నరప్ ఆన్స్ జెబ్యూర్, 24వ సీడ్ సిట్సిపాస్ గాయాలతో తొలి రౌండ్ నుంచి అర్థంతరంగా వైదొలిగారు.

**బాబోయ్.. ఎండలు**



వింబుల్డన్ తొలిరోజే ఎండ మండింది. ఉదయం 11 గంటలకే సూర్యుడు 28 డిగ్రీల సెల్సియస్‌తో చుర్రు మనిపించాడు. దాంతో ఆటగాళ్లతోపాటు ప్రేక్షకులు ఇబ్బందిపడ్డారు. 2001 తర్వాత టోర్నీ మొదటి రోజు ఇంత ఎండ ఉండడం ఇదే తొలి సారట! 'మొదటి రోజంతా ఎక్కడ నీడ ఉంటే అక్కడకు వెళ్లి కూర్చున్నా' అని ఆల్ ఇంగ్లండ్ క్లబ్ సీఈవో సాలీ బోల్టన్ చెప్పాడు.

**స్టార్ కళ..**



ఇంగ్లండ్ ఫుట్‌బాల్ మాజీ సూపర్ స్టార్ డేవిడ్ బెక్‌హామ్, టెన్నిస్ అందాల తార మరియా షరపోవా రాకతో వింబుల్డన్ తొలి రోజు పోటీలు స్టార్ కళను సంతరించుకున్నాయి. 2004లో 17 ఏళ్ల వయస్సులోనే వింబుల్డన్ విజేతగా నిలిచిన షరపోవా.. బెక్‌హామ్‌తో దిగిన సెల్ఫీని ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది.

## పసిడికి పంచ్ దూరంలో..



**ఫైనల్స్‌కు నిఖత్, లవ్లీనా ● నిహారిక, యషిలకు నిరాశ**

**హైదరాబాద్:** జాతీయ ఎలీట్ మహిళల బాక్సింగ్ టోర్నమెంట్‌లో నిఖత్ జరీన్, లవ్లీనా బోర్గొహైన్ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. ఇక్కడి సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన 51 కిలోల విభాగం సెమీఫైనల్లో నిఖత్ 5-0తో లక్ష్యను చిత్తుచేసి జ్యోతితో తుదిపోరుకు సిద్ధమైంది. 75 కిలోల కేటగిరి సెమీస్‌లో స్నేహను ఓడించిన లవ్లీనా.. ఫైనల్లో లష యాదవ్‌తో తలపడనుంది. తెలంగాణకు చెందిన మరో ఇద్దరు బాక్సర్లు యషి శర్మ (65 కి), నిహారిక గోనెళ్ల (60 కి) సెమీఫైనల్స్‌లో ఓటమి పాలయ్యారు. నిహారికపై ప్రాచి, యషి శర్మపై శశి గెలుపొంది ఫైనల్స్‌కు చేరారు.

## చాంపియన్ ఆయుష్

**మహిళల రన్నరప్ తన్వీ ● యూఎస్ ఓపెన్**



**లోవా (యూఎస్):** భారత యువ షట్లర్ ఆయుష్ షెట్టి యూఎస్ ఓపెన్ టైటిల్‌తో అదరగొట్టాడు. మహిళల్లో16 ఏళ్ల టీనేజర్ తన్వీ శర్మ రన్నరప్‌గా సరిపెట్టుకొంది. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో నాలుగో సీడ్ ఆయుష్ 21-18, 21-13తో మూడో సీడ్ బ్రియాన్ యాంగ్ (కెనడా)పై వరుస గేముల్లో నెగ్గాడు. ఈ క్రమంలో కెరీర్‌లో తొలిసారి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్‌ను సొంతం చేసుకొన్నాడు. కాగా, మహిళల సింగిల్స్ టైటిల్ పోరులో తన్వీ 11-21, 21-16, 10-21తో టాప్ సీడ్ బీవెన్ జాంగ్ (అమెరికా) చేతిలో పరాజయం పాలైంది.

# బరిలోకి హర్మన్‌ప్రీత్!

**నేడు ఇంగ్లండ్‌తో భారత్ రెండో టీ20**

**రాత్రి 11 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో..**



**బ్రిస్టల్:** ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను అదిరే విజయంతో ఆరంభించిన భారత మహిళల జట్టు నేడు (మంగళవారం) రెండో టీ20 ఆడనుంది. తొలి మ్యాచ్‌కి విశ్రాంతి తీసుకున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ రెండో టీ20కి అందుబాటులో ఉండే అవకాశం ఉంది. దీంతో భారత బ్యాటింగ్ విభాగం మరింత పటిష్ఠం కానుంది. ఓపెనర్ స్మృతి మంధాన కెరీర్‌లో తొలి సెంచరీ సాధించడంతో నాటింగ్‌హామ్ మ్యాచ్‌లో భారత్ 97 పరుగుల తేడాతో నెగ్గింది. వన్‌డౌన్‌లో హర్లీన్ డియోల్ సత్తా నిరూపించుకుంది. మిడిలార్డర్‌లో జెమీమా, రిచా ఘోష్ నిలకడ చూపాల్సి ఉంది. ఓపెనర్ షఫాలీ సహజశైలిని అందుకుంటే ఇంగ్లండ్‌కు మరోసారి కష్టాలు తప్పవు. ఇక ప్రధాన బౌలర్లు రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్ లేకపోయినా బౌలింగ్ విభాగం అదరగొట్టింది. ముఖ్యంగా అరంగేట్రంలోనే తెలుగమ్మాయి శ్రీచరణి నాలుగు వికెట్లతో ఇంగ్లండ్‌ను వణికించింది. వెటరన్ స్పిన్నర్లు రాధా యాదవ్, దీప్తి శర్మ సైతం ప్రభావం చూపారు. కానీ ఆతిథ్య ఇంగ్లండ్ బౌలర్లు, బ్యాటర్లు మాత్రం ప్రభావం చూపలేదు. బ్యాటింగ్‌లో నాట్ సివర్ మాత్రమే క్రీజులో నిలిచినా తనకు సహకారమే కరువైంది. నేటి మ్యాచ్‌లో మాత్రం ఇంగ్లండ్ తమ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చి సిరీస్‌లో సమవుజ్జీగా నిలువాలనుకుంటోంది.

## ఢిల్లీ ప్రీమియర్ లీగ్ వేలంలో

## కోహ్లి అన్న కొడుకు, సెహ్వాగ్ కుమారులు

**న్యూఢిల్లీ:** ఢిల్లీ ప్రీమియర్ లీగ్ వేలంలో ఇద్దరు ప్రముఖ క్రికెటర్ల బంధువులు బరిలో నిలిచారు. వారిలో ఒకరు విరాట్ కోహ్లీ అన్న కుమారుడు ఆర్యవీర్ కోహ్లీ (15)కాగా, మరొకరు టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయులు ఆర్యవీర్ సెహ్వాగ్ (17), వేదాంత్ సెహ్వాగ్ (15). విరాట్ అన్న వికాస్ కోహ్లీ తనయుడే ఆర్యవీర్ కోహ్లీ. లెగ్‌స్పిన్నర్ అయిన ఆర్యవీర్..విరాట్ కోహ్లీ చిన్ననాటి కోచ్ రాజ్‌కుమార్ శర్మ వద్ద శిక్షణ పొందుతున్నాడు. గత సీజన్‌లో ఢిల్లీ అండర్-16 జట్టులో పేరు నమోదు చేసుకున్న ఆర్యవీర్ డీపీఎల్ వేలంలో గ్రేడ్-సి విభాగంలో పోటీపడుతున్నాడు. ఇక..ఢిల్లీ అండర్-19 జట్టుకు ఆడుతున్న ఆర్యవీర్ సెహ్వాగ్ వేలంలో గ్రూప్-బిలో బరిలోకి దిగుతున్నాడు. అలాగే ఢిల్లీ అండర్-16కి ఆడుతున్న ఆఫ్ స్పిన్నర్ వేదాంత్ సెహ్వాగ్ కూడా గ్రూప్-బిలో పోటీపడుతున్నాడు. జూలై ఐదున వేలం జరగనుంది. గత ఏడాది డీపీఎల్ తొలి సీజన్ జరిగింది.

## ముల్డర్ శతకం

- దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 369
- జింబాబ్వే లక్ష్యం 537

**బులవాయో:** జింబాబ్వేతో జరుగుతున్న తొలి టెస్టులో వరల్డ్ టెస్టు చాంపియన్ దక్షిణాఫ్రికా అత్యంత పటిష్ఠ స్థితిలో నిలిచింది. వియాన్ ముల్డర్ (147) శతకం సాధించగా, కెప్టెన్ కేశవ్ మహరాజ్ (51) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. దీంతో దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 369 పరుగులు సాధించింది. అలాగే జింబాబ్వే ముందు 537 పరుగుల కష్టసాధ్యమైన లక్ష్యాన్ని ఉంచింది. మసకద్జాకు నాలుగు.. చివంగ, మసెకెసాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత భారీ ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన జింబాబ్వే సోమవారం ఆట ముగిసే సమయానికి 32/1 స్కోరుతో ఉంది.

## మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి

## రోజుకు రూ. 600 కూలి నుంచి..



వరుణ్ చక్రవర్తి.. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మిస్టరీ స్పిన్నర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించాడు. ఐపీఎల్‌లో మెరిసిన 33 ఏళ్ల వరుణ్.. టీమిండియా చాంపియన్ ట్రోఫీ నెగ్గడంలో కీలకపాత్ర పోషించాడు. అయితే, వరుణ్ గతం మాత్రం ఎంతో విచిత్రం. గిటారిస్ట్, ఫిల్మ్‌మేకర్, ఆర్కిటెక్చర్‌గా పలు వృత్తుల్లో ప్రయత్నించిన చక్రవర్తి.. ఆఖరికి క్రికెటర్‌గా సెటిలయ్యాడు. ఒకప్పుడు సినిమాల్లో జూనియర్ ఆర్టిస్ట్‌గా రోజుకు రూ. 600 కూలీకి పని చేసిన వరుణ్, ఇప్పుడు ఐపీఎల్ వేలంలో రూ. 12 కోట్లు పలికి కోటీశ్వరుడయ్యాడు. ఇలా.. తన జీవితంలో నమ్మశక్యం కాని ఆసక్తికర విషయాలను అశ్విన్ యూట్యూబ్ చానెల్‌లో వరుణ్ పంచుకొన్నాడు. ఇంజినీరింగ్ తర్వాత రూ. 14 వేల జీతానికి ఆర్కిటెక్చర్ కంపెనీలో చేరినట్టు తెలిపాడు. తర్వాత క్రికెట్ థీమ్‌తో తమిళంలో నిర్మించిన 'జీవా' సినిమాలో నటించినట్టు చెప్పాడు. అంతేకాదు.. తమిళ నటుడు విజయ్‌కు తాను వీరాభిమానినని తెలిపాడు. కెరీర్ ముగిసిన తర్వాత విజయ్‌తో సినిమాను డైరెక్ట్ చేయాలనుకొంటున్నట్టు చెప్పాడు.

## ఇంగ్లండ్‌దే రెండో వన్డే

**వికెట్ తేడాతో భారత యువ జట్టు ఓటమి**

**నార్తాంప్టన్:** భారత్ అండర్-19 జట్టుతో ఉత్కంఠ భరితంగా సాగిన రెండో యూత్ వన్డేలో ఇంగ్లండ్ ఆఖరి ఓవర్‌లో గట్టెక్కింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో వికెట్ తేడాతో నెగ్గిన ఆతిథ్య జట్టు.. ఐదు వన్డేల సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత కుర్రాళ్లు 49 ఓవర్లలో 290 పరుగులు సాధించారు. విహాన్ (49), రాహుల్ (47), వైభవ్ (45), కనిష్క్ (45), అభిగ్యాన్ (32) రాణించారు. ఫ్రెంచ్‌కు నాలుగు.. గ్రీన్, హోమ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఇంగ్లండ్ అండర్-19 జట్టు 49.3 ఓవర్లలో 291/9 స్కోరు చేసింది. ఓ దశలో 47/3 స్కోరుతో తడబడినా.. కెప్టెన్ థామస్ రూ (131) అద్భుత సెంచరీతో జట్టును విజయం వైపు నడిపించాడు. చివర్లో వేగంగా వికెట్లు కోల్పోయినా ఆఖరి ఓవర్‌లో ఆరు పరుగులను తొలి మూడు బంతుల్లోనే సాధించి భారత్‌కు ఝలక్ ఇచ్చింది. రాకీ (39), సెబాస్టియన్ (20 బ్యాటింగ్) ఆకట్టుకున్నారు. పేసర్లు అంబరీష్‌కు నాలుగు.. హెనిల్ పటేల్, యుధజిత్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
మంగళవారం | 1-7-2025
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

## అమ్మ చనిపోదామంటోంది మేడం!

గుంటూరు కలెక్టర్‌ను కదిలించిన పదేళ్ల బాలుడు

జీజీహెచ్ వద్ద టిఫిన్ బండి ఏర్పాటుకు విజ్ఞప్తి

ఆ మేరకు ఆదేశాలు ఇచ్చిన కలెక్టర్ నాగలక్ష్మి

2



కలెక్టర్ నాగలక్ష్మికి సమస్యను వివరిస్తున్న చిన్నారి యశ్వంత్

# బనకచర్లపై కొర్రీ

## ఈ ప్రాజెక్టుకు అంతర్రాష్ట్ర సమస్యలున్నాయ్: కేంద్రం




గోదావరి ట్రైబ్యునల్ అవార్డుకు విరుద్ధమంటూ ఫిర్యాదులందాయ్

వీటిపై జలసంఘాన్ని సంప్రదించండి

వరద జలాల లభ్యతపైనా సమగ్రంగా అంచనా వేయండి

ఏపీ ప్రభుత్వానికి ఈఏసీ సూచన

టీవోఆర్ రూపకల్పనకు నిరాకరణ

బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదన వెనక్కి

రాష్ట్ర జలవనరుల శాఖ తీవ్ర అసంతృప్తి

లోతుగా చర్చించాక కార్యాచరణ ఖరారు

పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్రం ఆదిలోనే కొర్రీ వేసింది. ఇందులో అంతర్రాష్ట్ర సమస్యలు ఇమిడి ఉన్నాయని తెలిపింది. 1980నాటి గోదావరి జలవివాదాల ట్రైబ్యునల్ ఇచ్చిన అవార్డును ఉల్లంఘించేలా ఉందని పలు ఈ-మెయిల్స్ ద్వారా ఫిర్యాదులు అందాయని కేంద్ర పర్యావరణ-అటవీ శాఖకు చెందిన నిపుణుల మదింపు కమిటీ (ఈఏసీ) స్పష్టంచేసింది.

న్యూఢిల్లీ/అమరావతి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర జలసంఘాన్ని (సీడబ్ల్యూసీ) సంప్రదించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సూచించింది. దానితో కలిసి వరద జలాల లభ్యతపై మరింత సమగ్రంగా అంచనా వేయాలని తెలిపింది. టెర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్ (టీవోఆర్) రూపకల్పనకు నిరాకరిస్తూ.. బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదనల ఫైలును తిప్పిపంపింది. పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ 2005 జనవరి 25వ తేదీన పర్యావరణ క్లియరెన్సు ఇచ్చిందని.. అయితే ఒడిసా, ఛత్తీస్‌గఢ్‌లలో ముంపు సంబంధిత సమస్యల కారణంగా ఈ వ్యవహారం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉందని ఈఏసీ గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో అంతర్రాష్ట్ర సమస్యల పరిశీలనకు, అనుమతులు, క్లియరెన్సుల కోసం జలసంఘాన్ని ఆశ్రయించడం తప్పనిసరని

మిగతా 11వ పేజీలో...


శ్రీశైలానికి కొనసాగుతున్న

## వరద

రాత్రి 11 గంటల సమయానికి 1,18,736 క్యూసెక్కుల ప్రవాహం

రెండువైపులా విద్యుదుత్పాదన ప్రారంభం

దిగువకు 58,750 క్యూసెక్కులు



12



గ్లోబల్ గేట్‌వేగా ‘అమరావతి’ వ్యాలీ

2035 నాటికి ప్రపంచ లైట్ హౌస్!

స్టార్టప్‌లకు ప్రోత్సాహకాలు

డిక్లరేషన్‌కు వర్క్‌షాపు ఆమోదం

ఐబీఎం రూపొందించిన క్వాంటమ్ కంప్యూటర్ నమూనాతో సీఎం చంద్రబాబు, లోకేశ్ తదితరులు

## ‘క్వాంటమ్’ ఆవిష్కరణలకు

# ఆకాశమే హద్దు!

## స్టార్టప్‌లు తరలిరావాలి: చంద్రబాబు

అమెరికాలో సిలికాన్ వ్యాలీ

అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ

వచ్చే జనవరి 1నాటికి రాజధానిలో క్వాంటమ్ వ్యాలీ పార్కు

ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ భాగస్వామ్యంతో ఏర్పాటు

దీనికి అనుబంధంగా ఎకోసిస్టమ్ కూడా

టెక్నాలజీ లేకుంటే యుద్ధాలూ చేయలేం!

రాష్ట్రంలో డీప్ టెక్నాలజీ, ఏఐ, ఏరోస్పేస్, రక్షణ రంగాలకు విస్తృత అవకాశాలు

అంతర్జాతీయ సంస్థలు అందిపుచ్చుకోవాలి

ఇప్పుడే పెట్టుబడులతో రావాలి: సీఎం

అమరావతి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను క్వాంటమ్ టెక్నాలజీ కేంద్రంగా మార్చాలని సంకల్పించామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. క్వాంటమ్ రంగంలో ఆవిష్కరణలకు ఆకాశమే హద్దుగా పేర్కొన్నారు. స్టార్టప్‌లకు విస్తృత అవకాశాలున్నాయని.. అవి తరలిరావాలని పిలుపిచ్చారు. అమెరికాలో సిలికాన్ వ్యాలీ తరహాలో అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు తమ లక్ష్యమన్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి ఈ క్వాంటమ్ వ్యాలీ పార్కు ప్రారంభమవుతుందని

మిగతా 11వ పేజీలో...

భావి టెక్నాలజీని పాలనతో, ప్రజాజీవితంతో సమ్మిళితం చేయాలి

ఆగస్టు 15 నుంచి ప్రభుత్వ సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే: ముఖ్యమంత్రి



క్వాంటమ్ వ్యాలీ వర్క్‌షాప్‌లో బాబు, లోకేశ్

### ఐదేళ్లలో లక్ష ఉద్యోగాలు

అమరావతి క్వాంటమ్ వ్యాలీ.. దక్షిణాసియాలోనే మొదటిది

ఇక్కడ 50కి పైగా యూనికార్న్‌ల అభివృద్ధి

చంద్రబాబు సాంకేతిక విప్లవంలో ఇది సెకండ్ చాప్టర్

క్వాంటమ్ వర్క్‌షాపులో మంత్రి లోకేశ్

## సజ్జలకు చెప్పి మెడికల్ సీటు ఇప్పిస్తా!

రూ.1.20 కోట్లు నొక్కేసిన ఆయన సన్నిహితుడు

నకిలీ ఆఫర్ లెటర్‌తో బాధితుడికి టోకరా

అడపా ప్రేమ్‌చంద్‌పై గుంటూరు ఎస్పీకి ఫిర్యాదు

విజయవాడ పిన్నమనేనిలో సీటుకు 2 కోట్లు డీల్

ఆ తర్వాత ఆ రేటును 4 కోట్లకు పెంచిన వైనం

బెంగళూరులో సీటు వచ్చినట్లు నకిలీ ఆఫర్ లెటర్

గుట్టు బయటపడటంతో బాధితుడికి బెదిరింపు

వైసీపీ గెలవగానే అంతు చూస్తానంటూ హెచ్చరికలు

గుంటూరు,జూన్ 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అప్పటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి చెప్పి మెడికల్ సీటు ఇప్పిస్తానంటూ ఆయన సన్నిహితుడు రూ. 120 కోట్లు నొక్కేశాడు. బెంగళూరు రామయ్య మెడికల్ కళాశాలలో సీటు వచ్చినట్లుగా నకిలీ ఆఫర్ లెటర్ చేతికి ఇచ్చి ఘోరంగా మోసం చేశాడు. బాధితుడు సోమవారం గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సజ్జలకు అత్యంత సన్నిహితుడు అడపా ప్రేమ్‌చంద్ ఈ నిర్వాకానికి

మిగతా 10వ పేజీలో...

# బిగుస్తున్న ఉచ్చు

## లిక్కర్ స్కామ్‌లో చెవిరెడ్డి అనుచరుల అరెస్ట్

సిట్ అదుపులో బాలాజీ కుమార్, ఎద్దల నవీన్

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో దొరికిన నిందితులు

స్థానిక కోర్టులో ప్రవేశ పెట్టిన అధికారులు

ట్రాన్సిట్ వారెంట్‌పై నేడు బెజవాడకు తరలింపు

ఎన్నికల ముందు వందల కోట్లు తరలింపు

చెవిరెడ్డి అరెస్ట్ తర్వాత అజ్ఞాతంలోకి..

ఆలయాలు సందర్శిస్తూ నేపాల్ వరకు పరారీ



బాలాజీ కుమార్



ఎద్దల నవీన్

అమరావతి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మూడున్నర వేల కోట్ల రూపాయల మద్యం కుంభకోణంలో సూత్రధారులు, పాత్రధారులు ఒక్కొక్కరుగా జైలు పాలవుతున్నారు. తాజాగా మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అనుచరులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. సోమవారం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో సిట్ అధికారులు

మిగతా 12వ పేజీలో...

### లిక్కర్ ‘సొమ్ము’ 30 కోట్లు సీజ్

రాజ్ కసిరెడ్డి ‘ఆదాన్’ అకౌంట్లో 16.12 కోట్లు

గరికపాడు వద్ద పట్టుబడ్డ 8.37 కోట్ల నగదు

ఎస్ఎస్‌జే షుగర్స్ ఖాతాలో 5 కోట్లు

ఎంపీ డిస్టిలరీస్ నుంచి 50 లక్షలు జప్తు

12

### 150కే పెయ్యదూడ

నేటి నుంచి రైతులకు అందుబాటులో వీర్యం

రాష్ట్ర వ్యాప్తంగా ఏడాదికి 10 లక్షల డోసులు

ముర్రా గేదెలు, సంకర జాతి ఆవుల హబ్‌గా ఆంధ్రప్రదేశ్

రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ సీఈఓ శ్రీనివాసరావు

10

సార్క్‌కు ప్రత్యామ్నాయంగా

## కొత్త గ్రూప్?

దక్షిణాసియా దేశాలతో చైనా, పాక్, బంగ్లాదేశ్ మంతనాలు

భారత్‌కు కౌంటర్‌గా ఏర్పాటు యత్నాలు

2




## నేటి నుంచి రైలు చార్జీల పెంపు

ఏసీ- కి.మీ.కి 2 పైసలు

నాన్ ఏసీ- కి.మీ.కి 1 పైస

సర్క్యులర్ జారీ చేసిన రైల్వే శాఖ

తత్కాల్‌కు ఆధార్ లింక్ నేటి నుంచే

2

రసాయన పరిశ్రమలో పేలుడు

## 19 మంది దుర్మరణం

తెలంగాణలో ఘోరప్రమాదం

ఎయిర్‌వాక్స్ పేలడంతో ఎగసిన అగ్నికీలలు

2 కిలోమీటర్ల మేర కంపించిన భూమి

కార్లు, బస్సుల అద్దాలు ధ్వంసం

తీవ్ర గాయాలతో 30 మంది ఆస్పత్రిలో..

16 మంది క్షతగాత్రుల పరిస్థితి విషమం

మరో 15 మంది కార్మికుల గల్లంతు

మృతులు, క్షతగాత్రులు బిహార్, ఒడిసా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వాసులు

10



సిగాచి పరిశ్రమలో పేలుడుతో ఎగిసిపడుతున్న మంటలు



బీజేపీ రాష్ట్ర కొత్త అధ్యక్షుడు

## పీవీఎన్ మాధవ్

ఆయన పేరును ఖరారు చేసిన అధిష్ఠానం

దీంతో ఒకటే నామినేషన్ దాఖలు

నేడు అధికారిక ప్రకటన

బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా రాంచందర్‌రావు

11

## కారులోనే కడతేరారు

డోర్లు బిగించుకుని బీర్లుతాగి మత్తుగా నిద్రలోకి

ఇంధనం నిండుకోవడంతో ఆగిన ఏసీ

ఊపిరాడక కారులోనే అన్నదమ్ముల మృతి

తిరుచానూరులో ఘటన

12

# గుడులపైనే గురి!

## ప్రధాన ఆలయాల్ని వివాదంలోకి లాగే కుట్ర

లడ్డూ ప్రసాదాలపై కావాలనే దుష్ప్రచారం

శ్రీశైలం లడ్డూలో బొద్దింక వచ్చిందని యాగీ

దుర్గమ్మ లడ్డూలో మేకు ఉందని హడావుడి

ఆ ఘటనలు ఫేక్ అని తేల్చిన రిపోర్టులు

సీసీ కెమెరాల ఆధారంగా గుట్టు రట్టు

వైసీపీ మొదలుపెట్టిన దుష్ట సంప్రదాయమిది

టీటీడీ గోవులు చనిపోతున్నాయని, అన్నదానం సరిగా లేదని నిన్నామొన్న వైసీపీ హల్‌చల్

అదే కోవలో తప్పుడు వదంతులు వెలుగులోకి..



లడ్డూలో బొద్దింక ఉన్నట్లు చూపిస్తున్న ఫేక్ ఫొటో

(అమరావతి, కర్నూలు - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఆలయాలు, హిందుత్వపై మళ్లీ కుట్రలు మొదలయ్యాయి. ప్రధాన ఆలయాలను లక్ష్యంగా చేసుకుని జరగనివి జరిగినట్లు.. లేనివి ఉన్నట్లు రోజుకొక అబద్ధపు వదంతిని ప్రచారంలో పెడుతున్నారు. గుడులపై గురిపెట్టి నానాఅల్లరి చేసే దుష్ట సంప్రదాయాన్ని వైసీపీ నేతలు మొదలుపెట్టారు. తిరుపతి, తిరుమల దేవస్థానం గోశాలలో ఆవులు చనిపోతున్నాయని, నిత్యాన్నదాన కార్యక్రమ నిర్వహణ సరిగా లేదంటూ నిన్నామొన్న అల్లరి చేశారు. రామతీర్థంలో శ్రీరాముని విగ్రహానికి తల తీసేసిన ఘటన వైసీపీ హయాంలోనే

మిగతా 2వ పేజీలో...

మనకూ బంకర్ బస్టర్

## బాంబులు

అమెరికా తరహాలో అభివృద్ధిపై భారత్ దృష్టి

7,500 కిలోల వార్‌హెడ్ మోసుకెళ్లేలా అగ్ని-5లో మార్పులు

2

మూడో వారంలో ఇంజనీరింగ్

## కౌన్సెలింగ్?

అందుబాటులో 2 లక్షలకుపైగా సీట్లు

ఇంకా తేలని ఫీజులు

12

# ఎడారి దేశంలో జనసేన వీరమహిళ ఆపన్నహస్తం

- రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన హైదరాబాద్ యువతి
- మృత్యువు నుంచి బయటపడినా ఒంటరిగా మిగిలిన వైనం
- తన వారికోసం తపించిన బాధితురాలికి అండగా విశాఖ మహిళ ఉష
- 2200 కిలోమీటర్లు ప్రయాణించి ఇండియాకు పంపిన వైనం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఆమె ఓ తెలుగు నర్సు. సేవే పరమావధిగా గల్ఫ్‌లోని బిషా అనే ఎడారి ప్రాంతంలో వేలాది మంది రోగులకు సేవలందిస్తోంది. అలాంటి ఆమె కొంతకాలం క్రితం ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలైంది. ప్రమాదం నుంచి మృత్యుంజయరాలిగా బయటపడినా.. పరాయిగడ్డపై ఆత్మీయులు కొరవడి ఏకాకిగా మిగిలింది. అదిగో.. సరిగ్గా అలాంటి సమయంలో ముక్కూ మోహం తెలియని ఆమె కోసం.. రియాద్‌లో ఉంటున్న.. విశాఖపట్నం జనసేన పార్టీకి చెందిన ఓ వీర మహిళ తానున్నానంటూ బాధితురాలికి ఆపన్న హస్తం అందించింది. సౌదీలో ఏకంగా 2200కిలో మీటర్ల దూరం ప్రయాణం చేసి ఆమెను సోమవారం స్వదేశానికి పంపించింది. వివరాలివీ.. సౌదీ అరేబియాలోని బిషా అనే ఎడారి ప్రాంతంలోని ఓ ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తున్న హైదరాబాద్ నగరానికి చెందిన 34 ఏళ్ల గిరిజన యువతి ఒకరు కొద్ది కాలం క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. మృత్యువు నుంచి బయటపడినా మెదడు, వెన్నుపూస, కాళ్లు, చేతులకు అనేక శస్త్రచికిత్సలు జరిగాయి. మెరుగైన వైద్య సదుపాయం అందించినా.. ఆమె మాత్రం ఇంకా పూర్తిగా కోలుకోలేదు. మానసికంగానూ కుంగిపోయి కన్నీరు మున్నీరవుతోంది. ఈ నేపథ్యంలో ఆమె దయనీయ పరిసితి తెలుసుకుని సౌదీలోని రియాద్‌లో ఉంటున్న విశాఖపట్నానికి చెందిన చెందిన జనసేన పార్టీ వీరమహిళ, సామాజిక కార్యకర్త దుగ్గారపు ఉష చలించిపోయారు. ఓవైపు తనకు ఆరోగ్యం బాగోలేకపోగా, మరోవైపు పిల్లలకు పరీక్షలు ఉన్నప్పటికీ.. వారిని ఇంట్లో ఒంటగా వదిలిపెట్టి.. బాధితురాలి కోసం ఆమె ఉన్న ఆస్పత్రికి అతికష్టమ్మీద వెళ్లారు. ఎడారి దేశంలో ప్రయాణం తనకూ కొత్త అయినప్పటికీ.. రియాద్ నుంచి 800 కిలోమీటర్ల దూరంలోని బిషాకు లోకల్ ఫ్లైట్‌లో వెళ్లి, బాధితురాలిని మరో 700 కిలోమీటర్ల దూరంలోని జెద్దాకు ఫ్లైట్‌లో తరలించారు. అక్కడి నుంచి అంతర్జాతీయ విమానంలో ఇండియాకు బాధితురాలిని పంపించి, తిరిగి మరో 700 కి.మీ.ప్రయాణించి రియాద్‌కు చేరుకున్నారు. సమయానికి విమానాలు అందుబాటులో లేకపోగా, నాలుగైదు రోజులు శ్రమపడి వేల కిలోమీటర్ల పైగా ఏడారిలో ప్రయాణించారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ స్ఫూర్తితో సేవలో తనకు అలసట కనిపించదని ఉష ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. బాధితురాలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



సౌదీలోని జెద్దా అంతర్జాతీయ విమానాశ్రయంలో బాధితురాలితో జనసేన వీర మహిళ ఉష

## లోకం తీరు




# ఇద్దరు ఐపీఎస్‌లకు ఊరట

- అమిత్ బర్దార్, బిందు మాధవ్‌పై ఎన్నికల నాటి కేసుల ఉపసంహారణ

అమరావతి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఏపీ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారులు అమిత్ బర్దార్, గరికపాటి బిందు మాధవ్‌కు ఉపశమనం లభించింది. ఎన్నికల సమయంలో ఈ ఇద్దరిపై ఎన్నికల కమిషన్ విధించిన సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఉప సంహరించుకుంది. ఆ కాలాన్ని డ్యూటీగా పరిగణిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2024 సార్వత్రిక ఎన్నికలకు కొన్ని రోజుల ముందు అమిత్ బర్దార్ అనంతపురం జిల్లా ఎస్పీగా నియమితులయ్యారు. పోలింగ్ రోజు తాడిపత్రిలో జరిగిన గొడవలు అదుపు చేయలేకపోయారనే కారణంతో అమిత్ బర్దార్ సస్పెండయ్యారు. ఎన్నికల కమిషన్ సిఫారసుతో అమిత్‌ను సస్పెండ్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. విచారణ సందర్భంగా ఆయన ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందింది. ఇక ఎన్నికల సమయంలో పల్నాడు జిల్లా ఎస్పీగా గరికపాటి బిందు మాధవ్ పని చేశారు. అప్పట్లో పోలింగ్ రోజు జరిగిన అల్లర్లు, ఆ తర్వాత చెలరేగిన హింసాత్మక ఘటనలకు బాధ్యుడిని చేస్తూ ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసింది. మాచర్ల అసెంబ్లీ స్థానం నుంచి వైసీపీ తరపున పోటీ చేసిన అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి ఈవీఎంను పగుల గొడుతున్న వీడియోలు అప్పట్లో సంచలనం సృష్టించాయి. టీడీపీ మహిళా ఏజెంట్ నుదుటిపై గొడ్డలితో నరికినా ఆమె తలకు కట్టు కట్టుకుని పోరాడిన తీరు పల్నాడులో పరిస్థితులకు అద్దం పట్టింది. అల్లర్లపై నిగ్గు తేల్చేందుకు ఏర్పాటైన వినీత్ బ్రిజిలాల్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏడు హింసాత్మక ఘటనలపై చట్ట పరమైన చర్యలకు సిఫారసు చేసింది. ఆ ఘటనల్లో తన తప్పు లేదంటూ రాష్ట్ర ప్రభుత్వానికి బిందు మాధవ్ వివరణ ఇచ్చారు. ప్రభుత్వం పరిశీలించి ఇటీవలే సస్పెన్షన్‌ను రద్దు చేసింది. ప్రస్తుతం ఆయన కాకినాడ జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు.

## కేరళ డీజీపీగా పశ్చిమ గోదారి వాసి

- రావాడ ఆజాద్ చంద్రశేఖర్ స్వగ్రామంలో బంధువుల ఆనందోత్సాహాలు



భీమవరం టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్ర పోలీస్ బాస్‌గా పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం గ్రామానికి చెందిన రావాడ ఆజాద్ చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు కేరళ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన విషయం తెలియడంతో చంద్రశేఖర్ స్వగ్రామం వీరవాసరంలో ఆయన బంధు మిత్రులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. ఆయన 1991 బ్యాచ్‌కు చెందిన కేరళ కేడర్ ఐపీఎస్ అధికారి. కేరళలో పోలీస్ ఉన్నతాధికారిగా పలు కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి రాష్ట్రపతి నుంచి ఉత్తమ సేవల అవార్డును సైతం అందుకున్నారు. ప్రస్తుతం డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసుల్లో ఉన్న ఆయనను కేరళ ప్రభుత్వం డీజీపీగా నియమిస్తున్నట్టు ప్రకటించింది. కేరళ డీజీపీ షేక్ దర్వేష్ సాహెబ్ సోమవారం ఉద్యోగ విరమణ చేయడంతో నూతన డీజీపీగా చంద్రశేఖర్‌ను ఆ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

# గుడులపైనే గురి!

(మొదటి పేజీ తరువాయి)

జరిగింది. ఇదే కోవలో ఆలయాలను వివాదంలోకి లాగుతూ కొన్ని ఉదంతాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. రెండు నెలల క్రితం విజయవాడ దుర్గమ్మ ప్రసాదంలో మేకు వచ్చిందని హడావుడి చేశారు. నిన్న శ్రీశైలం లడ్డూ ప్రసాదంలో బొద్దింక వచ్చిందని యాగీ సృష్టించారు. అయితే, ఈ ఘటనల వెనుక వైసీపీ నేతలున్నారా లేక ఇవి అసాంఘిక శక్తులు, ఆగతాయిల దుశ్చర్యలా అనేది స్పష్టత రావడం లేదు.

### నెల్లూరువాసి నిర్వాకం..

శ్రీశైలం లడ్డూ ప్రసాదంలో బొద్దింక వచ్చిందంటూ ఓ భక్తుడు సోషల్ మీడియాలో గత ఆదివారం ఫేక్ ప్రచారం చేశాడు. అదే విషయం ఆయన ఆలయ అధికారులకు కూడా ఫిర్యాదు చేశాడు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన శరత్ చంద్ర ఈ నిర్వాకానికి పాల్పడినట్టు దేవస్థాన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. అధికారులు, పోలీసుల కథనం ప్రకారం, శరత్ చంద్ర తన మిత్ర బృందంతో కలిసి ఈనెల 28న శ్రీశైల మలన్న దర్శనానికి వచ్చాడు. ఆదివారం ఉదయం దర్శనం అనంతరం మిత్రులందరూ కలిసి ప్రసాద కేంద్రంలో లడ్డూను కొనుగోలు చేశారు. కావాలని శరత్ చంద్ర ఆ లడ్డూలోకి మిడతను (బొద్దింక అని ప్రచారం చేశారు) దూర్చాడు. మిత్రులతో కలిసి వెళ్లి లడ్డూ విక్రయ కేంద్రం సిబ్బందితో గొడవపడ్డాడు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయింది. వెంటనే స్పందించిన ఈవో శ్రీనివాసరావు ఆలయ అధికారులను అప్రమత్తంచేశారు. అధికారులు ప్రసాదాల తయారీ, లడ్డూ కౌంటర్లతో పాటు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అయితే ఎక్కడా ఎలాంటి లోపం కనిపించలేదు. అదే విషయం తన నివేదికలో ఈవో స్పష్టం చేశారు. ఆ నివేదికను పరిశీలిస్తే ఆలయాలు, హిందుత్వపై ఏ స్థాయిలో కుట్ర సాగుతుందో తెలిసిపోతోంది. లడ్డూను కొనుగోలు చేసిన తర్వాత, దానిలో బొద్దింకను దూర్చడం సీసీ కెమెరాల్లో నమోదైందని ఆ నివేదిక తెలిపింది.



### అది వైసీపీ హయాం వీడియో..

కనకదుర్గమ్మ లడ్డూ ప్రసాదంలో మేకు వచ్చిందని సోషల్ మీడియాలో ప్రచారం సాగింది. భక్తుల భద్రత దేవదాయశాఖకు పట్టడం లేదని అప్పట్లో దుమ్మెత్తిపోశారు. అయితే, అసలు విషయం అధికారుల విచారణలో బయటపడింది. వాస్తవానికి ఈ మేకు ఘటన 2019లో జరిగింది. అప్పటి వీడియోను కొంతమంది ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ప్రశాంతతకు మారుపేరైన టీటీడీ ఆలయాన్ని తరచూ వివాదంలోకి లాగే ప్రయత్నం జరుగుతోంది. గతంలో స్వామి వారి పింక్ డైమండ్ పోయిందని మీడియాలో వైసీపీ నేతలు హల్‌చల్ చేశారు. స్వామి ఆభరణాలు మొత్తం తనిఖీలు చేసి అవి నిరాధారణమైన ఆరోపణలని అప్పట్లోనే చంద్రబాబు ప్రభుత్వం తేల్చేసింది. అసలు పింక్ డైమండ్ ఉందా అన్న అనుమానాలు కూడా ఆనాడు వ్యక్తమయ్యాయి. తిరుమలలో అన్యమత ప్రచారం ఉద్దేశపూర్వకంగానే చేస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది కావాలనే అన్యమత ప్రచార పుస్తకాలు, వస్తువులను కొండపైకి తీసుకెళ్లి ప్రచారం చేస్తున్నారు. అన్యమత ప్రచారాన్ని ప్రభుత్వం ఎంత కట్టడి చేసినా పరిస్థితి పూర్తిస్థాయిలో అదుపులోని రావడం లేదు. కొన్ని రాజకీయ పార్టీలు, వారి రాజకీయ మనుగడ కోసం ఆలయాలను, లడ్డూ ప్రసాదాలపై దుష్ప్రచారాలు చేసి హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా కుట్రలు చేస్తున్నారు.

### జాగ్రత్తలు అవసరం...

కుట్రపూరితంగా నిరాధార ఆరోపణలు చేసే వారి పట్ల టీటీడీ, దేవదాయ శాఖ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో నిత్యం సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలి. శ్రీశైలం దేవస్థానంలో సీసీ కెమెరాలు ఉండడం వల్లనే లడ్డూలో ఉద్దేశ పూర్వకంగా కీటకాన్ని పెట్టారన్న విషయం వెలుగులోకి వచ్చింది. సీసీ కెమెరాలు లేకపోతే నిజంగానే మిడత వచ్చిందని నమ్మాల్సిన పరిస్థితి ఉంటుంది. కాబట్టి రాష్ట్రంలోని ప్రతి ఆలయాన్నీ సీసీ కెమెరాల పర్యవేక్షణలోకి తీసుకురావాలి. మరీముఖ్యంగా కేంద్ర పర్యవేక్షణ విభాగం ఏర్పాటు చేస్తే ఇంకా మంచిది. రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో ఏర్పాటు చేసే సీసీ కెమెరాలను ప్రధాన కార్యాలయానికి అనుసంధానం చేయాలని భక్తులు సూచిస్తున్నారు. మరోవైపు లడ్డూ, ప్రసాదం తయారీ కేంద్రాల్లో ఫుడ్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలి. చాలా ఆలయాల్లో ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నిబంధనల ప్రకారం ప్రసాదాలు తయారు చేస్తే నిరాధారమైన ఆరోపణలకు చెక్ పెట్టే అవకాశం ఉంటుంది.

## తక్కువ ధరకు బంగారు ఇప్పిస్తామని.. రూ.7.32 కోట్లు కొట్టేశారు!

- కర్నూలులో నలుగురి అరెస్టు
- బాధితుడు విజయవాడకు చెందిన వైద్యుడు

కర్నూలు క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని ఓ వైద్యుడి నుంచి రూ.7.32 కోట్లు కొట్టేసిన ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ సోమవారం విలేకరులకు నిందితుల వివరాలు వెల్లడించారు. విజయవాడ సూర్యారావు పేట చెందిన డాక్టర్ రాజేంద్రప్రసాద్‌కు తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తామని దేవరకొండ సుధీర్, పీటర్ పాల్, శివ కుమార్ రెడ్డి తదితరులు నమ్మించారు. ఈంతో ఆయన రూ.7.32 కోట్ల మొత్తాన్ని వారి అకౌంట్లకు బదిలీ చేశారు. అయితే బంగారం ఇవ్వకుండా మోసం చేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదిచ్చారు. జూన్ 26న నిందితులు నెల్లూరు జిల్లా కావలిలో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లగా దేవరకొండ సుధీర్, పీటర్ పాల్, శివకుమార్ రెడ్డి త్రుటిలో తప్పించుకున్నారు. కాగా, కొట్టేసిన సొమ్ముతోనే పీటర్ పాల్, సుధీర్ కొత్త ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు పోలీసులు గుర్తించి, వాటిని సీజ్ చేశారు. వారి ఇళ్లలో సోదాలు చేసి, పోలీసుల యూనిఫామ్‌లతో పాటు రూ.40 వేల నగదు, రెండు క్యాష్ కౌంటింగ్ మిషన్లు, రెండు పోలీసు లాఠీలు, హెచ్‌పీ ల్యాప్‌టాప్, రెండు వాకీటాకీలు, అదే సమయంలో మిగతా నిందితులు కావలికి చెందిన పోతురాజు రతన్ కుమార్, పోతురాజు శాంతి పవన్ కుమార్ అలియాస్ వసంత్, కట్ట శ్రీకాంత్ అలియాస్ విశ్వనాథ్ బుచ్చిరెడ్డిపాలెం మండలం కొవ్వూరుకు చెందిన పాలకుర్తి జశ్వంత్‌ను కర్నూలులో అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మూడు స్మార్ట్ ఫోన్లు, దొంగ బంగారం చిన్న బిస్కెట్లు 16, పెద్దవి 15 బిస్కెట్లు రూ.6 లక్షలు నగదు, మూడు కార్లను స్వాధీనం చేసుకున్నారు. దేవరకొండ సుధీర్, పీటర్ పాల్, శివకుమార్ రెడ్డి కోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు.

# నేటి నుంచి రైలు చార్జీల పెంపు

- ఏసీ - కిలో మీటర్‌కు 2 పైసలు
- నాన్ ఏసీ - కి.మీ.కి 1 పైస
- సర్క్యులర్ జారీ చేసిన రైల్వే శాఖ
- తత్కాల్‌కు ఆధార్ లింక్ కూడా..




న్యూఢిల్లీ/హైదరాబాద్ సిటీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తత్కాల్ టికెట్ కోసం ఆధార్ నెంబరును తప్పనిసరి చేస్తూ రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయం మంగళవారం నుంచే అమల్లోకి రానుంది. తత్కాల్ టికెట్ కావాలనుకునే వారు ఆధార్ నెంబరును ఎంటర్ చేస్తే రిజిస్టర్ మొబైల్ నెంబరుకు ఓటీపీ వస్తుంది. దాని ఆధారంగా టికెట్ మంజూరవుతుంది. తత్కాల్ టికెట్ల ప్రయోజనాన్ని అసలైన ప్రయాణికులు మాత్రమే పొందేలా ఈ మార్పులు చేసింది. బాట్ సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించిన అనుమానాస్పద వ్యక్తులు టికెట్లు బుక్ చేస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకొంది. అలాంటి వ్యక్తులకు సంబంధించిన సుమారు 2.5 కోట్ల ఖాతాలను బ్లాక్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అందువల్ల ఐఆర్‌సీటీసీ ద్వారా తత్కాల్ ఇ-టికెట్ బుకింగ్ కోసం ఆధార్‌ను తప్పనిసరి చేసింది. రైల్వే కౌంటర్ వద్ద కూడా ఇదే విధానం అమలవుతుంది. తత్కాల్ టికెట్ బుకింగ్ ప్రారంభమైన మొదటి 30 నిమిషాలు ఆన్‌లైన్ వినియోగదారులకు, స్టేషన్లలోని కౌంటర్ల వద్ద నిలబడే వ్యక్తులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ట్రావెల్ ఏజెంట్లు, అధీకృత ఏజెన్సీలు అరగంట తర్వాత టికెట్లను బుక్ చేసుకోవచ్చు. ఆధార్ లేని వినియోగదారులు, తత్కాల్ టికెట్ బుకింగ్‌ను కౌంటర్లు లేదా అధీకృత ట్రావెల్ ఏజెంట్ల వద్ద చేసుకోవచ్చు. ఇది జూలై 15 నుంచి అమల్లోకి రానుంది.

### సబర్బన్ రైళ్లలో పెంపు లేదు

రైల్వే చార్జీలను పెంచుతూ సోమవారం రైల్వే మంత్రిత్వ శాఖ సర్క్యులర్ జారీ చేసింది. ఏసీ ఎక్స్‌ప్రెస్/మెయిల్ రైళ్లకు ప్రతి కిలోమీటరుకు 2 పైసలు చొప్పున, నాన్ ఏసీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రతి కిలోమీటరుకు ఒక పైస చొప్పున పెంచుతున్నట్లు తెలిపింది. పెంచిన చార్జీలు మంగళవారం నుంచి (సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత) అమల్లోకి వస్తాయని పేర్కొంది. చార్జీలను పెంచనున్నట్లు ఈ నెల 24న సూచనప్రాయంగా తెలిపింది. వివిధ రైళ్లకు, తరగతులకు పెంచిన చార్జీలను టేబుల్ రూపంలో పేర్కొంటూ సోమవారం అధికారిక సర్క్యులర్‌ను జారీ చేసింది. రోజువారీ ప్రయాణికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సబర్బన్ రైళ్లు, నెలవారీ సీజన్ టిక్కెట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. ఆర్డినరీ సెకండ్ క్లాస్ టికెట్ల చార్జీల్లో 500 కి.మీ.వరకు ఎలాంటి మార్పులు చేయలేదు. 500 కి.మీ. దాటితే మాత్రం ప్రతి కిలోమీటరుకు అర పైస చొప్పున పెంచింది. ఆర్డినరీ స్లీపర్ క్లాస్, ఫస్ట్‌క్లాస్ తరగతులకు కూడా అర పైస చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. పెంచిన ఛార్జీలు మంగళవారం నుంచి బుక్ చేసుకున్నవారికే వర్తిస్తాయి. ఇప్పటికే రిజర్వేషన్ చేయించుకున్నవారికి మాత్రం పాత చార్జీలే అమల్లో ఉంటాయి. సెకండ్ క్లాస్ ఆర్డినరీకి 501 కి.మీ. నుంచి 1,500 కి.మీ. వరకు రూ. 5 చొప్పున టికెట్ ధర పెరిగింది. 1,501 నుంచి 2,500 కిలోమీటర్ల దూరానికి రూ.10చొప్పున, 2,501 నుంచి 3,000 కి.మీ. దూరానికి రూ. 15 చొప్పున టికెట్ ధరలు పెరిగాయి.

## సార్క్‌కు ప్రత్యామ్నాయంగా కొత్త గ్రూప్?

### దక్షిణాసియా దేశాలతో చైనా, పాక్, బంగ్లాదేశ్ మంతనాలు

న్యూఢిల్లీ, జూన్ 30: భారతదేశం కీలక సభ్యదేశంగా ఉన్న సార్క్(దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘం)కు ప్రత్యామ్నాయంగా మరో కూటమిని ఏర్పాటు చేసేందుకు చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ ప్రయత్నిస్తున్నాయి. పాకిస్థాన్‌కు చెందిన 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' కథనం మేరకు ఈ విషయంలో పాక్, చైనా చర్చలు కీలక దశకు చేరుకున్నాయి. ఇదే అంశంపై చైనాలోని కున్మింగ్‌లో జూన్ 19న నిర్వహించిన సమావేశంలో బంగ్లాదేశ్ కూడా భాగస్వామ్యమైంది. 'సార్క్‌లో సభ్యదేశాలుగా ఉన్న ఇతర దక్షిణాసియా దేశాలను కొత్త గ్రూప్‌లో చేరేలా ఆహ్వానించడమే కున్మింగ్ భేటీ లక్ష్యం' అని ఆ కథనం పేర్కొంది. శ్రీలంక, మాల్దీవులు, అఫ్ఘానిస్థాన్ సహా సార్క్ సభ్యదేశాలు కొత్త గ్రూప్‌లో చేరే అవకాశం ఉందని పేర్కొంది. కాగా, ఈ కథనాన్ని బంగ్లాదేశ్ ఖండించింది. సార్క్‌లో భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, అఫ్ఘానిస్థాన్, భూటాన్, నేపాల్, మాల్దీవులు సభ్యదేశాలుగా ఉన్నాయి. 1985 డిసెంబరు 8న బంగ్లాదేశ్ రాజధాని ఢాకా వేదికగా ఏడు దేశాలతో సార్క్ ఏర్పాటైంది. 2007లో అఫ్ఘానిస్థాన్ చేరింది.

## బంగ్లాదేశ్‌లో హిందూ మహిళపై అకృత్యం

ఢాకా, జూన్ 30: బంగ్లాదేశ్‌లో హిందూ మహిళపై ఒక వ్యక్తి అకృత్యానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో తలుపులు బద్దలు కొట్టి లోనికి ప్రవేశించి బాధితురాలిని వివస్త్రను చేసి, తీవ్రంగా కొట్టి, అత్యాచారానికి పాల్పడ్డాడు. కుమిల్లా జిల్లా మురాద్‌నగర్‌లో జూన్ 26న జరిగిందీ దారుణం. బాధితురాలి(21) భర్త దుబాయిలో పనిచేస్తున్నారు. 'హరిసేవ' పండుగ సందర్భంగా ఆమె తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇటీవల మురాద్‌నగర్‌లోని పుట్టింటికి వచ్చారు. స్థానికుడైన ఫజర్ అలీ(36) వద్ద ఆమె తండ్రి రూ.35 వేలు అప్పు తీసుకున్నారు. అప్పు తీర్చాల్సిన గడువు ముగియడంతో గురువారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో వారి ఇంటికి ఫజర్ అలీ వచ్చాడు. తలుపు బద్దలు కొట్టి లోనికి ప్రవేశించాడు. ఆమెపై దాడి చేశాడు. అత్యాచారానికి పాల్పడ్డాడు. ఫజర్ అలీని పోలీసులు అరెస్టు చేశారు. తనను కొట్టొద్దంటూ బాధితురాలు వేడుకొంటున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆదివారం దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమైంది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఢాకా యూనివర్సిటీ విద్యార్థులు రోడ్లపైకి వచ్చి భారీ ప్రదర్శనలు నిర్వహించారు.

## అమ్మ చనిపోదామంటోంది మేడం!

- గుంటూరు కలెక్టర్‌ను కదిలించిన పదేళ్ల బాలుడు
- జీజీహెచ్ వద్ద టిఫిన్ బండి ఏర్పాటుకు వినతి

గుంటూరు తూర్పు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పదేళ్ల బాలుడి జీవన పోరాటం కలెక్టర్‌నే కదిలించింది. గుండె జబ్బుతో బాధపడుతూ.. పోషణ భారమైన కుటుంబానికి తనే పెద్ద దిక్కయ్యాడు. తొలగించిన తమ టిఫిన్ బండి పెట్టుకోవడానికి జీజీహెచ్ వద్ద చిన్న చోటు ఇస్తే.. జీవనాధారం లేక చనిపోదామనుకుంటున్న అమ్మ ఆలోచనను మార్చి బతుకు 'బండి' ఈడుస్తామని ఆ చిన్న చేతులు.. జిల్లా అధికారికి అర్జీ అందించాయి. స్థానిక వెంకట్రావ్ పేటకు చెందిన యశ్వంత్ అనే బాలుడు.. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ నాగలక్ష్మిని కలిసి తమ సమస్య విన్నవించాడు. ట్రాఫిక్ సమస్యలు, రోడ్ల విస్తరణ కారణాలతో నగర పాలక సంస్థ అధికారులు గతంలో జీజీహెచ్ వద్ద టిఫిన్ బండ్లను తొలగించారని, ఆ తర్వాత ప్రజాప్రతినిధుల సిఫారసుతో కొంత మంది బండ్లను మళ్లీ ఏర్పాటు చేసుకున్నారని తెలిపాడు. అయితే తమకు మాత్రం అనుమతి ఇవ్వకుండా వేధిస్తున్నారని వాపోయాడు. తన తల్లి రాధిక అధికారులను కలిసినా ఫలితం లేదని ఆవేదన చెందాడు. తమ కుటుంబానికి జీవనాధారమైన బండిని తొలగించడంతో పోషణ భారమైందని చెప్పాడు. ఇప్పటికే తాను గుండె జబ్బుతో బాధపడుతున్నానని, తనకు 16 ఏళ్లు వచ్చిన తర్వాత శస్త్రచికిత్స నిర్వహిస్తామని వైద్యులు చెప్పారని కలెక్టర్‌కు వివరించాడు. నెలకు రూ.6 వేల వరకు మందులకే అవసరమని పేర్కొన్నాడు. వీటిని దృష్టిలో పెట్టుకుని జీజీహెచ్ మరో ద్వారం వద్ద రైల్వేస్టేషన్ గేటు పక్కన టిఫిన్ బండి ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశాడు. బాలుడి విజ్ఞాపన కలెక్టర్‌ను కదిలించింది. వేగంగా స్పందించిన కలెక్టర్ బాలుడు అడిగిన చోటే బండి ఏర్పాటు చేసుకునేలా అనుమతి ఇవ్వాలని కమిషనర్‌ను ఆదేశించారు.

## సీఎం మార్పు అధిష్ఠానం చేతుల్లో!

- కర్ణాటక నేతలకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే స్పష్టం
- ఖర్గే కాకుంటే.. ఇంకెవరు హైకమాండ్?: బీజేపీ


బెంగళూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో సీఎం మార్పుపై జరుగుతున్న ప్రచారంపై కాంగ్రెస్ ఖర్గే స్పందించారు. అలాంటి అంశాలపై అధిష్ఠానం మాత్రమే నిర్ణయం తీసుకుందన్నారు. 'అనవసర సమస్యలు' సృష్టించవద్దని పార్టీ నేతలకు హెచ్చరికలు చేశారు. ఖర్గే సోమవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. అక్టోబరులో రాష్ట్రంలో నాయకత్వ మార్పు ఉంటుందా అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. 'చూడండి, అది హైకమాండ్ చేతుల్లో ఉంటుంది. అధిష్ఠానంలో ఏం జరుగుతుందో ఇక్కడ ఎవరూ చెప్పలేరు. తదుపరి ఏ చర్య అయినా తీసుకొనే అధికారం వారికే ఉంటుంది' అన్నారు. ఖర్గే వ్యాఖ్యలపై ప్రతిపక్ష బీజేపీ నేత అశోక్ స్పందించారు. ఖర్గేకు కాంగ్రెస్ పార్టీకి యాక్సిడెంటల్‌గా అధ్యక్షుడు అయ్యారని వ్యాఖ్యానించారు. "పార్టీ అధ్యక్షుడు హైకమాండ్ కాకుంటే.. ఇంకెవరు" అని బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య ప్రశ్నించారు. మరోవైపు ప్రభుత్వంలో చీలిక ఉందనే ప్రచారాన్ని సీఎం సిద్దరామయ్య కొట్టిపారేశారు. తమ ప్రభుత్వం రాయిలాగా ఐదేళ్లు ధ్రుడంగా ఉంటుందన్నారు. ఓ కార్యక్రమంలో శివకుమార్‌తో చేతులు కలిపి, పైకెత్తి ఐక్యతను చాటారు.

## భారీ వర్షాలతో ముగ్గురి మృతి

సిమ్లా, జూన్ 30: హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాన్ని భారీవర్షాలు కుదిపేస్తున్నాయి. ఈ కారణంగా 24 గంటల్లో ముగ్గురు మృతి చెందారు. దీంతో ఈ ఏడాది వర్షాల కారణంగా హిమాచల్‌లో మరణాల సంఖ్య 20కి పెరిగింది. సిమ్లాలో 5 అంతస్తుల ఓ భవనం సోమవారం కుప్పకూలింది. అందులో నివాసం ఉంటున్నవారు ముందుగానే బయటపడడంతో ఎవరికీ ప్రమాదం వాటిల్లలేదు. భారీవర్షాల కారణంగా రాష్ట్రంలోని 259 రోడ్లను మూసివేశారు. సోలన్‌లో ఒక వంతెన కొట్టుకుపోయింది. రాష్ట్రంలోని 130 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కాంగ్రా, మండి, సిర్మౌర్, సోలన్ జిల్లాల్లో సోమవారం పాఠశాలలను మూసివేయాల్సిందిగా సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు ఆదేశించారు. సిమ్లా-కాల్కా రైల్వే లైనులో భారీ వర్షాలకు ట్రాక్‌పై బండరాళ్లు పడడంతో రైళ్లు నడవలేదు.

# మనకూ బంకర్ బస్టర్ బాంబులు

- అమెరికా తరహాలో అభివృద్ధిపై భారత్ దృష్టి
- 7,500 కిలోల వార్‌హెడ్ మోసుకెళ్లేలా అగ్ని-5లో మార్పులు



న్యూఢిల్లీ, జూన్ 30: ఇటీవల ఇరాన్‌లోని అణు కేంద్రాలపై అమెరికా ప్రయోగించిన బంకర్ బస్టర్లు తీవ్ర నష్టం కలిగించాయి. దీంతో వాటి సత్తా ఏమిటో ప్రపంచానికి తెలిసింది. ఈ నేపథ్యంలో భారత్ కూడా అమెరికా తరహాలో బంకర్ బస్టర్ బాంబుల తయారీపై దృష్టిపెట్టింది. అయితే వీటిని యుద్ధ విమానాలపై నుంచి కాకుండా క్షిపణుల ద్వారా ప్రయోగించేందుకు వీలుగా అగ్ని-5 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిలో మార్పులు చేస్తున్నట్టు తెలిసింది. దీనికోసం ఇప్పటికే రంగంలోకి దిగిన డీఆర్‌డీవో భారీ బంకర్ బస్టర్ బాంబును మోసుకెళ్లేందుకు వీలుగా అగ్ని-5 మిస్సైల్‌లో మార్పులు చేస్తోంది. ప్రస్తుతం అగ్ని-5 క్షిపణి గరిష్ఠంగా 5 వేల కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదు. అణ్వాయుధ ప్రయోగాల కోసం దీన్ని రూపొందించారు. అయితే ఈ అణు వార్‌హెడ్ స్థానంలో 7,500 కిలోల బరువుండే బంకర్ బస్టర్ బాంబులను మోసుకెళ్లగలిగేలా డీఆర్‌డీవో మార్పులు చేస్తోంది. కాంక్రీటు గోడలతో శత్రు దుర్భేద్యంగా నిర్మించిన భూగర్భ కేంద్రాల (బంకర్లు)ను సైతం ధ్వంసం చేసేలా దీన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో దీని పరిధిని కూడా 2,500 కిలోమీటర్లకు కుదించారు. అలాగే ఇది మోసుకెళ్లే బంకర్ బస్టర్ బాంబు 80 నుంచి 100 మీటర్లమేర భూగర్భంలోకి చొచ్చుకుపోగలదని భావిస్తున్నారు. అగ్ని-5తో పోలిస్తే కొత్త వేరియంట్‌లో 2,500 కిలోమీటర్ల పరిధి తగ్గినప్పటికీ.. విధ్వంసక సామర్థ్యం, కచ్చితత్వం భారత వ్యూహాత్మక ఆయుధాల్లో దీన్ని కీలక శక్తిగా మారుస్తుందని నిపుణులు భావిస్తున్నారు. పాకిస్థాన్, చైనా వంటి దేశాలలోని కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాలు, భూగర్భ క్షిపణి, సైనిక స్థావరాలను ధ్వంసం చేయడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు. బంకర్ బస్టర్ బాంబులను ప్రయోగించడం కోసం గ్ని-5లో రెండు కొత్త రకాలను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిసింది. వీటిలో ఒకటి భూమిపై ఉన్న లక్ష్యాల కోసం రూపొందిస్తుండగా.. మరొకటి భూగర్భంలోని లక్ష్యాలను ఛేదించేదిగా ఉండనుంది.

## థార్ ఎడారిలో.. దాహంతో అలమటించి పాకిస్థానీ హిందూ యువ జంట మృతి



జైసల్మేర్, జూన్ 30: పదిహేడేళ్ల రవికుమార్.. పదిహేనేళ్ల శాంతి బాయి.. పాకిస్థాన్‌కు చెందిన హిందువులు! వారికి ఈ మధ్యే సింధ్ ప్రావిన్సులోని మీర్‌పూర్‌లో పెళ్లయింది! ఆర్థిక సంక్షోభంతో అల్లాడుతున్న పాక్‌లో బతకలేం అనుకున్నారో.. ఇంకే కష్టం వచ్చిందో.. ఆ యువ దంపతులు భారతదేశానికి వచ్చి స్థిరపడాలనుకున్నారు. అందుకు అవసరమైన వీసాల కోసం దరఖాస్తు కూడా చేసుకున్నారు. కానీ.. పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో వారి దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో అక్రమంగానైనా భారత్‌లోకి ప్రవేశించాలనుకు థార్ ఎడారి బాట పట్టారు. దాహానికి తాళలేక.. ఎడారి మధ్యలోనే.. ప్రాణాలు కోల్పోయారు!! ఆ జంట నీటి కోసం ఎంత అలమటించిందో చెప్పడానికి.. ఎడారిలో పడి ఉన్న రవికుమార్ ముఖం మీద ఉన్న ఖాళీ నీటి డబ్బానే నిదర్శనం! ఆ జంట అసువులు బాసిన ఐదారు రోజుల తర్వాత.. శనివారంనాడు స్థానిక పశువుల కాపరులు గుర్తించి సరిహద్దు భద్రతా దళాలకు సమాచారం అందించారు. గుర్తింపు కార్డుల ఆధారంగా వారి సమాచారాన్ని పోలీసులు తెలుసుకోగలిగారు. ఇద్దరూ పాకిస్థాన్‌లోని సింధ్ జిల్లాకు చెందినవారని పోలీసులు తెలిపారు. వారి వద్ద పాకిస్థానీ సిమ్ కార్డు ఉందని.. నవ వధువులు ధరించే ఎరుపు, తెలుపు గాజులు శాంతిబాయి చేతికి ఉన్నాయని చెప్పారు. 'హిందూ పాకిస్థానీ డిస్‌ప్లేస్డ్ యూనియన్ అండ్ బోర్డర్ పీపుల్స్ ఆర్గనైజేషన్'కు చెందిన దిలీప్ సింగ్ ఆ జంట ఫొటోలను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసి వివరాలు కోరగా.. పాక్ నుంచి స్పందన వచ్చింది. ఆ వివరాల ప్రకారం.. వారిద్దరూ జూన్ 21వ తేదీన తమ ఇంటి నుంచి మోటార్‌సైకిల్‌పై బయల్దేరారు. ఆ బైక్‌ను ఇండో-పాక్ సరిహద్దుల్లోని నూర్‌పూర్ దర్గా వద్ద పార్క్ చేసి, అక్కణ్నుంచీ కాలినడకన సరిహద్దు దాటి రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లోకి ప్రవేశించారు. అంతర్జాతీయ సరిహద్దు నుంచి 11 కిలోమీటర్ల దూరం ప్రయాణించి.. అక్కడ ప్రాణాలు కోల్పోయారు.

# ఉద్యోగ విరమణ వయసు పెంపు కోసం రాయ'బేరాలు'

- ఆచార్య ఎన్‌జీ రంగా వర్సిటీలో వసూళ్ల పర్వం
- సీనియర్ అధ్యాపకుల నుంచి లక్షల్లో వసూలు
- తమకు అన్యాయం జరుగుతుందంటున్న పీహెచ్‌డీ స్కాలర్లు
- జీవో 39 అమలు చేయవద్దంటూ సీఎంకు ఫిర్యాదులు

(ఆంధ్రజ్యోతి-గుంటూరు)



ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సీనియర్ ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయసు పెంపు వ్యవహారం కుంపటిని రాజేసింది. సీనియర్ ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును 62 నుంచి 65 సంవత్సరాలకు పెంచే జీవో అమలు కోసం కొందరు చేస్తున్న ప్రయత్నాలపై సీఎం కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లాయి. భారీగా ముడుపులు వసూలు చేస్తున్నారంటూ వర్సిటీలోని పీహెచ్‌డీ స్కాలర్లు సీఎం ముఖ్య కార్యదర్శికి లేఖ రాయడం కలకలం రేపుతోంది. బోధన సిబ్బందికి పెంచితే తమకూ పెంచాలని బోధనేతర సిబ్బంది కూడా డిమాండ్ చేస్తుండటంతో రెండు గ్రూపులుగా విడిపోయినట్లు తెలుస్తోంది. విశ్వవిద్యాలయాల్లోని అధ్యాపకుల పదవీ విరమణ వయసును 62 నుంచి 65 సంవత్సరాలకు పెంచుతూ గత వైసీపీ ప్రభుత్వం 2023 జూలై 29న జీవో 39ని తీసుకువచ్చింది. ఈ జీవోపై అప్పట్లోనే పెద్ద ఎత్తున దుమారం రేగటంతో అమలును కొంతకాలం పెండింగ్‌లో పెట్టింది. అనంతరం ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో జీవోను అమలు చేయించేందుకు ఎన్‌జీ రంగా వర్సిటీలోని కొందరు సీనియర్ అధ్యాపకులు ప్రయత్నాలు ప్రారంభించారు. అందుకోసం ప్రభుత్వంలో ఉన్న వారికి పెద్ద ఎత్తున ముట్టజెప్పాలని వసూళ్ల పర్వానికి తెరలేపారు. జీవో అమలైతే లబ్ధి పొందే సుమారు 60 మంది సీనియర్ అధ్యాపకుల నుంచి లక్షల్లో వసూలు చేసేందుకు ఓ ముఖ్య అధికారి మనుషులను రంగంలోకి దింపినట్లు ఆరోపణలున్నాయి. ఈ 60 మందికి మరో మూడేళ్లు అవకాశం వస్తే ఒక్కొక్కరికి సుమారు 1.50 కోట్ల వరకు ఆర్థిక ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఈ లెక్కలు వేసి మరీ ముడుపులు భారీగా వసూలు చేస్తున్నారని సీఎంకు పంపిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సీనియర్ అధ్యాపకుల పదవీ విరమణ వయసు పెంపు వల్ల ఇప్పటికే యూనివర్సిటీలో విద్యనభ్యసించి డాక్టరేట్లు పొందిన 2500 మందికి, పీహెచ్‌డీ చేస్తున్న మరో 700 మంది స్కాలర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందంటూ పీహెచ్‌డీ స్కాలర్లు సీఎం ముఖ్య కార్యదర్శికి చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సీనియర్ అధ్యాపకులు ఒక్కొక్కరు ప్రస్తుతం రూ.3 లక్షలు వరకు జీతం తీసుకుంటున్నారని, వారి పదవీ విరమణ వయసు మరో మూడేళ్లు పెంచితే రాష్ట్ర ప్రభుత్వంపై రూ.70 కోట్ల వరకు ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. వర్సిటీకి చెందిన ముఖ్య అధికారి ధన దాహంతో అంతమంది భవిష్యత్తుపై దెబ్బ కొడుతున్నారని పేర్కొన్నారు.

## మంగళగిరి ఎయిమ్స్ వద్ద ఎగ్జిట్ ర్యాంప్‌నకు గ్రీన్‌సిగ్నల్: పెమ్మసాని

న్యూఢిల్లీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రజల వైద్య అవసరాలను దృష్టిలో పెట్టుకొని, మంగళగిరి ఎయిమ్స్ చేరుకోవడానికి మంగళగిరి (ఎన్‌హెచ్-16) వద్ద ఉన్న ఎంట్రీ ర్యాంప్‌ను ఎగ్జిట్ ర్యాంప్‌గా మార్చేందుకు కేంద్ర రహదారుల శాఖ ఆమోదం తెలిపిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఈ మేరకు తనకు లేఖ రాశారని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం నిర్ణయం కారణంగా ఎయిమ్స్‌కు చేరుకోవాల్సిన దూరం 4.66 కి.మీ నుంచి 1.26 కి.మీకు తగ్గుతుందని, అత్యవసర వైద్యం, రోగుల తరలింపు, వైద్య సిబ్బంది రాకపోకలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అలాగే ఎన్‌హెచ్-16 పై మూడు కీలక ప్రదేశాల్లో మొత్తం 13 డైరెక్షన్ల బోర్డులను ఏర్పాటు చేయడానికి కూడా అనుమతి లభించిందన్నారు. దీంతో ప్రయాణికులకు ఎయిమ్స్ మంగళగిరి చేరుకోవడానికి స్పష్టమైన మార్గదర్శనం లభిస్తుందని వివరించారు.

## మల్లన్న సన్నిధిలో జస్టిస్ ఎన్వీ రమణ



జస్టిస్ ఎన్వీ రమణ దంపతులకు మల్లికార్జున స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామిని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు సోమవారం తెల్లవారుజామున దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి అర్చకులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఈవో శ్రీనివాసరావు వారికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

## ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్లు ప్రారంభం

- నాలుగు క్యాంపస్‌లలో కౌన్సెలింగ్ నిర్వహణ

నూజివీడు/వేంపల్లె, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం నుంచి మొదలైంది. నూజివీడు, ఇడుపులపాయ క్యాంపస్‌లకు ఎంపికైన విద్యార్థులకు ఆయా క్యాంపస్‌లోనే కౌన్సెలింగ్ మొదలైంది. ఉదయం 8 గంటల నుంచి ఏలూరు జిల్లా నూజివీడు ఆర్జీయుకేటీ శాక్ ఆడిటోరియంలో మొదటి రోజు నూజివీడు క్యాంపస్‌కు సంబంధించి 505 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించగా 437 మంది అడ్మిషన్లు పొందారని నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. బాలురు 126 మంది, బాలికలు 311 మంది అడ్మిషన్లు పొందినట్టు చెప్పారు. కాగా.. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో మొత్తం 1,060 మంది చేరాల్సి ఉండగా మొదటి విడతగా 538 మందికి కాల్ లెటర్లు పంపించారు. వారిలో సోమవారం 481 మంది చేరారు.

## తిరుమల ఘాట్‌లో బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- మహిళ మృతి.. ఆమె భర్త, కుమారుడికి స్వల్ప గాయాలు

తిరుమల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమైన ఓ భక్తురాలు తిరుమల ఘాట్‌రోడ్డులో జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన సయ్యద్ రబ్బానీ, సయ్యద్ ఆరీఫా దంపతులు తమ కుమారుడు షమీర్‌తో కలిసి శ్రీవారి దర్శనార్థం శనివారం తిరుమలకు వచ్చారు. ఆదివారం రాత్రి దర్శనం చేసుకుని సోమవారం ఉదయం బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. ఘాట్‌రోడ్డులోని 24వ మలుపు వద్ద ఆర్టీసీ బస్సు ముందు భాగం తగలడంతో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కగా పడిపోయింది. ఈ క్రమంలో ఆరీఫా(41) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. రబ్బానీ, షమీర్ చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## టీటీడీ తనిఖీ అధికారుల బృందం నియామకం

తిరుమల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): టీటీడీ తనిఖీ (ఇన్‌స్పెక్టింగ్) అధికారుల బృందాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి టీటీడీ చీఫ్ ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి జి.సాయిప్రసాద్‌ను జూన్ 5వ తేదీన నియమించిన విషయం తెలిసిందే. తాజాగా, ఆయనకు సహాయకులుగా వివిధవిభాగాల నుంచి తొమ్మిదిమంది అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## లీజు అగ్రిమెంటు కోసం రూ.60 వేలు లంచం

- ఏసీబీ వలలో దేవదాయ శాఖ ఈవో
- డబ్బు తీసుకుంటుండగా పట్టివేత, అరెస్ట్

కొల్లూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా కొల్లూరు గ్రూపు దేవాదాయాల కార్యనిర్వహణాధికారి రూ.60 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు సోమవారం సాయంత్రం పట్టుబడ్డారు. కొల్లూరులోని అనంత భోగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన 16 దుకాణాల లీజును మూడేళ్లకోసారి పొడిగిస్తుంటారు. వాటిలో ఓ దుకాణ నిర్వాహకుడు మరణించడంతో ఆ దుకాణాన్ని అతని కుమారుడు సాయి పేరున లీజు అగ్రిమెంట్ చేసేందుకు కార్యనిర్వాహణాధికారి నాగిశెట్టి శ్రీనివాసరావు రూ.లక్ష లంచం డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేని బాధితుడు రూ.60 వేలు ఇస్తామని చెప్పగా, రూ.70 వేలు ఇవ్వాలని సూచించడంతో గత నెల 30న ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు సోమవారం ఈవోకు నగదు అందజేశారు. అక్కడే వేచి ఉన్న ఏసీబీ బృందం ఈవోను అరెస్ట్ చేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# బాల్య టీకాలు

ఒక మహా విపత్తు (కోవిడ్ మహమ్మారి) నుంచి అష్టకష్టాలతో బయటపడిన తరువాత కూడా నవజాత శిశువులు, బాల్యంలో ఉన్న పిల్లలు అందరికీ వ్యాధినిరోధక టీకాలు వేయడంలో సంపూర్ణ శ్రద్ధ చూపకపోవడాన్ని ఎలా గర్హించాలి? భారత్‌లో పిల్లల టీకా కవరేజీ తగ్గుతోందని 'ది లాన్సెట్ ' జర్నల్ తాజాగా వెల్లడించింది. ఏడాది వయస్సులోగా విధిగా వేయవలసిన టీకా మొదటి డోసుకు కూడా నోచుకోని పిల్లల (జీరో–డోస్ చిల్డ్రన్) సంఖ్యలో భారత్ ప్రపంచంలో ద్వితీయ స్థానంలో ఉన్నదని, అంతేకాకుండా పలు రాష్ట్రాలలోని అనేక జిల్లాలలో టీకా కవరేజీలో స్థానిక అంతరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆ నివేదిక పేర్కొంది.

మన శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థ వ్యాధుల నుంచి మనలను కాపాడుతుంది. తల్లి గర్భం నుంచి బయటకు వచ్చిన ఐదు సంవత్సరాల దాకా ఆ రోగ నిరోధక శక్తి పూర్తి స్థాయిలో ఉండదు. ఈ దశలో విధిగా టీకాలు వేయవలసిన అవసరమున్నది. టీకాలతో మన శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థ శక్తిమంతమై అనేక వ్యాధుల నుంచి మనకు రక్షణ కల్పిస్తుంది. బాల్యంలో వేసిన టీకాల కారణంగానే మశూచికం, పోలియో మొదలైన వ్యాధుల నుంచి మానవాళి విముక్తమయింది.

గత యాభై సంవత్సరాలలో 400 కోట్లకు పైగా బాలలకు టీకాలు వేయడం ద్వారా 15 కోట్లకు పైగా చిన్నారుల మరణాలను నివారించడం సాధ్యమయింది. వ్యాధులను వాటి వాటి హద్దుల్లో ఉంచుతున్న టీకాలను చిన్నపిల్లలకు సకాలంలో వేయడం తప్పనిసరి. కారణాలు ఏవైనా ఈ విషయంలో 2010 నుంచి జరుగుతోన్న జాప్యం ఆ వ్యాధుల పునర్ విజృంభణకు దారితీస్తోంది. ఆ ప్రమాదఘంటికలనే 'ది లాన్సెట్' మోగించింది.

2023లో భారత్‌లో రెండు కోట్ల మందికి పై కొత్త శిశువులు జన్మించగా వారిలో జీరో–డోస్ పిల్లలు 6.2 శాతం మేరకు ఉన్నారు. ఒక అధ్యయనం ప్రకారం 1992లో 33.4 శాతంగా ఉన్న జీరో–డోస్ బాలల శాతాన్ని 2016లో 10.1 శాతానికి తగ్గించడంలో భారత్ సఫలమయింది. కోవిడ్ విపత్తు పూర్వం 2019లో జీరో–డోస్ పిల్లల సంఖ్య 14 లక్షలుగా ఉన్నది. 2021లో ఈ సంఖ్య 27 లక్షలకు పెరిగి 2022లో 11 లక్షలకు తగ్గింది. 2023లో 14 లక్షలకు పైగా పెరిగింది. దీన్ని బట్టి పిల్లలకు సకాలంలో టీకాలు వేయడంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ ఎటువంటి మినహాయింపు లేకుండా పుట్టిన ప్రతి బిడ్డకు టీకా వేయడమనే లక్ష్యసాధన అసంపూర్ణంగానే ఉండిపోయిందని స్పష్టమవుతోంది.


సకాలంలో టీకా పొందలేకపోతున్న చిన్నారులు పేద, అణగారిన వర్గాలకు చెందినవారై ఉండడం ఒక కఠోర సత్యం. మారుమూల గ్రామీణ ప్రాంతాలు, అందుబాటులో లేని అటవీ ప్రాంతాల నివాసితులు అయిన ఎంతో మంది టీకాను సకాలంలో వేయించుకోలేకపోతున్నారు. మాతృమూర్తుల అవగాహనారాహిత్యం వారి బిడ్డలకు శాపంగా పరిణమిస్తోంది. కొన్ని సామాజిక వర్గాలు ముఖ్యంగా ముస్లింలలో టీకాల పట్ల సంకోచం కూడా జీరో–డోస్ పిల్లల సంఖ్య గణనీయంగా ఉండేందుకు కారణమవుతోంది. పౌర సమాజం ఓర్పు, నేర్పుతో ఈ టీకా సంకోచాన్ని తొలగించేందుకు, టీకాల పట్ల నిరక్షరాస్యులైన తల్లులలో అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలి. ఒక జిల్లాలోనే ఇరుగు పొరుగు ప్రాంతాల మధ్య వ్యాక్సినేషన్ అసమానతలను తొలగించేందుకు, పుట్టిన ప్రతి బిడ్డకు సకాలంలో టీకా సదుపాయం లభించేందుకు గ్రామ సర్పంచ్‌లు, మునిసిపల్ ఛైర్మన్‌లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు సహానుభూతితో కృషిచేయాలి.

భారత్‌లో పిల్లలకు టీకా కవరేజీపై ది లాన్సెట్ వెల్లడించిన గణాంకాలు వాస్తవమైనవి కావని కేంద్ర ప్రభుత్వం ఖండించింది. జీరో–డోస్ పిల్లల శాతం 2023లో 0.11 శాతం నుంచి 2024లో 0.06 శాతానికి తగ్గినట్టు చెప్పింది. గణాంకాలు ఎలా ఉన్నప్పటికీ టీకా సౌకర్యం పొందలేకపోతోన్న చిన్నారుల సంఖ్య లక్షల్లో ఉందనేది కొట్టివేయలేని సత్యం. ఏది ఏమైనా ది లాన్సెట్ వెల్లడించిన విషయాలు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇమ్యూనైజేషన్ ఎజెండా–2030ను పరిపూర్తి చేయడంలో తమ కృషి లోపానికి ఆక్షేపణగా మన పాలకులు భావించనవసరం లేదు. అలాగే పాలకులను తప్పుపట్టేందుకు ది లాన్సెట్ నివేదికను ఆధారం చేసుకోవడమూ సహేతుకం కాదు. కొత్త వైరస్‌లు విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రజారోగ్యానికి ముంచుకొస్తున్న కోవిడ్ తరహా ముప్పును ది లాన్సెట్ నివేదిక వెలుగులో అర్థం చేసుకోవాలి. వ్యక్తులకు, ప్రజా సమూహాలకు ఆరోగ్యప్రదమైన భవిష్యత్తును నిర్మించేందుకు సంపూర్ణ శ్రద్ధ చూపని పక్షంలో రోగగ్రస్త భవిష్యత్తే మనకు దాపురిస్తుంది.

# చరిత్ర రచనా శాస్త్రవేత్త

తెలుగులో చరిత్ర రచన ప్రారంభమై చాలా కాలమే అయింది. 19వ శతాబ్ది నుంచి చాలా మంది చరిత్రకారులు తమదైన ధోరణిలో చరిత్రను పుటలకెక్కించారు. చరిత్ర రచన వేరు. చరిత్ర రచన ఎట్లా సాగుతుందో, దాని చరిత్ర ఏమిటో, తత్వమేమిటో తెలియచేసే చరిత్ర రచనాశాస్త్రం వేరు. చరిత్ర సకల అధ్యయన అంశాలకు తల్లి అయితే; చరిత్ర రచనాశాస్త్రం ఆ తల్లికి తల్లి. తెలుగులో చరిత్ర రచన ఎవరితో ప్రారంభమైందనేది పక్కన పెడితే, తొలి చరిత్ర రచనాశాస్త్ర రచయిత మాత్రం డా. జాస్తి దుర్గాప్రసాద్. చరిత్రకారుడు, శాసన పరిష్కర్త, మధ్యయుగ ఆంధ్రదేశ చరిత్ర నిపుణుడు అయిన దుర్గాప్రసాద్ చరిత్ర రచన ఎంత నిష్పాక్షికంగా, శాస్త్రీయమై ఉండాలో చెప్పే చరిత్ర రచనాశాస్త్రాన్ని అంతే నిష్పాక్షికంగా, శాస్త్రీయంగా నలభై ఏళ్ల క్రితమే తెలుగులో రచించారు. ఇది చరిత్రను తాత్వికంగా నిర్వచించడమే కాక ప్రాచ్య పాశ్చాత్య దేశాల చరిత్ర రచనా రీతులను మొదటిసారి తెలుగువారికి పరిచయం చేసింది.

తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం వీఎస్ఎం కళాశాల పోస్ట్ గ్రాడ్యుయేట్ చరిత్ర విభాగ అధ్యాపకుడుగా, విభాగ అధ్యక్షుడిగా, కళాశాల ప్రిన్సిపల్‌గా, పీజీ కోర్సెస్ డైరెక్టర్‌గా పనిచేసిన దుర్గాప్రసాద్, పంచారామాల్లో ఒకటైన ద్రాక్షారామలో లభించిన 387 శాసనాల్లో ప్రతిఫలించిన భీమేశ్వరాలయ చరిత్రను దీర్ఘ కాలం కృషి చేసి వెలికి తెచ్చారు. శాసనాల ద్వారా చరిత్రను నిర్మించిన చరిత్రకారులు అంతకు ముందు చాలా మంది ఉన్నా, ఎనభైల నాటికి చరిత్ర రచన సంతరించుకున్న ఆధునిక దృక్పథాన్ని అందుకున్న ఈ పరిశోధన, రాజకీయ నేపథ్యంలో సామాజిక, ఆర్థిక పరిస్థితుల అధ్యయనానికి ప్రాధాన్యతనిచ్చి మధ్యయుగ ఆంధ్రదేశ చరిత్రలో భీమమండలం అని పిలువబడిన ద్రాక్షారామ ప్రాంత చరిత్రను సరిగ్గా గుర్తించగలిగింది. 1980లలో భారతదేశంలో ప్రారంభమై Feudalism Debateగా ప్రపంచవ్యాప్తంగా సాగిన చర్చను భీమమండలానికి అన్వయించిన దుర్గాప్రసాద్, ఐరోపా తరహా భూస్వామ్య వ్యవస్థ ఇక్కడ లేదని తేల్చారు. ఈ పరిశోధనలో 11–16 శతాబ్దాల మధ్య లిపి పరిణామం దుర్గాప్రసాద్‌ను ఉత్తమస్థాయి paleographerగా రుజువు చేసింది. ప్రాచీన భాషా సాహిత్యాల మీద ఆయనకున్న అధికారం ఈ పరిశోధనను సంపద్వంతం చేసింది. తెలుగు అకాడమి కోసం పూర్తిగా ఆయనే రాసిన ఆంధ్రుల చరిత్ర రెండు భాగాలలో, సహ రచయితగా ఉన్న భారతదేశ చరిత్ర రెండు భాగాలలో క్లుప్తత, వాక్యనిర్మాణంలో బిగువూ, సమతూకం కల్గిన పదప్రయోగం– దుర్గాప్రసాద్ చరిత్రకారుడు కాకపోయినట్లయితే సాహిత్యకారుడు అయ్యేవారనిపిస్తాయి.



తెలుగులో చరిత్ర రచన ఎవరితో ప్రారంభమైందనేది పక్కన పెడితే, తొలి చరిత్ర రచనాశాస్త్ర రచయిత మాత్రం డా. జాస్తి దుర్గాప్రసాద్. చరిత్రకారుడు, శాసన పరిష్కర్త, మధ్యయుగ ఆంధ్రదేశ చరిత్ర నిపుణుడు అయిన దుర్గాప్రసాద్ చరిత్ర రచన ఎంత నిష్పాక్షికంగా, శాస్త్రీయమై ఉండాలో చెప్పే చరిత్ర రచనాశాస్త్రాన్ని అంతే నిష్పాక్షికంగా, శాస్త్రీయంగా నలభై ఏళ్ల క్రితమే తెలుగులో రచించారు. ఇది చరిత్రను తాత్వికంగా నిర్వచించడమే కాక ప్రాచ్య, పాశ్చాత్య దేశాల చరిత్ర రచనా రీతులను మొదటిసారి తెలుగువారికి పరిచయం చేసింది.

దాదాపు పది చరిత్ర గ్రంథాలు, కొన్ని స్వయంగా, కొన్ని తన సమకాలికుడు అయిన డా. కె.ఎస్. కామేశ్వరరావుతో కలిసి పదిహేను వరకు పరిశోధనా పత్రాలు రాసిన దుర్గాప్రసాద్, విద్యావేత్తగానే కాక నిర్వాహకుడిగా కూడా చరిత్ర పల్లకి మోశారు. ప్రారంభమైన రెండవ సంవత్సరంలోనే తమ కళాశాలలో వార్షిక సమావేశం నిర్వహించడంతో ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్‌తో మొదలైన ఆయన ప్రయాణం దాదాపు నాలుగు దశాబ్దాలపాటు పరస్పర పూరకంగా, తేజోవంతంగా సాగింది. ఉప కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడుగా సంస్థ నిరాఘాటంగా నడవడంలో, వివిధ కళాశాలలు వార్షిక సమావేశాలకు ఆతిథ్యం ఇచ్చేటట్లు చేయడంలో ఆయన కాడి పట్టారు. సంస్థ రజతోత్సవాలు నిర్వహించుకునే నాటికి ప్రధాన కార్యదర్శిగా ఎంపిక కావడం సంస్థ కోసం దుర్గాప్రసాద్ పడిన పాతికేళ్ల శ్రమకు, చూపిన అంకిత భావానికి లభించిన గుర్తింపు. కళాశాలలో తమ విభాగాధిపతి, మార్గదర్శి అయిన డా. గరిగిపాటి రుద్రయ్యచౌదరి మరణానంతరం ఆయన పేరిట పాతిక సంవత్సరాలపాటు నిర్వహించిన స్మారకోపన్యాసాలకు చరిత్ర, రాజనీతి, అర్థశాస్త్రాల్లో నిపుణుల్ని, ముఖ్యంగా యువ పరిశోధకుల్ని ఆహ్వానించి, ప్రసంగ పాఠాలను ముందుగానే రప్పించి, ముద్రించి, నిర్వహించడం ద్వారా ఆ వ్యక్తిని పునర్జీవితుణ్ణి చేయడమేకాక, చరిత్రను సజీవంగా ప్రవహింపజేశారు.

ఇస్లామ్ ధర్మసూత్రాల్లో ఒకటైన 'జకత్' (సంపాదనలో కొంత శాతం పేదలకు పంచడం) నుంచి స్ఫూర్తి పొందిన దుర్గాప్రసాద్ తన సంపాదనలో 1968 నుంచి పది శాతం, 1993 నుంచి నలభై శాతం, 2008 నుంచి ఎనభై శాతం ప్రజాహితం కోసం ఇచ్చేస్తున్నారు. ఇచ్చింది చెప్పుకోకూడదనే నియమం పెట్టుకున్న దుర్గాప్రసాద్, ఎవరెవరికి ఎంతెంత ఇచ్చారో, జీవిత సహచరికి కూడా చెప్పరు కాబట్టి మనకు తెలిసే అవకాశం లేదు. కానీ, తణుకు నుంచి వస్తున్న 'దారిదీపం' మాసపత్రికకు ఇటీవలే ఈ వ్యాసకర్త ద్వారా యాభై వేల రూపాయలు విరాళంగా ఇచ్చి, పత్రికలో ప్రకటించవద్దని చెప్పడంతో తెలిసింది.

ఉభయభాషాప్రవీణ జాస్తి వెంకటనరసింహారావు, దుర్గాంబ దంపతులకు 1946లో జన్మించిన దుర్గాప్రసాద్, చిన్ననాటనే తల్లిని కోల్పోయారు. దుగ్గిరాల, కూచిపూడి, తెనాలిలలో పాఠశాల విద్యను పూర్తిచేసుకుని, విజయవాడ లయోలా కళాశాలలో డిగ్రీ చదివి, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆచార్య ఓరుగంటి రామచంద్రయ్య వంటి గురువుల దగ్గర చరిత్ర, పురావస్తు శాస్త్రాల్లో ఎంఏ చేశారు. ద్రాక్షారామ శాసనాల మీద జరిపిన పరిశోధనకు డాక్టరేట్ పట్టా పొందారు. మల్లంపల్లి సోమశేఖరశర్మ, నేలటూరి వెంకటరమణయ్య, ముసునూరి సాంబశివరామమూర్తి వంటి ముందు తరం చరిత్రకారుల నుంచి స్ఫూర్తి పొందిన దుర్గాప్రసాద్, ఈ జూలై ఒకటవ తేదీతో ఎనభయ్యో పడిలో పడనున్నారు.

○ కొప్పర్తి వెంకటరమణమూర్తి
○ సుశీలాదేవి

# ఇరాన్‌లో మనకు కనిపించని ఇంధనమూ ఉంది!





■ రాహుల్ కుమార్

మానవ చరిత్రలో రాజ్యాలు మొదలైన దగ్గర నుంచి రెండు విషయాలు క్రమం తప్పకుండా కనపడతాయి. రాజ్యరక్షణ.. రాజ్యభక్షణలుగా వాటి గురించి చెప్పుకోవచ్చు. సందర్భానుసారం వీటిల్లో ఏదో ఒకదాంట్లో మునిగిపోయి, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేయటం పాలకవర్గాలకు పరిపాటి. ప్రజాస్వామ్యాలు, అంతర్జాతీయ చట్టాలు వచ్చిన తర్వాత కూడా ప్రజలకు ఇవి తప్పటంలేదు. రాజ్యరక్షణకు పొరుగు దేశాలను భక్షించక తప్పదనే చాణక్యనీతితో జరిగిన యుద్ధాలను తెలుసుకోటానికి గడిచిపోయిన చరిత్రల్లోకి వెళ్లాల్సిన పని లేదు. ఇప్పటికీ అవి ప్రబలంగానే ఉన్నాయి. యుద్ధాలకు సమర్థనలు మాత్రమే మారుతున్నాయి. రాజ్యం వీర భోజ్యం లాంటి ముతక సమర్థనలు పోయి జాతీయ ప్రయోజనాలు, స్వీయరక్షణ పేరుతో యుద్ధాలు పేట్రేగుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికాలు కలిసికట్టుగా ఇరాన్‌పై 12 రోజుల పాటు చేసిన యుద్ధమే ఇందుకు నిదర్శనం.

ఇజ్రాయెల్‌కూ ఇరాన్‌కూ సరిహద్దు తగాదాలు లేవు. రెండిటికీ మధ్య వందల కిలోమీటర్ల దూరం ఉంది. ఇరు దేశాల రాజధానుల మధ్య దూరమే 1770 కిలోమీటర్ల దాకా ఉంటుంది. అరబ్ దేశాలతో ఇజ్రాయెల్‌కు యుద్ధాల చరిత్ర ఉంది. 1948 నుంచి ఏదో ఒక కారణంతో ఆ దేశాలతో తలపడి వాటి భూభాగాలను ఆక్రమించటం, వైదొలగటం ఇజ్రాయెల్‌కు మామూలే. అరబ్–ఇజ్రాయెల్ యుద్ధాల్లో ఇరాన్ ప్రత్యక్ష భాగస్వామి కాదు. మరి ఇరాన్‌తో ఇజ్రాయెల్‌కు ఎందుకు ఇంత శత్రుత్వం? వందలాది యుద్ధ విమానాలతో దాడిచేయటమే కాకుండా, అమెరికాను కూడా రంగంలోకి దించి అణుశుద్ధి కేంద్రాలపై భీకరమైన బంకర్ల విధ్వంసక బాంబులతో విరుచుకుపడటానికి వినిపిస్తున్న సమర్థనల వెనుక అసలు నిజాలు ఏమిటి? ఇరాన్ అణుకార్యక్రమానికి ఒకనాడు పాశ్చాత్యదేశాల ప్రాపకం లేదా? అమెరికా, ఇజ్రాయెల్‌కు ఇరాన్ ఎందుకు తీవ్రశత్రువుగా మారిపోయింది? ముస్లిం దేశాల నడిబొడ్డున తిష్టవేసుకుని తన ఆధిపత్యాన్నీ ఆక్రమణలనూ ఆ దేశాలు కిక్కురుమనకుండా ఆమోదించటానికి ఇజ్రాయెల్ సాగిస్తున్న రణతంత్రం ఎటు దారి తీస్తుంది? ఈ ప్రశ్నలకు జవాబుల కోసం చరిత్రను వెతికితే అమెరికానే బోనులో నిలబడుతుంది. పాశ్చాత్యదేశాలు చేసిన పాపపు చరిత్రే కనపడుతుంది. ఐక్యరాజ్యసమితి (ఐరాస) తీర్మానం ప్రకారం ఇజ్రాయెల్‌తో పాటు పాలస్తీనా స్వతంత్ర దేశంగా ఏర్పడాలి. రెండిటికీ సరిహద్దులూ అప్పట్లో స్పష్టంగానే నిర్దేశితమయ్యాయి. ఆ తీర్మానం అమలయ్యేలోపలే బలప్రయోగంతో పాలస్తీనాకు కేటాయించిన భూభాగాలను సైతం ఆక్రమించుకోవటంతోనే అసలు సమస్య మొదలైంది. అరబ్ దేశాలు ఆనాడు ఇజ్రాయెల్ ఏర్పాటును మొండిగా వ్యతిరేకించటం ఇప్పటి దృష్టితో చూస్తే వ్యూహాత్మక తప్పిదంగా అనిపిస్తుంది. దానికి మూల్యం మాత్రం పాలస్తీనా ప్రజలు చెల్లించాల్సి వచ్చింది. ఒకటి మాత్రం నిజం. పాలస్తీనాను స్వతంత్ర దేశంగా ఏర్పాటు కాకుండా చూడాలనే వ్యూహంతోనే యూదు ఆధిపత్యవాదులు మొదటి నుంచి పావులు కదిపారు. చివరికి గాజా, వెస్ట్‌బ్యాంక్ భూభాగాలతో పరిమిత పాలస్తీనాను ఏర్పాటు చేయటానికి కూడా ఇజ్రాయెల్ అంగీకరించటం లేదు. గతంలో పాలస్తీనాగా గుర్తించిన భూభాగంలో ఏ ముక్కనూ ఒదులుకోటానికి ఇజ్రాయెల్ సిద్ధంగా లేదు. నెతన్యాహు సారథ్యంలోని ఇజ్రాయెల్ ప్రభుత్వం.. స్వతంత్ర పాలస్తీనా అన్న భావననే లేకుండా చేయటానికి ప్రతి అవకాశాన్నీ ఉపయోగించుకుంటోంది. గాజాలో నరమేధమూ అందుకే సాగుతోంది. మధ్య ప్రాచ్యంలో తిరుగులేని ఆధిపత్యం ఇజ్రాయెల్‌కు ఏర్పడేలా నెతన్యాహు చేస్తున్న ప్రయత్నాలకు ఇరాన్ శక్తి అడ్డంకిగా కనపడుతోంది. 12 రోజుల యుద్ధమూ అందులో భాగమే.

మతపరంగానో, ఇతర భావజాలంపరంగానో అమెరికా, ఇజ్రాయెల్ ఆధిపత్యాన్ని అంగీకరించని ఏ దేశాన్నైనా అస్థిరం చేయటం దశాబ్దాలుగా అమలవుతోంది. చమురు, సహజవాయువులు సమృద్ధిగా ఉన్న దేశాలను నయానభయాన గుప్పిట్లో పెట్టుకోవటం ఒకప్పుడు బ్రిటన్ చేస్తే రెండో ప్రపంచయుద్ధం తర్వాత అమెరికా ఆ పనిని మొదలుపెట్టింది. మధ్యప్రాచ్య దేశాల మధ్య విభేదాలను ఎగదోయటం, సందర్భానుసారం కొన్నిటిని మిత్రపక్షాలుగా, మరికొన్నిటిని వైరిపక్షాలుగా భావించటం, వాటి రక్షణ పేరుతో యుద్ధాలు చేయటం, తిరుగుబాట్లను ప్రోత్సహించటం అమెరికా విదేశాంగ విధానంలో కీలక వ్యూహంగా మారింది.

అణువిద్యుత్తు పేరుతో అణ్వస్త్రాలు తయారుచేయగలిగే స్థాయికి యురేనియాన్ని ఇరాన్ శుద్ధిచేస్తోందని అమెరికా, ఇజ్రాయెల్‌లు ఆరోపిస్తున్నాయి. నిజానికి ఇరాన్ అణుకార్యక్రమం ఈనాటిది కాదు. అమెరికాకు, పాశ్చాత్య దేశాలకు అన్ని విధాలుగా అనుకూలంగా వ్యవహరించిన ఒకనాటి ఇరాన్ పాలకుడు ముహమ్మద్ రెజాషా పహ్లవి (1941–1979) కాలంలోనే అది పెద్దఎత్తున మొదలైంది. అమెరికా ఆశీస్సులతో రెజాషా 23 పౌర అణు విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేయటానికి ప్రణాళిక రూపొందించారు. సొంత అవసరాలకే కాకుండా చుట్టుపక్కల దేశాలకు కూడా విద్యుత్తు సరఫరా చేయాలనే ఉద్దేశంతో వాటిని ఏర్పాటు చేయబోతున్నట్లు రెజాషా ప్రకటించారు. రెండు కేంద్రాలకు సంబంధించి అప్పట్లోనే పనులు మొదలయ్యాయి. ఇరాన్ లాంటి చిన్న దేశంలో ఒక్కసారిగా 23 అణువిద్యుత్తు కేంద్రాల ఏర్పాటుకు అంగీకరించటం అప్పట్లో అమెరికాకు అసంబద్ధంగా అనిపించలేదు. ఇరాన్ దగ్గర త్వరలో అణ్వస్త్రాలు కూడా ఉంటాయని అమెరికన్ జర్నలిస్టుతో రెజాషా గర్వంగా కూడా చెప్పారు. ఇటీవల ఇజ్రాయెల్ వైమానిక దాడుల సందర్భంగా దెబ్బతిన్నట్లు వార్తల్లోకి ఎక్కిన బుషెహర్ అణువిద్యుత్తు కేంద్రం రెజాషా ప్రకటించిన 23 కేంద్రాల్లో ఒకటి. అపార చమురు, సహజవాయువు నిల్వలున్న ఇరాన్‌కు అణువిద్యుత్తే అవసరం లేదన్న వాదనలు అమెరికా మేధావులు ఇప్పుడు చేస్తున్నారు కానీ ఒకనాడు ఆ ఆలోచనే వాళ్లకి తట్టలేదు. 1970ల్లో అమెరికా విదేశాంగమంత్రిగా హెన్రీ కిసింజర్ ఇరాన్ అణుకేంద్రాల ఏర్పాటుపై తాను ఎలాంటి అభ్యంతరాలూ తెలపలేదనీ, అక్కడ అణ్వస్త్రవ్యాప్తి గురించిన ఆలోచనే తమకు రాలేదనీ ఒక ఇంటర్వ్యూలో చాలా స్పష్టంగా చెప్పారు.

'శాంతి కోసం అణువులు' అంటూ ఎంతో ఆర్భాటంగా ఇరాన్ అణుకార్యక్రమాన్ని అమెరికా, బ్రిటన్‌లు ప్రారంభించాయి. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో అమెరికా, బ్రిటన్ ప్రయోజనాల పరిరక్షకుడిగా రెజాషాకి ఇచ్చిన గుర్తింపు, చేసిన సహాయం అంతా ఇంతా కాదు. 1978 నాటికి ఇరాన్‌లో అమెరికా సైనిక సలహాదారులు, పౌరులు 50 వేలమందికి పైగా ఉండేవారు. వీళ్లందరికీ స్థానిక చట్టాలు వర్తించకుండా ప్రత్యేకహక్కులు కల్పించారు. ఇరాన్ సైనిక వ్యయం 1977 నాటికి 9.5 బిలియన్ డాలర్లకు చేరింది. అప్పటి భారత్ సైనిక వ్యయం 3.46 బిలియన్ డాలర్లతో పోల్చితే ఇరాన్ వ్యయం ఏ స్థాయిలో ఉండేదో తేలికగా అర్థం అవుతుంది. అమెరికా నుంచి ఆయుధాల కొనుగోలు వ్యయం 1977లో 6 బిలియన్ డాలర్లకు చేరింది. సైనికదళాల సంఖ్య కూడా విపరీతంగా పెరిగింది. 4,10,000 మంది సైన్యంలో ఉండేవారు. బలమైన సైనిక రాజ్యంగా ఇరాన్ మారటం అమెరికాకు అప్పుడు అవసరమైంది.

ఒక సైనిక రంగంలోనే కాదు ఇతరత్రా కూడా రెజాషా పహ్లవి కాలంలో ప్రభుత్వ కార్యకలాపాలు, సంస్థలూ విపరీతంగా విస్తరించాయి. రాజ్య కేంద్రీకరణ ఉచ్చ స్థాయికి చేరింది. అన్నిటినీ పైనుంచి రుద్దటం ఎక్కువైంది. ఆర్థికపరమైన మార్పులూ చాలా వచ్చాయి. మధ్యతరగతి బాగా పెరిగింది. పట్టణీకరణ వేగం పుంజుకుంది. అణుకేంద్రాలతో పాటు భారీ డ్యాంలూ ప్రాజెక్టులకూ ప్రాధాన్యం పెరిగింది. కొంత మేరకూ భూసంస్కరణలూ అమలయ్యాయి. మరోవైపు అసమానతలూ పెరిగాయి. రాజకీయ ప్రజాస్వామ్యమూ భిన్నాభిప్రాయగళం లేకపోయినా.. ఆర్థికాభివృద్ధి జరిగిపోతే సమాజం ఆధునికమై తన అదుపులో ఉంటుందని రెజాషా భావించారు. ఆ అదుపు లభించకపోవటంతో అసమ్మతిపై ఉక్కుపాదం మోపారు. మరోవైపు ఆధునిక విద్యతో సాంస్కృతిక జీవితంపై మత గురువుల పట్టు బలహీనమయ్యే క్రమం మొదలైంది. పాశ్చాత్య అభివృద్ధిని అనుకరించటంలో మత విశిష్టత అంతరించిపోతుందన్న భయం షియా మత నేతల్లో ఎక్కువైంది.

ఇస్లామిక్ విప్లవం (1979) తదనంతరం పాశ్చాత్య దేశాలు సాగించిన ప్రచారంతో ఇరాన్ ప్రజల ప్రజాస్వామిక ఆందోళనలు, ఉద్యమాలు, ఆధునికత కోసం పడిన తపనలు బాగా మరుగున పడిపోయాయి. 1905–1909 మధ్య ఇరాన్‌లో వచ్చిన రాజ్యాంగ విప్లవం అనేక రాజకీయ మార్పులను తీసుకువచ్చింది. ప్రాతినిధ్య శాసనసభ, అధికారాల విభజన, ఎన్నికలు లాంటివి అప్పుడే వచ్చాయి. ఆసియాలోనే అదొక అరుదైన విప్లవం. రాజ్యాంగబద్ధ రాచరికం పేరుతో రాజు అధికారాలను పరిమితం చేసి జాతీయ అసెంబ్లీకి వాటిని కట్టబెట్టారు. 1921లో కల్నల్ రెజాఖాన్ సైనిక కుట్రతో అధికారాన్ని చేజిక్కించుకుని పహ్లవి పేరుతో రాచరికాన్ని స్థాపించుకున్నా రాజ్యాంగ విప్లవస్ఫూర్తి ఇరానీలకూ అవసరమైనప్పుడల్లా ప్రేరణ శక్తిగానే ఉంది. వామపక్ష భావజాలం, సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయవాదం ప్రబలంగా ఉండేవి. 1951లో నేషనల్ ఫ్రంట్ తరఫున ప్రధానమంత్రి అయిన మొసాదేక్.. పెట్రోల్ పరిశ్రమపై గుత్తాధిపత్యం వహిస్తున్న బ్రిటిష కంపెనీని జాతీయం చేశారు. ఆగ్రహించిన అమెరికా, బ్రిటన్ ప్రభుత్వాలు ఇరానీ సైనికాధికారులతో కుమ్మక్కై మొసాదేక్‌ను పదవీచ్యుతుడిని చేసి రెజాషాకు సంపూర్ణాధికారాలు కట్టబెట్టారు. ఇరానీ రాజకీయాలను ఆ సంఘటన తీవ్రంగా ప్రభావితం చేసింది. అప్పటి నుంచి అమెరికన్ వ్యతిరేకత ఇరానీల్లో పాతుకుపోయింది. స్వతంత్రత, స్వీయనిర్ణయాధికారం కోసం అగ్రరాజ్యాలను ఎదుర్కోవటం ఇరానీ రాజకీయ సంస్కృతిలో భాగమైపోయింది. అణు కార్యక్రమం కొనసాగించటానికి పట్టుబట్టటం కూడా కొంతమేరకు ఆ సంస్కృతిలో భాగంగానే సాగుతోంది.

> స్వతంత్రత, స్వీయనిర్ణయాధికారం కోసం అగ్రరాజ్యాలను ఎదుర్కోవటం ఇరానీ రాజకీయ సంస్కృతిలో భాగమైపోయింది. అణు కార్యక్రమం కొనసాగించటానికి పట్టుబట్టటం కూడా కొంతమేరకు ఆ సంస్కృతిలో భాగంగానే సాగుతోంది.

ఇరాన్ ఎప్పుడూ పూర్తిగా వలసపాలన కిందలేదు. పూర్తి స్వాతంత్ర్యాన్ని ఎప్పుడూ కోల్పోలేదు. 2500 సంవత్సరాలుగా పర్షియన్లుగా ఘనచరిత్రను నిత్యం గుర్తుచేసుకునే జాతీయభావన, ఎన్నో దేశాలను ప్రభావితం చేసిన పారశీక సంస్కృతీ సాహిత్యమూ, పదికోట్ల జనాభా, ఫ్రాన్స్‌కంటే మూడింతలున్న భూభాగం, చమురు–సహజ వాయువు ఉత్పత్తిలో మూడో స్థానం, బలమైన రాజ్య వ్యవస్థ ఉన్న ఇరాన్‌ని ఆయుధశక్తితో లొంగదీసుకోవటం తేలికకాదు! చరిత్ర స్పృహతో ఇరానీయుల్లో ఉండే సామాజిక చైతన్యం ఒక ఇంధనంలా సమరశీలతను మండిస్తూనే ఉంటుంది. మతగురువుల ప్రభావానికి ఎదురొడ్డి నిలిచే పౌరసమాజం అక్కడ ఉంది. మత రాజ్యాన్నే అదెన్నో మార్పులకు లోనుచేస్తోంది. వర్సిటీ విద్యార్థుల్లో 63శాతం, కాలేజీ విద్యార్థుల్లో 54శాతం, వైద్యుల్లో 47శాతం, ప్రభుత్వ ఉద్యోగుల్లో 28శాతం, శ్రామిక శక్తిలో 33శాతం మహిళలు ఉన్న ఇరానీ సమాజంలో అంతగా ప్రచారంకాని విషయాలు చాలానే ఉన్నాయి.

> ఇరాన్ ఎప్పుడూ పూర్తిగా వలసపాలన కిందలేదు. పూర్తి స్వాతంత్ర్యాన్ని ఎప్పుడూ కోల్పోలేదు. 2500 సంవత్సరాలుగా పర్షియన్లుగా ఘనచరిత్రను నిత్యం గుర్తుచేసుకునే జాతీయభావన, ఎన్నో దేశాలను ప్రభావితం చేసిన పారశీక సంస్కృతీ సాహిత్యమూ, పదికోట్ల జనాభా, ఫ్రాన్స్‌కంటే మూడింతలున్న భూభాగం, చమురు– సహజ వాయువు ఉత్పత్తిలో మూడో స్థానం, బలమైన రాజ్యవ్యవస్థ ఉన్న ఇరాన్‌ని ఆయుధశక్తితో లొంగదీసుకోవటం తేలికకాదు! మతగురువుల ప్రభావానికి ఎదురొడ్డి నిలిచే పౌరసమాజం అక్కడ ఉంది. వర్సిటీ విద్యార్థుల్లో 63శాతం, కాలేజీ విద్యార్థుల్లో 54శాతం, వైద్యుల్లో 47శాతం, ప్రభుత్వ ఉద్యోగుల్లో 28శాతం, శ్రామికశక్తిలో 33శాతం మహిళలు ఉన్న ఇరానీ సమాజంలో అంతగా ప్రచారంకాని విషయాలు చాలానే ఉన్నాయి.

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

# కనుమరుగవుతున్న కుటుంబ వైద్యం

భారతరత్న గ్రహీత, ప్రముఖ వైద్యులు, దాత, విద్యావేత్త, చాలాకాలం పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా పని చేసిన డాక్టర్ బి.సి. రాయ్ సేవలను స్మరించేందుకు ప్రతి ఏటా జూలై 1ని జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుతారు. ఈ రోజు నాకు వ్యక్తిగతంగా కూడా ముఖ్యమైన రోజు. ఎందుకంటే సరిగ్గా 34 ఏళ్ల క్రితం (1991లో), ఇదే రోజున నేను వైద్యుడిగా పట్టభద్రుడిని అయ్యాను. అంతేగాక తొమ్మిదేళ్ల క్రితం (2016లో), భారతదేశంలో వైద్యులకు లభించే అత్యున్నత గౌరవమైన డాక్టర్ బి.సి. రాయ్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నాను. అందువల్ల, ఈ రోజు నాకు ఎంతో ప్రత్యేకం. ప్రస్తుతం మన దేశంలో సమర్థవంతమైన ఆరోగ్య సేవలు ఎంతో కీలకమైనప్పటికీ, ఎంతో నిర్లక్ష్యానికి గురవుతున్న 'ఫ్యామిలీ మెడిసిన్' గురించి నా ఆలోచనలను పంచుకోవాలనుకుంటున్నాను.

ఒకానొక కాలంలో కుటుంబంలో ఎవరికి ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా మొదట 'ఫ్యామిలీ డాక్టర్' దగ్గరకే వెళ్ళేవారు. కానీ ఇప్పుడు ఈ 'ఫ్యామిలీ డాక్టర్' అనే భావన క్రమక్రమంగా అదృశ్యమవుతున్నది. దాంతో రోగులు చిన్నపాటి సమస్యలకు కూడా నేరుగా ఆసుపత్రులకే పరుగులు పెడుతున్నారు. తద్వారా ఇప్పటికే రోగులతో నిండిపోయిన ఆసుపత్రులపై మరింత భారం పడుతున్నది.

అనేక అభివృద్ధి చెందిన దేశాలలో 'ఫ్యామిలీ మెడిసిన్'ను ఒక ప్రత్యేక వైద్యశాఖగా పరిగణిస్తారు. అక్కడ ప్రత్యేకమైన పోస్టు గ్రాడ్యుయేట్ రెసిడెన్సీ ప్రోగ్రామ్స్ ద్వారా ఇందులో శిక్షణనూ అందిస్తున్నారు. భారతదేశంలో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలను ప్రోత్సహించడంతో పాటు, 'ఫ్యామిలీ మెడిసిన్'ను ఒక ప్రత్యేక స్పెషాలిటీగా అభివృద్ధి చేయాలన్న దిశగా కృషి చేస్తోంది. అయితే ఇప్పటికీ 'ఫ్యామిలీ మెడిసిన్'ను ఎంబీబీఎస్ స్థాయిలో అండర్ గ్రాడ్యుయేట్ శిక్షణలో భాగంగా చేర్చలేకపోయింది.


భారతదేశంలో ఫ్యామిలీ మెడిసిన్‌లో మొట్టమొదటి పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సు 2011లో కేరళ రాష్ట్రం, కొజికోడ్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రారంభమైంది. అయితే, ఇప్పుడు 2025లోకి వచ్చేసరికి, దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది ఫ్యామిలీ మెడిసిన్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ స్థాయిలో అందుబాటులో ఉన్న సీట్లు 150కంటే తక్కువ ఉన్నాయి. 140 కోట్ల జనాభా ఉన్న దేశంలో ఇది ఆశ్చర్యపరిచే సంఖ్య!

ప్రస్తుతం భారతదేశంలో అందుబాటులో ఉన్న పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లలో మెజారిటీ వైద్యలను కొన్ని విభాగాల్లో స్పెషలిస్టులుగా మార్చే దిశగానే కేటాయించబడ్డాయి. ఫలితంగా, పీజీ సీటు పొందలేకపోయిన చాలామంది వైద్యులు విదేశాలకు వెళ్లి ఉన్నతమైన స్పెషలిస్టు శిక్షణ తీసుకుంటున్నారు. మరోవైపు, 'ఫ్యామిలీ మెడిసిన్' పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులకు దరఖాస్తు చేసేవాళ్ల సంఖ్య తక్కువగా ఉంటున్నది.

భారతదేశ జనాభాలో 70శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నప్పటికీ, వైద్యులలో 25శాతం కంటే తక్కువమంది మాత్రమే ఈ ప్రాంతాల్లో పని చేస్తున్నారు. మెట్రో ప్రాంతాల వెలుపల, ఒక్కో ఫ్యామిలీ డాక్టర్‌కు సగటున 7,500 మంది రోగులు ఉండగా, అత్యంత దుర్భర ప్రాంతాల్లో ఈ నిష్పత్తి ఒక్కో ఫ్యామిలీ డాక్టర్‌కు సగటున 25,000 మందికి పడిపోతున్నది. ఇలా ఫ్యామిలీ డాక్టర్ల కొరత భారతదేశ ఆరోగ్య వ్యవస్థలోని అతి ముఖ్యమైన లోటుగా తయారైంది.


దీనికి పరిష్కారంగా ఈ ఐదు పాయింట్ల అజెండాపై పాలకులు, విధాన నిర్దేతలు దృష్టి పెట్టాలి: 1. 'ఫ్యామిలీ మెడిసిన్'ను అండర్ గ్రాడ్యుయేట్ (ఎంబీబీఎస్) పాఠ్యాంశాల్లో చేర్చాలి. భారతదేశం అంతటా ప్రతి వైద్య కళాశాలలో ఫ్యామిలీ మెడిసిన్ కోసం విభాగాలను ఏర్పాటు చేయాలి. ఈ విభాగంలో శిక్షణను అందించే వైద్య కళాశాలల సంఖ్యను పెంచాలి. 2. భారతదేశానికి స్పెషలిస్టు వైద్యుల అవసరం ఉన్నదనే విషయంలో అనుమానం లేదు. కానీ, ఫ్యామిలీ డాక్టర్ల సంఖ్యను పెంచడం ఇంతకన్నా ముఖ్యం. ఫ్యామిలీ డాక్టర్ల శిక్షణపై మన దేశం పెట్టుబడులు పెంచాలి. అదే సమయంలో, ఎంబీబీఎస్ కోర్సులో చేరిన యువ విద్యార్థులకు ఫ్యామిలీ మెడిసిన్ భావనపై అవగాహన కలిగిస్తూ, దీనిపై ప్రజాదరణనూ పెంచాలి. 3. భారతదేశ గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య సదుపాయాల నిర్మాణాన్ని బలోపేతం చేయాలి. అప్పుడే స్థానికంగా ఫ్యామిలీ డాక్టర్ల ద్వారా నాణ్యమైన వైద్య సేవలు రోగులకు అందుతాయి. దాంతో పాటు, పరీక్షలు చేయించుకోవడం లేదా చికిత్స పొందడానికి ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన అవసరం తగ్గుతుంది. 4. సమాచార ప్రసార మంత్రిత్వశాఖ వివరాల ప్రకారం– భారతదేశంలో 1.2 బిలియన్లకు పైగా మొబైల్ ఫోన్ వినియోగదారులు, 850 మిలియన్లకు పైగా స్మార్ట్ ఫోన్ వినియోగదారులు ఉన్నారు. 2026 నాటికి దేశంలో 1 బిలియన్ స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ఉంటారని అంచనా. డిజిటల్ టెక్నాలజీలలో భారతదేశం ఇలా ప్రపంచాన్ని ముందుండి నడిపిస్తున్నప్పటికీ, దేశ వైద్యశాలల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రయోజనం వినియోగంలోకి రావటం లేదు. ఈ లోటు తీరేలా ప్రాథమిక ఆరోగ్య సంరక్షణలో సాంకేతిక పురోగతులను తీసుకురావాలి. 5. యునైటెడ్ కింగ్‌డమ్‌లో ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యంతో నడిచే నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్ఎస్) మోడల్‌ను మనం భారతదేశంలోనూ అనుసరించవచ్చు. భారతదేశంలో ఎక్కువ శాతం ఆరోగ్య సేవలు ప్రైవేట్ రంగం ద్వారానే అందుతున్నాయి. కనుక, ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణను బలోపేతం చేయటంలో ప్రైవేట్ రంగాన్ని భాగస్వామిగా తీసుకోవటానికి ఇక్కడ అనుకూలమైన పరిస్థితి ఉన్నది.

> ఒకానొక కాలంలో కుటుంబంలో ఎవరికి ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా మొదట 'ఫ్యామిలీ డాక్టర్' దగ్గరకే వెళ్ళేవారు. కానీ ఇప్పుడు ఈ ఫ్యామిలీ డాక్టర్ అనే భావన క్రమక్రమంగా అదృశ్యమవుతున్నది. దాంతో రోగులు చిన్నపాటి సమస్యలకు కూడా నేరుగా ఆసుపత్రులకే పరుగులు పెడుతున్నారు. భారతదేశానికి స్పెషలిస్టు వైద్యుల అవసరం ఉన్నదనే విషయంలో అనుమానం లేదు. కానీ, ఫ్యామిలీ డాక్టర్ల సంఖ్యను పెంచడం ఇంతకన్నా ముఖ్యం.




భారతదేశం స్వాతంత్ర్యం సాధించుకొని 75 సంవత్సరాలు పూర్తి చేసుకొని మూడేళ్లు గడిచాయి. 'అమృత కాలం'లోకి అడుగుపెట్టిన సందర్భంగా, 2047 నాటికి, అంటే స్వాతంత్ర్యపు 100వ సంవత్సరం నాటికైనా, 'ఫ్యామిలీ డాక్టర్' భావనను బలమైనదిగా, ప్రభావవంతమైనదిగా మార్చాలన్న లక్ష్యాన్ని ముందు పెట్టుకుని, ఆ దిశగా స్ఫూర్తిదాయకమైన, అమలు చేయగలిగే, స్పష్టమైన చర్యలు తీసుకోవాలి. అందుకు ఇదే తగిన సమయం.

వైద్య నీతిని, ఆచరణను నిర్దేశించే గ్రీకుల కాలం నాటి హిపోక్రటిక్ ప్రతిజ్ఞలో కీలకమైన అంశం: "రోగికి మేలు చేకూర్చటమే వైద్యుడి అత్యున్నత ప్రాధాన్యంగా ఉండాలి" అన్నది. ఈ మార్గదర్శక నియమాన్ని చిత్తశుద్ధితో పాటించినప్పుడే భారతదేశ ఆరోగ్య సంరక్షణ విధానాన్ని సమర్థవంతంగా పునర్నిర్మించేందుకు మార్గం సుగమం అవుతుంది.



■ డా. పి. రఘురామ్
సంస్థాపక డైరెక్టర్, కిమ్స్–ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్
సంస్థాపకులు & ఛైర్మన్, ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్


(నేడు జాతీయ వైద్యుల దినోత్సవం)



# ఎక్కడెక్కడి నుంచో..

ఎక్కడెక్కడి నుంచో కొట్టుకువస్తున్న గుర్రపుడెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలతో ఏలూరు కాల్వ మూసుకుపోతోంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వం కాల్వలకు నీటిని విడుదల చేసినా.. ఈ గుర్రపుడెక్క, ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా నీరు సక్రమంగా ముందుకు పారే పరిస్థితి లేకుండాపోయింది. గుణదలకు సమీపంలోని మురళీనగర్ వద్ద ఏలూరు కాల్వ నిండా నీరున్నప్పటికీ అసలు నీటి చుక్కే కనిపించకుండా గుర్రపుడెక్క ఇలా పేరుకుపోయింది.





## 8 నుంచి శాకంబరీ ఉత్సవాలు

- మూడు రోజుల పాటు నిర్వహణ
- కూరగాయలు విరాళంగా సేకరించేందుకు ఏర్పాట్లు

6



## ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

- వ్యోమగామిగా ఎంపికైన తెలుగమ్మాయి జాహ్నవి
- రంగాపురం గురుకుల పాఠశాల బాలికలతో ముఖాముఖి

8

# దుబాయిలోనూ దుకాణం

## అద్విక ఏర్పాటుకు భారీ స్కెచ్

### పలుమార్లు అక్కడికి వెళ్లొచ్చిన ఆదిత్య

- తాజాగా 42 మంది ఏజెంట్లకు నోటీసులు
- తిరిగొస్తానని ఏజెంట్లకు చెబుతున్న ఆదిత్య
- రంగంలోకి రాజకీయ దళారులు
- డబ్బు ఇప్పిస్తామంటూ ఏజెంట్లతో బేరాలు



నగరంలోని అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడలో అద్విక ట్రేడింగ్ కంపెనీ ఏర్పాటుచేసి రూ.కోట్లు లూటీ చేసిన తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య దుబాయిలోనూ ట్రేడింగ్ కంపెనీలు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందించుకున్నాడు. అందుకే ఇక్కడ పెట్టుబడిదారుల నుంచి వసూలు చేసిన డబ్బును దుబాయిలోని కబానా ట్రేండింగ్ కంపెనీకి పంపినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్కడ కంపెనీలు ఏర్పాటు చేస్తున్నామని ఏజెంట్లకు, ఖాతాదారులకు మిగతా 6లో..


# ,నేనింతే..

## వివాదాస్పదంగా విజయవాడ పశ్చిమ డివిజన్‌లోని ఓ ఇన్‌స్పెక్టర్ పనితీరు

### ప్రతి ఫిర్యాదుకూ ఓ పిట్టకథ

కోడిపందేలు జరిగితే.. 'కోళ్లే కదా.. కొట్టుకు చస్తాయిలే..' అంటారు. అధికారులు నివేదిక అడిగితే.. 'చూద్దాంలే..' అని సాగదీస్తారు. ఆరోపణలు ఉన్న సిబ్బందికి.. 'నేనున్నాను లే..' అని అభయమిచ్చేస్తారు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఓ ఇన్‌స్పెక్టర్ పనితీరుకు ప్రామాణికాలు ఇవన్నీ. ఆయన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో)గా ఉన్న స్టేషన్‌లో సిబ్బందిపై నేరుగా డీజీపీకి ఫిర్యాదులు అందడంతో అక్కడ జరుగుతున్న బాగోతాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి.

- అధికారులు నివేదిక కోరినా ఇవ్వని నిర్లక్ష్య వైఖరి
- ఆరోపణలు ఉన్న సిబ్బందికి అండదండలు
- ఇష్టులను స్టేషన్‌కు బదిలీ చేసుకోవడంలో ఘనాపాఠి
- అధికారులను సైతం కాదని సొంత సిఫార్సులు
- ప్రశ్నించిన అధికారులపై ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : విజయవాడ పశ్చిమ డివిజన్‌లోని ఓ పోలీసు స్టేషన్‌లో క్రైం నెంబరు 715/2022తో చీటింగ్ కేసు నమోదైంది. ఇందులో ఇద్దరు నిందితుల అరెస్టు పెండింగ్‌లో ఉంది. పెండింగ్ కేసు లెక్కలను తగ్గించే క్రమంలో ఈ కేసు బయట పడింది. ఈ కేసులో ఏ3గా పెనుమర్తి సూర్యకుమారి, ఏ4గా తొట్టెంపూడి వరలక్ష్మి అరెస్టు పెండింగ్‌లో ఉంది. ఓ మహిళా ఎస్ఐ తన వద్ద పనిచేసే కానిస్టేబుల్‌తో వారిని స్టేషన్‌కు రమ్మని కబురు పంపారు. వారికి 41ఏ నోటీసులు ఇవ్వాలని నిర్ణయించారు. కేసులో స్టేషన్‌కు పిలిపించకుండా ఉండేందుకు ఓ మహిళ నుంచి కొంత మొత్తంలో మహిళా ఎస్ఐ, కానిస్టేబుల్ డబ్బు తీసుకున్నారు. ఆ మహిళ జోలికి వెళ్లడం మానేసిన పోలీసులు రెండో మహిళను టార్గెట్ చేశారు. జరిగిన విషయమంతా ఆమెకు తెలియడంతో డీజీపీకి ఫిర్యాదు చేసింది. ఆయన దీనిపై పోలీసు కమిషనర్‌కు ఫోన్‌చేసి అడిగారు. జరిగిన ఘటనపై నివేదిక ఇవ్వాలని సీపీ సంబంధిత ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. ఈ ఆదేశాలు ఇచ్చి రెండు రోజులు గడిచినా ఆ ఇన్‌స్పెక్టర్ ఎలాంటి నివేదిక ఇవ్వలేదు. పైగా ఆ మహిళా ఎస్ఐ, కానిస్టేబుల్‌ను వెంట బెట్టుకుని పోలీసు కమిషనర్ మిగతా 6లో..

### ట్రాఫిక్ ఆర్ఎస్ఐ విషయంలోనూ..

జాతీయ రహదారులు ఎక్కువగా ఉండే ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి ఇక్కడ ఓ ఆర్ఎస్ఐకి బాధ్యతలు అప్పగించారు. చలానాలు విధించడానికి ఆయన్ను కొంతమంది అధికారులు బాగా ఉపయోగించుకుంటున్నారు. ఆ అధికారులను కలవని టిప్పర్లు, లారీల యజమానులే టార్గెట్‌గా చలానాలు వేయిస్తున్నారు. వారు వచ్చి కలిశాక చలానాల విధింపు ఆగిపోతోంది. దీనిపై ఫిర్యాదులు అందడంతో అక్కడి నుంచి ఆర్ఎస్ఐని అధికారులు బదిలీ చేశారు. ఈ బదిలీని నిలుపుదల చేయించడంలోనూ ఈ ఇన్‌స్పెక్టర్ పైచేయి సాధించడంతో కమిషనరేట్‌లో ఇతని తీరు చర్చనీయాంశమైంది.



దట్టమైన కంపచెట్లతో నిండిన సాగర్ కాల్వ

# ముందుకుసాగరు

## సాగర్ కాల్వల అభివృద్ధికి నిధులిచ్చినా నిష్ప్రయోజనమే

- కంపచెట్లు, పూడికతో నిండిన సాగర్ కాల్వలు
- అవగాహన లేని అధికారుల నామమాత్రపు అంచనాలు
- నివేదిక ఆధారంగా నిధులు కేటాయించిన ప్రభుత్వం
- మరమ్మతులకు ఎటూ సరిపోని నిధులు
- పనుల నిర్వహణకు ముందుకురాని నీటి సంఘాలు
- ఖరీఫ్ నేపథ్యంలో పనులు చేపట్టాలని రైతుల వేడుకోలు

నందిగామ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : చందర్లపాడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో బండి పాలెం రెగ్యులేటర్ నుంచి 23 కిలోమీటర్ల మేర సాగర్ కాల్వ ఉంది. నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో 22 కిలోమీటర్ల మేర సాగుతుంది. వైసీపీ పాలనలో ఆ కాల్వపై రూపాయి మిగతా 6లో..

అధికారుల అవగాహనారాహిత్యం, శాఖల మధ్య సమన్వయలోపం నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్పీ) కాల్వలకు శాపంగా మారింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోక పూడిక, కంచెతో నిండిన సాగర్ కాల్వలకు కూటమి ప్రభుత్వంలోనూ గ్రహణం వీడే అవకాశాలు కనిపించట్లేదు. కాల్వల మరమ్మతులకు నిధులివ్వాలని సీఎం చంద్రబాబు జలవనరుల శాఖను ఆదేశించగా, క్షేత్రస్థాయిలో పర్యటించి అంచనాలు వేయాల్సిన అధికారులు తోచిన విధంగా నివేదిక ఇచ్చారు. అలసత్వపు అంచనాల కారణంగా చందర్లపాడు, నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు నిధులు కేటాయించినా సరిపోని పరిస్థితి ఏర్పడింది.

# నయా దందా!

## తాడిగడప మునిసిపాలిటీలో అక్రమ నిర్మాణాలు!

- నివాస గృహాల ప్లాన్లతో వెలుస్తున్న అపార్టుమెంట్లు
- చేతులు మారుతున్న లక్షల రూపాయలు
- దళారీ అవతారమెత్తి అంతా చక్కబెడుతున్న బిల్డర్లు
- అన్ని అనుమతులు ఉన్నాయంటూ ఫ్లాట్ల అమ్మకాలు
- కొనుగోలు చేస్తే ఆస్తిపన్నుతో పాటు జరిమానాల భారం
- స్థల యజమాని, బిల్డర్, అధికారులు కుమ్మక్కై కుట్ర

తాడిగడప మునిసిపాలిటీలో నయా దందా నడుస్తోంది. దళారులుగా మారిన బిల్డర్లు ఇటు స్థల యజమానులు, అటు అధికారులతో కుమ్మక్కై, సాధారణ గృహాలకు అనుమతులు తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా అపార్ట్‌మెంట్లనే నిర్మించేస్తున్నారు. ఇందుకు ప్రతిఫలంగా లక్షల రూపాయలు ముట్టజెబుతున్నారు. భవనాలకు అన్ని అనుమతులు ఉన్నాయని మాయమాటలు చెబుతూ ఫ్లాట్ల అమ్మకాలు చేస్తున్నారు. వీరి మాటలు నమ్మి కొనుగోలు చేసిన వారు ఆ తర్వాత ఆస్తి పన్ను, అక్రమ నిర్మాణాల జరిమానాలతో అవస్థలు పడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో అక్రమ భవన నిర్మాణ పేరుతో నయా దందా జోరుగా సాగుతోంది. స్థల యజమానులు, బిల్డర్లు, మున్సిపల్ అధికారులు కుమ్మక్కై నడిపే ఈ వ్యవహారంలో కొనుగోలు దారులు బాధితులుగా మారుతున్నారు. మోసం ఎలా చేస్తున్నారంటే.. తమ స్థలాల్లో సాధారణ గృహాలను కట్టే పేరుతో వాటి యజమానులు బిల్డర్లను మీడియేటర్లుగా పెట్టుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. సాధారణ వ్యక్తిగత నివాస గృహాలకు బిల్డర్లతో సహజంగా సంబంధం ఉండదు. కాంట్రాక్టర్లతో నిర్మాణాలు చేయించే మిగతా 6లో..

## మూడ్రోజులకే.. మురిగిపోతున్నాయ్!

6

మధ్యాహ్న పథకంలో నిల్వ గుడ్లు సరఫరా



శాకంబరీ ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఈవో తదితరులు

## 8 నుంచి శాకంబరీ ఉత్సవాలు

**ఇంద్రకీలాద్రి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) :** ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ శాకంబరీ ఉత్సవాలు ఆషాఢ శుద్ధ త్రయోదశి నుంచి పౌర్ణమి వరకు జూలై 8, 9, 10 తేదీల్లో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈక్రమంలో సోమవారం ఈవో శీనానాయక్ చాంబర్‌లో ఈఈ కేవీఎస్ఆర్ కోటేశ్వరరావు, డీఈలు రవీంద్ర, కోటేశ్వరరావు, సహాయ కమిషనర్ సీహెచ్ రంగారావులతో కలిసి ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, ఏటా ఆషాఢమాసంలో మూడు రోజుల పాటు కనకదుర్గమ్మకు శాకంబరీ ఉత్సవాలు జరుగుతాయని, ఆ సమయంలో అమ్మవారి మూలవిరాట్టుతోపాటు, ఉపాలయాలలో కొలువైన దేవతా మూర్తులకు, ఆలయ ప్రాంగణాలల్లో వివిధ రకాల కూరగాయలతో అలంకరిస్తారని తెలిపారు.

**కూరగాయల సేకరణకు..**

శాకంబరీ ఉత్సవాలలో వినియోగించేందుకు కూరగాయలను విరాళంగా సేకరించేందుకు దేవస్థానం సూపరింటెండెంట్ చందు శ్రీనివాస్, గుమస్తాలు పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో పర్యటించారు. సోమవారం ఏలూరు, తాడేపల్లి గూడెం, తణుకు కొత్తపేట, మడికి, సిద్ధాంతం తదితర ప్రాంతాల్లో పర్యటించి మార్కెట్లను, వ్యాపారులను కలిశారు. కూరగాయలను అందించాలని కోరారు.

## దుర్గమ్మను దర్శించుకున్న త్రిపుర గవర్నర్



కనకదుర్గమ్మను సోమవారం త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఈవో, అర్చకులు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు అందజేశారు.

### భక్తులకు ఇబ్బంది లేకుండా కొండరాళ్ల తొలగింపు

**ఇంద్రకీలాద్రి :** ఇంద్రకీలాద్రి దిగువన కేశఖండనశాల పక్కన ప్రధాన రహదారిపై పడిన కొండరాళ్లను, మట్టిని తొలగించే కార్యక్రమాన్ని ఈవో సోమవారం రాత్రి పర్యవేక్షించారు. కనకదుర్గనగర్‌లో లెవలింగ్ పనులను పరిశీలించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఈవో తెలిపారు.

## గడువులోగా పరిష్కారం చూపాలి : జేసీ

**కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) :** జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 134 అర్జీలు వచ్చాయని, వీటిని క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని జేసీ ఇలక్కియ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, అర్జీదారులు సంతృప్తిచెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, డీఆర్‌డీఏ పీడీ ఎఎన్‌వీ నాంచారరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ముందుకు సాగరు

(5వ పేజీ తరువాయి)

ఖర్చు పెట్టలేదు. ఐదేళ్ల వ్యవధిలో పూర్తిగా పూడికతో నిండిపోగా, కంపచెట్లు అడవిని తలపిస్తున్నాయి. ఫలితంగా సాగర్ చివరి భాగంలో ఉన్న ఈ ప్రాంతానికి అరకొర నీరే చేరుతోంది. పూడిక, కంపచెట్ల వల్ల ఆ కొద్దిపాటి నీరు కూడా సక్రమంగా పంట పొలాలకు వెళ్లట్లేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, వెంటనే సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిపి పాలకవర్గాలు ఏర్పాటు చేయడం జరిగింది.

**ఇష్టానుసారంగా అంచనాలు**

అధ్వానంగా ఉన్న కాల్వలపై దృష్టిపెట్టిన ప్రభుత్వం అంచనాలు రూపొందించాలని ఆ శాఖను ఆదేశించింది. ఉన్న పరిస్థితులను అంచనా వేయని అధికారులు మొక్కుబడిగా నివేదిక ఇచ్చారు. దీంతో రెండు డిస్ట్రిబ్యూటరీ కమిటీల పరిధిలోని 45 కిలోమీటర్ల కాల్వల మరమ్మతులకు రూ.1.11 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో కంప, పూడిక పనులు చేపట్టాల్సి ఉంది. వాస్తవానికి కాల్వలపై భారీగా కంపచెట్లు ఉండగా, కేవలం తిన్ జంగిల్ అంటూ నివేదిక ఇచ్చారు. ఆ మేరకే ఉన్నతాధికారులు నిధులు కేటాయించారు. పూడిక పనులు కూడా కేవలం 8 అంగుళాల మేర చేపడితే చాలు అన్నట్టు ఇచ్చిన నివేదిక వల్ల అరకొర నిధులు మంజూరయ్యాయి.

**పనుల బాధ్యత నీటి సంఘాలకు..**

ఆనవాయితీ ప్రకారం.. ఆ నిధులను నామినేషన్ పద్ధతిలో నీటి సంఘాల ద్వారా చేయిస్తారు. గతంలో ఎన్ఎస్పీ కాల్వ అభివృద్ధి పనులంటే నేతలంతా పోటీ పడేవారు. పని దక్కితే చాలు.. పనులు చేసినా చేయకపోయినా బిల్లులు చేసుకోవచ్చనే భరోసాతో ఉండేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. మంజూరైన నిధులతో పనులు చేపడితే నష్టపోవాల్సి వస్తుందన్న ఆలోచనతో దూరంగా ఉంటున్నారు. తీవ్రమైన కంప, పెద్ద ఎత్తున పూడిక ఉన్న నేపథ్యంలో ఆ నిధులు ఏమాత్రం చాలవన్నది వారి ఆలోచన. దీనికితోడు నీటి సంఘాలు చేపట్టాల్సిన పనులకు కాంట్రాక్టర్ ప్రయోజనం ఉండదు. అందుకు గాను అంచనా నుంచి పదిశాతం తగ్గించి నిధులు కేటాయించారు. పనులు చేపట్టాలంటే పాన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ తప్పనిసరిగా ఉండాలి. 12 శాతం జీఎస్టీ, ఒకశాతం నాక్ సెస్ చెల్లించాల్సి ఉంది. జీఎస్టీ, పాన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ తదితరాల వల్ల తెల్లకార్డుతో పాటు అన్ని ప్రభుత్వ పథకాలూ రద్దవుతాయన్న భయంతో పనులు చేపట్టేందుకు నీటి సంఘాలు వెనకాడుతున్నాయి.

**ఉపాధి హామీ పనులూ అడ్డంకే..**

పూడికతీతకు ఎన్ఎస్పీ నిధులు కేటాయించిన విషయం తెలిసి కూడా సదరు కాల్వల్లో ఉపాధి పనులు చేయించారు. ఆయా గ్రామాల పరిధిలో ఈ పనులు అరకొరగా జరిగ్గా, సొమ్ము కూడా చెల్లించారు. తిరిగి అదే పనికి ఎన్ఎస్పీ నిధులు కూడా వినియోగిస్తే ఇబ్బందులు తలెత్తవచ్చని నీటి సంఘాలు భావిస్తున్నాయి. ఒకే పనికి రెండు శాఖల నుంచి బిల్లులు చెల్లిస్తే విజిలెన్స్ దాడులు జరగవచ్చన్న భయమూ వెంటాడుతోంది. పదవి చేపట్టిన అనతికాలంలోనే నిధులు వచ్చాయన్న ఆనందంలో ఉన్న నీటి సంఘాల ప్రతినిధులు ప్రస్తుతం మానసిక సంఘర్షణకు గురవుతున్నారు. వచ్చిన నిధులు వదల్లేక, పనులు చేపట్టే ధైర్యంలేక సతమతమవుతున్నారు. ఇప్పటికైనా జలవనరుల శాఖ ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది. కంప, పూడిక పనులను సమగ్రంగా పరిశీలించి నిధులు కేటాయించాలి. సాంకేతిక సమస్యల కారణంగా పనులు చేపట్టలేక సాగునీటి సంఘాలు దూరంగా ఉన్న నేపథ్యంలో టెండర్ ద్వారా కాంట్రాక్ట్ పనులను ఆమోదించాలి. ఖరీఫ్ ప్రారంభమైనందున త్వరగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## 'డిజి లక్ష్మి' అమలుకు మార్గదర్శకాలు

**అమరావతి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):** పట్టణ స్వయం సహాయక సంఘాల్లో డిగ్రీ చదివిన వారికి ఉపాధి, ప్రజలకు డిజిటల్ సేవలు అందించే ఉద్దేశంతో ప్రభుత్వం 'డిజి లక్ష్మి' పథకాన్ని తీసుకొచ్చింది. పథకం అమలుకు రాష్ట్రవ్యాప్తంగా 9,034 ఉమ్మడి సర్వీసు కేంద్రాలను (సీఎస్‌సీ) ఏర్పాటు చేసేందుకు ఆమోదిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. పథకం అమలుకు అవసరమైన అర్హతలను పేర్కొంటూ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆయా డ్వాక్రా సంఘాల్లో కనీసం మూడేళ్లు సభ్యులుగా ఉన్న, 21-40 ఏళ్ల మధ్య వయసున్న వివాహితులు, కనీసం గ్రాడ్యుయేషన్ చదివి, స్మార్ట్ ఫోన్ ఉపయోగించే నైపుణ్యం కలిగిన వారిని అర్హులుగా పేర్కొంది.



# మూడ్రోజులకే.. మురిగిపోతున్నాయ్!



గండేపల్లి, కంచికచర్ల పాఠశాలల్లో మురిగిపోయిన గుడ్లు

మధ్యాహ్న భోజనం పథకం గుడ్లు మురిగిపోతున్నాయి. సరఫరా చేసిన మూడు రోజులకే గుడ్లు మురిగిపోవటం వల్ల ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. విద్యార్థులకు అందించాల్సిన గుడ్లు పాడైపోవడంతో గత్యంతరం లేక పారేస్తున్నారు. ఎక్కువ రోజులు నిల్వ ఉన్న గుడ్లను సరఫరా చేయటం వల్ల అవి మురిగిపోతున్నాయని ఆరోపిస్తున్నారు.

- మధ్యాహ్న పథకంలో నిల్వ గుడ్లు సరఫరా
- పిల్లలు తింటే ఫుడ్ పాయిజన్ ప్రమాదం
- చేసేదిలేక పారేస్తున్న ఉపాధ్యాయులు
- కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

**కంచికచర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తూ.. హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన (మిడ్ డే మీల్స్) పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. భోజనంలో వారానికి ఐదు రోజులు తప్పనిసరిగా విద్యార్థులకు కోడిగుడ్లు అందచేయాల్సి ఉంది. మూడురోజులు ఉడికించిన గుడ్లు, రెండ్రోజులు ఉడికించి వేయించిన గుడ్లు విద్యార్థులకు ఇవ్వాలి. ఇందుకు గాను విద్యార్థుల హాజరును బట్టి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యాశాఖ యాప్‌లో నెలకు సరిపడ గుడ్లకు ఇండెంట్ పెడతారు. కాంట్రాక్టరు ప్రతి వారం పాఠశాలలకు వెళ్లి హెచ్ఎంలకు గుడ్లు అందజేస్తారు. వేసవి సెలవుల అనంతరం జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. 12వ తేదీతో పాటు 20, 28 తేదీల్లో కాంట్రాక్టరు పాఠశాలలకు గుడ్లు సరఫరా చేశాడు. అయితే 28న సరఫరా చేసిన గుడ్లు ఎక్కువ భాగం మురిగిపోయాయి. ఉడకబెట్టిన తర్వాత భరించలేని దుర్వాసన వస్తున్నది. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులు గుడ్లను పారవేస్తున్నారు. కాంట్రాక్టరు నిల్వఉన్న గుడ్లను సరఫరా చేయటం వల్ల మురిగిపోయాయని ఆరోపిస్తున్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల సమాచారం మేరకు గండేపల్లి పాఠశాలలో 38, కంచికచర్ల ఇందిరాకాలనీ పాఠశాలలో 54, కీసర మెయిన్ పాఠశాలలో ఆరు, పేరకలపాడు పాఠశాలలో 50, పరిటాల హెచ్‌డబ్ల్యు పాఠశాలలో కొన్ని గుడ్లు మురిగిపోయాయి. గుడ్లు ఎక్కువగా మురిగిపోవటంతో ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పాడైపోయిన గుడ్లు తింటే ఫుడ్ పాయిజన్ అయి తాము బలికావల్సి వస్తుందని వారు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ప్రత్యేకంగా అందిస్తున్న సన్నబియ్యం చాలా బాగున్నాయని, విద్యార్థులు ఎంతో ఇష్టంగా తింటున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గతంతో పోల్చితే చిక్కీలు, రాగి పిండి, బెల్లం పిండితో పాటుగా బ్యాగులు, దుస్తులు నాణ్యతాపరంగా బాగున్నాయని అంటున్నారు. అయితే ఫుడ్ పాయిజన్ కాకముందే ప్రభుత్వం స్పందించి నిల్వ గుడ్లను సరఫరా చేసిన కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. మురిగిపోయిన గుడ్ల విషయమై మండల విద్యాశాఖాధికారి బాలాజీ నాయక్‌ను వివరణ కోరగా.. మండలానికి సరఫరా అవుతున్న గుడ్లపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. గుడ్లు ఎక్కువగా మురిగిపోతున్నాయంటూ పలువురు ఉపాధ్యాయులు తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. ఈ అంశాన్ని వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలియపర్చినట్టు ఆయన పేర్కొన్నారు. ఇకపై బాగున్న గుడ్లు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.



బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న శర్మిష్ఠ

### చివరి రోజు 779 మంది

## ఏఎన్ఎంల బదిలీ

- రాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ

**మచిలీపట్నం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) :** ఉమ్మడి కృష్ణాజిల్లా సచివాలయాల్లో 779 మంది ఏఎన్ఎంలను బదిలీలు చేశారు. సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్‌కు కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లోని 779 మంది ఏఎన్ఎంలు రావడంతో డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. ఏఎన్ఎంలు గంటల తరబడి నిరీక్షించారు. కౌన్సెలింగ్‌కు సోమవారం చివరిరోజు కావడంతో ఏఎన్ఎంలు తమకు కావలసిన స్థానాన్ని కోరుకున్నారు. ఐదేళ్ల సర్వీసు నిండిన వారిని బదిలీ చేశారు. మెరిట్, సీనియారిటీ ఆధారంగా బదిలీలు జరిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠతో పాటు డిప్యూటీ విజయభారతి తదితరులు బదిలీల ప్రక్రియను నిర్వహించారు.

# రూ.40,17,578 చెల్లించండి

- మహిళ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణం
- వినియోగదారుల ఫోరం సంచలన తీర్పు
- 30 రోజుల్లో చెల్లించాలని ఆస్పత్రికి నోటీసులు

**మచిలీపట్నం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) :** మహిళ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని, పిలలకు తల్లి లేనిలోటు తీర్చలేనిదని, ఆ కుటుంబానికి సదరు ఆస్పత్రి వైద్యులు రూ.40,17,578 చెల్లించాలని జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు, న్యాయమూర్తి నందిపాటి పద్మారెడ్డి తీర్పు ఇచ్చారు. వివరాలలోకి వెళితే.. ముదినేపల్లి మండలం వణుదుర్రు గ్రామానికి చెందిన మద్దిర నాగవెంకట శ్రీనివాసరావు భార్య శివనాగలక్ష్మి కడుపునొప్పితో బాధపడుతుండగా భీమవరం శ్రీ హాస్పటల్‌లో 2020 డిసెంబర్ 30న చేర్పించారు. డాక్టర్ గిరికుమార్ శాస్త్రి 2021 జనవరి 2న గర్భసంచి ఆపరేషన్ చేశారు. జనవరి 3న ఆమె తీవ్ర కడుపు నొప్పితో మూత్ర విసర్జన ఆగిపోయింది. దీంతో భీమవరంలోని ఇంటీరియల్ ఆసుపత్రి డాక్టర్ అశోకవర్మ వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ జనవరి 7న మృతిచెందింది. దీనిపై శివనాగలక్ష్మి భర్త శ్రీనివాసరావు వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. న్యాయమూర్తి పద్మారెడ్డి, మహిళా సభ్యురాలు శ్రీలక్ష్మి కేసు పూర్వాపరాలు పరిశీలించి వైద్యుల నిర్లక్ష్యం వల్లే శివనాగలక్ష్మి మృతి చెందినట్టు తేల్చారు. పిల్లలకు తల్లిలేని లోటు తీర్చలేనిదని.. సదరు ఆస్పత్రి రూ.37,13,000, మెడికల్ బిల్లులు రూ.3,04,578 తొమ్మిది శాతం వడ్డీతో చెల్లించాలని తీర్పుచెప్పారు. కోర్టు ఖర్చుల నిమిత్తం రూ. 40వేలు ఫిర్యాదుదారుడు మద్దెల నాగవెంకట శ్రీనివాసరావుకు ఇంటీరియల్ ఆసుపత్రి చెల్లించాలని నోటీసు ఇచ్చారు. 30 రోజుల్లోగా తీర్పు అమలు చేయాలన్నారు.

## నర్సాపూర్-ఎస్ఎంవీటి బెంగుళూరు ప్రత్యేక రైలు వేళల మార్పు

**రైల్వేస్టేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) :** నర్సాపూర్-ఎస్ఎంవీటీ బెంగుళూరు ప్రత్యేక రైలు విజయవాడ, గూడూరు స్టేషన్ల రాకపోకల వేళల్లో మార్పులు చేసినట్టు విజయవాడ డివిజన్ పీఆర్వో ఎన్ మండ్రుపకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 07153 నర్సాపూర్-ఎస్ఎంవీటీ బెంగుళూరు రైలు జూలై 4 నుంచి సెప్టెంబరు 26 వరకు ప్రతి శుక్రవారం నడుస్తుంది. 07154 ఎస్ఎంవీటీ-బెంగుళూరు రైలు జూలై 5 నుంచి సెప్టెంబరు 27వరకు ప్రతి శనివారం నడుస్తుంది. 07153 రైలు 7.15కి వచ్చి 7.25కి బయలుదేరుతుంది. గూడూరు స్టేషన్‌కు రాత్రి 12.23కి వచ్చి 12.25కి బయలుదేరుతుంది.

### వెళ్లిపోవాలని

# వేధిస్తున్నారు!

- పెట్రోల్ పోసుకుని గ్రామ కార్యదర్శి ఆత్మహత్యాయత్నం
- టీడీపీ కార్యకర్తలపై పోలీసులకు ఫిర్యాదు



**వత్సవాయి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) :** ఇక్కడి నుంచి తనను బలవంతంగా పంపించేందుకు విధులకు ఆటంకాలు కల్గిస్తున్నారని, మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ మనస్తాపంతో వత్సవాయి మండలం దేసుపాలెం గ్రామ కార్యదర్శి సుబేదర్ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. టీడీపీ కార్యకర్త అన్నెపాక హరీష్ ఇంటి ముందు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోబోయారు. వెంటనే స్థానికులు ఆమెను అడ్డుకుని రక్షించారు. ఈ సంఘటన జగ్గయ్యపేటలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇక్కడ పనిచేస్తున్న గ్రామకార్యదర్శి నాగరాజు బదిలీ కాగా.. ఆయన స్థానంలో గ్రామ కార్యదర్శిగా సుబేదర్ వచ్చారు. అయితే తనను టీడీపీ కార్యకర్త హరీష్, వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన జలీల్ ఇద్దరూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. 'దేసుపాలెం కార్యదర్శిగా నువ్వు ఇక్కడ అక్కర్లేదు.. గతంలో పనిచేసిన నాగరాజు బాధ్యతలు స్వీకరించేందుకు వస్తాడు.. వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలి' అంటూ బెదిరిస్తున్నారని ఆరోపించింది. తాను ఏం చేయలేనని సుబేదర్ పేర్కొనడంతో కోపం పెంచుకున్న హరీష్, జలీల్‌లు తనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఏడాది మే నెలలో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో హరీష్ మే 4న కార్యదర్శి సుబేదర్‌తో తనకు ప్రాణహాని ఉందని కోర్టును ఆశ్రయించారు. తర్వత వీరిద్దరూ సుబేదర్‌ను మరింత ఇబ్బంది పెట్టారని సమాచారం. వేధింపుల వల్లే తన భార్య ఆత్మహత్యాయత్నం చేసుకుందని భర్త ఎస్‌కే అలీ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

# దుబాయిలోనూ దుకాణం

(5వ పేజీ తరువాయి)

ఆదిత్య చెప్పినట్టు తెలిసింది. అద్వికలో డైరెక్టర్‌గా కిరణ్‌కుమార్, గిరి, సలహాదారురాలిగా ఉన్న కీర్తిని తీసుకుని పలుమార్లు దుబాయి వెళ్లి వచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. కొన్నాళ్ల క్రితం హైదరాబాద్‌లోని ఐబిస్, వెస్ట్రన్ స్టార్ హోటళ్లలో రెండు బిజినెస్ మీట్లు నిర్వహించినట్టు ఏజెంట్లు చెబుతున్నారు. ఈ సమావేశాలకు దుబాయిలోని కబానా సంస్థకు చెందిన ప్రతినిధులను తీసుకొచ్చాడని తెలుస్తోంది. పోలీసులు ఎంత విచారణ చేసినా ఆదిత్య మాత్రం నోరు విప్పట్లేదు. ఏజెంట్లను పిలిపించి విచారణ చేసి వివరాలను తెలుసుకోవాల్సి వస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 35 మంది ఏజెంట్లు ఉంటారని భావించారు. ఇప్పుడు ఈ సంఖ్య 42కు పెరిగింది. వాళ్లందరికీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఒక్కో ఏజెంట్‌ను పిలిపించి వివరాలు తెలుసుకుంటున్నారు. ఆ ఏజెంట్లు ఎంత మొత్తంలో పెట్టుబడి పెట్టారు, ఎంతమందితో ఎంతెంత మొత్తంలో పెట్టుబడి పెట్టించారు, పేఅవుట్లు (చెల్లింపులు) ఎంత మొత్తం తీసుకున్నారు అనే వివరాలు బయటకు లాగుతున్నారు. ఆదిత్య మొత్తం డేటాను డిలీట్ చేయడంతో లెక్కలు తేల్చడానికి నానాపాట్లు పడాల్సి వస్తోంది. ఏజెంట్లు ఇచ్చిన లెక్కలనే పరిగణనలోకి తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

**ఇలా పెట్టుబడి.. అలా చెల్లింపులు..**

ఆదిత్య వాట్సాప్ చాటింగ్‌లను పరిశీలించిన పోలీసులకు ఒక విషయంలో మాత్రం స్పష్టత వచ్చింది. పెట్టుబడిగా వచ్చిన ఏ ఒక్క రూపాయికి అతడు రికార్డులు నిర్వహించలేదు. పెట్టుబడిగా వచ్చిన డబ్బును బకాయిదారులకు చెల్లించినట్టు తెలిసింది. హైదరాబాద్‌లో అద్విక బోర్డు ఏర్పాటు చేసుకుని ఇద్దరు కార్యాలయాలు నిర్వహించారు. వారిలో ఒకరు రూ.25 కోట్లు పెట్టగా, మరొకరు రూ.50 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టించాడు. ఇందులో ఒక వ్యక్తి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఈ ఇద్దరితో ఆదిత్య చేసిన చాటింగ్‌ను పోలీసులు చదివారు. పెట్టుబడిదారులు ఒత్తిడి చేస్తున్నారని, వారిలో కొంతమంది రాజకీయ నేతలతో ఒత్తిడి చేయిస్తున్నారని చాటింగ్ చేశాడు. త్వరలో భారీ మొత్తంలో ఒక పెట్టుబడి వస్తుందని, అది రాగానే అందులో నుంచి ఆ అకౌంట్లను సెటిల్ చేద్దామని ఆదిత్య సమాధానం ఇచ్చాడు. దీన్నిబట్టి ఆదిత్య ఎక్కడా రికార్డులు నిర్వహించలేదని గుర్తించారు. మరోపక్క గోల్డెన్ లీఫ్ నకిలీ వెబ్‌సైట్‌ను జనం నుంచి డబ్బు వసూలు చేయడానికి విరివిగా ఉపయోగించుకున్నాడు. అద్వికకు సలహాదారులుగా ఉన్న కీర్తి, ఆమె భర్త నరసింహారావు సింగపూర్‌లో ఫారెన్ ఎక్స్ఛేంజ్ విభాగంలో పనిచేశారు. అద్వికలో ఈ గోల్డెన్ లీఫ్‌ను కీర్తి నిర్వహించింది. అద్వికలో పెట్టుబడులు పెట్టిన వారికి ఇందులో ఖాతాలు సృష్టించారు. ఇందులో కీర్తి 40 శాతం వాటా పెట్టినట్టు చూపించారు.

**మళ్లీ వస్తా.. రెట్టింపు వ్యాపారం చేద్దాం**

పోలీసుల అదుపులో ఉన్న ఆదిత్యను కొంతమంది ఏజెంట్లు కలుస్తున్నారు. ఇదంతా విచారణ సమయంలో జరుగుతోంది. ఆ సమయంలో ఆదిత్య వారితో కీలక వ్యాఖ్యలు చేసినట్టు తెలిసింది. ఈ విచారణ మొత్తం ఈఎస్ఐ రోడ్డులో ఉన్న అద్విక ట్రేడింగ్ కంపెనీలో జరుగుతోంది. పోలీసులు అరెస్టు చేసి, కేసు పెట్టి జైలుకు పంపినా మళ్లీ బయటకు వస్తానని చెబుతున్నట్టు తెలియవచ్చింది. తర్వాత వ్యాపారాన్ని మరింత రెట్టింపు స్థాయిలో పరుగులు తీయిస్తానని భరోసా ఇస్తున్నట్టు సమాచారం. ఎవరెవరికి బకాయి ఉన్నామో ప్రతి రూపాయి తిరిగి చెల్లిస్తానని అభయం ఇస్తున్నాడు. దీనికి ఆరేడు నెలల సమయం పడుతుందని చెబుతున్నట్టు తెలియవచ్చింది.

**ఫ్లాట్‌ను విక్రయించిన యజమానికి ఝలక్**

ఆదిత్య పెనమలూరు మండలం తాడిగడపలో రూ.2 కోట్లతో ఒక ఇంటిని నిర్మించాడు. ఇది పూర్తయ్యాక రూ.2.50 కోట్లతో ఆదిత్య, కంపెనీ డైరెక్టర్‌గా ఉన్న కిరణ్‌కుమార్ కలిసి ఎన్టీఆర్ కాలనీలో ఉన్న ఫిలిం కాలనీలో రెండు ఫ్లాట్లు కొన్నారు. అడ్వాన్స్‌గా బిల్డర్‌కు ఇచ్చిన డబ్బును తిరిగి అద్వికలో పెట్టుబడిగా పెట్టించారు. కొంతకాలంగా చెల్లింపులు ఆగిపోవడంతో బిల్డర్ తిరుగుబాటు చేశాడు. ఆదిత్యను కూర్చోబెట్టి ఆ ఫ్లాట్‌ను తన పేరు మీద బిల్డర్ రాయించుకున్నాడు. ఇదికాకుండా తాడేపల్లిలో రూ.కోటి విలువైన రెండు, మూడు ఫ్లాట్లను బుక్ చేశాడు. వాటికి అడ్వాన్స్‌లు ఇచ్చి ఆ డబ్బును పెట్టుబడిగా తీసుకున్నాడు.

**రంగంలోకి రాజకీయ దళారులు**

అద్వికలో పెట్టుబడిదారులుగా ప్రముఖులు ఉన్నాయి. ఎవరి డబ్బును వారు ఇప్పించుకునే పనిలో పడ్డారు. సందట్లో సడేమియా అన్నట్టుగా రాజకీయ దళారులు రంగంలోకి దిగారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఏజెంట్లు అద్విక కార్యాలయం వద్ద చర్చించుకున్నారు. నగరానికి చెందిన ఓ ఎమ్మెల్యే పీఏ టచ్‌లోకి హైదరాబాద్, విశాఖపట్నం ఏజెంట్లు వెళ్లినట్టు తెలిసింది. అసలు మొత్తాన్ని వెనక్కి ఇప్పించినందుకు కొంత మొత్తాన్ని డిమాండ్ చేసినట్టు చెప్పుకొంటున్నారు.

# నయా దందా!

(5వ పేజీ తరువాయి)

పరిస్థితి అయితే ఉంటుంది. అపార్ట్‌మెంట్స్, గ్రూప్ హౌస్ నిర్మాణాలు, గేటెడ్ కమ్యూనిటీల నిర్మాణాలకు సంబంధించి బిల్డర్లతో యజమానులు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్స్ కుదుర్చుకుంటారు. కానీ, తాడిగడపలో మాత్రం సాధారణ నివాసాలకు కూడా బిల్డర్లను తెర మీద పెట్టి ప్లాన్లకు దరఖాస్తు చేస్తున్నారు. వాస్తవానికి స్థల యజమానులకు, బిల్డర్లకు ఎలాంటి డెవలప్‌మెంట్ అగ్రిమెంట్స్ ఉండవు. పార్టనర్‌షిప్ డీడ్స్ కూడా ఉండవు. కానీ, యజమానుల తరఫున బిల్డర్లే తాడిగడప మునిసిపాలిటీలో ప్లాన్ల మంజూరు వ్యవహారాలను చూస్తున్నారు. ఈ వ్యవహారంలో ఇంకో ట్విస్ట్ ఏమిటంటే.. కొంతమంది బిల్డర్లకు, తాడిగడప మునిసిపల్ అధికారులకు సంబంధ బాంధవ్యాలు పతాక స్థాయిలో ఉన్నాయని చర్చ జరుగుతోంది. ఒక రకంగా మునిసిపాలిటీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసిన కమిషనర్లకు, ప్రస్తుత టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఏజెంట్లుగా ఈ బిల్డర్లు ఉంటున్నారు. స్థల యజమానులు భవన నిర్మాణాలకు సిద్ధం కావాలంటే బిల్డర్లను, లైసెన్స్‌డ్ సర్వేయర్లను అనధికార భాగస్వామ్యం చేసుకోవాలన్న వాతావరణాన్ని కొంత కాలంగా అధికారులు ఇక్కడ తీసుకువచ్చారు. మునిసిపల్ కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులతో ప్లాన్ల మాటున బిల్డర్లే బేరసారాలు కుదుర్చుతున్నారు. ప్లాన్‌కు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరిపేందుకు వీలుగా కనిష్ఠంగా రూ.5 లక్షల నుంచి గరిష్ఠంగా నిర్మించబోయే భవనాన్ని బట్టి లంచాలుగా వసూలు చేస్తున్నట్టు సమాచారం. ఇలా తాడిగడప మునిసిపాలిటీ అధికారులు బిల్డర్లను దళారులుగా చేసుకుని అక్రమ భవన నిర్మాణాల పేరుతో లక్షలాది రూపాయలను ఆర్జిస్తున్నారని తెలిసింది.

**ప్లాన్ ఇచ్చేశాక.. ఇక ఆ వైపు చూడరు**

స్థల యజమానులు 194, 200, 250, 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించే గృహాలకు అధికారులు నిబంధనల మేరకు అనుమతులు ఇచ్చేస్తారు. ఆ తర్వాత వారు అక్కడ ఏమి నిర్మాణాలు చేస్తున్నారో.. చేశారో చూడటం లేదు.

**తీసుకున్న ప్లాన్ సాధారణ నివాసం.. కట్టేది అపార్ట్‌మెంట్లు**

స్థల యజమానులు సాధారణ నివాస గృహాలకు అనుమతులు తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా జీ ప్లస్ 4, జీ ప్లస్ 5లతో అపార్ట్‌మెంట్ తరహాలో నిర్మాణాలు చేస్తున్నారు. మొత్తం ఎనిమిది ఫ్లాట్లతో కూడిన అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) నిబంధనలకు పాతరవేసి మరీ అపార్ట్‌మెంట్స్ తరహాలో నిర్మాణాలు చేస్తున్నారు.

**మాయమాటలతో అమ్మేస్తారు**

ఇలా నిర్మించిన అపార్ట్‌మెంట్ తరహా నిర్మాణాల్లోని ఫ్లాట్స్‌ను అమ్మకానికి పెడతారు. అన్ని రూల్స్ ఉన్నాయని, బిల్డర్లతో కట్టించామని మాయమాటలు చెప్పి అమ్మేస్తారు. కానూరు, తాడిగడప వంటి ప్రాంతాల్లో ధరలు తక్కువగా ఉండటంతో పాటు, ర్యాపిడ్ గ్రోత్ ఏరియాలో ఉండటం వల్ల కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నారు.

**కొన్న తర్వాత అసలు సినిమా**

తెరవెనుక జరిగిన విషయాలు తెలియక కొనుగోలు చేసిన వారికి ఆ తర్వాత సినిమా కష్టాలు మొదలవుతాయి. అనధికార కట్టడాల పేరుతో కొనుగోలు చేసిన వారి ఆస్తి పన్నుకు రెట్టింపుతో జరిమానాలు కట్టించుకుంటున్నారు. సగటున ఆస్తి పన్ను రూ.10 వేలు అనుకుంటే అక్రమ నిర్మాణం పేరుతో మరో రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఇది కాకుండా ఇచ్చిన ప్లాన్‌కు డీవియేషన్స్ పేరుతో అదనంగా మరికొంత పెనాల్టీలు వేస్తున్నారు.

**పెనాల్టీల అధికారం మునిసిపల్ అధికారులకు ఉందా ?**

సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్)ను అమలు చేసే పరిస్థితి లేదు. భవిష్యత్తులో కూడా అనుమతి వచ్చే అవకాశం లేదు. ఇలాంటపుడు అక్రమ కట్టడాల పేరుతో జరిమానాలు వసూలు చేసే అధికారం తాడిగడప మునిసిపాలిటీ అధికారులకు లేదు. కానీ వసూళ్లకు పాల్పడుతున్నట్టు విమర్శలు వస్తున్నాయి.

ప్లాట్లను అమ్మేటపుడే కొనుగోలుదారుడిదే పూర్తి బాధ్యత అన్నట్టు అగ్రిమెంట్ మీద సంతకాలు చేయించుకుంటారు. కాబట్టి స్థల యజమానిని ఏమీ అడగలేరు. బిల్డర్లను అడుగుదామంటే యజమానులతో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్స్ ఉండవు. మునిసిపాలిటీ అధికారులను అడిగితే తప్పంతా మీదేనంటూ వారికి చుక్కలు చూపిస్తున్నారు. దీంతో ఏమీ చేయలేని స్థితిలో కొనుగోలుదారులు ఉంటున్నారు.

# నేనింతే..

(5వ పేజీ తరువాయి)

కలవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అధికారులు నివేదిక అడిగితే ఆ విషయం చూడకుండా, డీజీపీకే ఫిర్యాదులు వెళ్లిన ఎస్ఐ, కానిస్టేబుల్‌ను భుజాన వేసుకోవడానికి వెనుక కారణం ఏమిటని కమిషనరేట్ అధికారులు ఆలోచించడం మొదలుపెట్టారు. కాగా, ఈ నెల మొదట్లో ఆ మహిళా ఎస్ఐ రాత్రిపూట గస్తీలో ఉండగా, 50 బస్తాల ప్రజా పంపిణీ బియ్యాన్ని తీసుకెళ్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. ఈ విషయం ఏసీపీకి తెలిసి ఆ కేసు గురించి అడిగారు. దానికి సంబంధించిన ఎలాంటి సమాచారాన్ని ఏసీపీకి అందజేయలేదు. వాస్తవానికి పోలీసులు ప్రజా పంపిణీ బియ్యాన్ని పట్టుకున్నప్పుడు సివిల్ సప్లయిస్ అధికారులకు అప్పగించాలి. తర్వాత వారు దీనిపై కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తారు. ఆ మహిళా ఎస్ఐ పట్టుకున్న వాహనం విషయంలో ఈ రెండూ జరగలేదని తెలుస్తోంది. దీనిపై ఇప్పటి వరకు కేసు నమోదైన దాఖలాలు కూడా లేవు.

**పట్టుబట్టి బదిలీ**

ఇటీవల ఓ క్రైం ఎస్ఐ ఉన్నట్టుండి ఆ పోలీసు స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఈ బదిలీని అధికారులంతా తిరస్కరించారు. దీని వెనుక మొత్తం కథను సదరు ఇన్‌స్పెక్టర్ నడిపించాడు. ఆ క్రైం ఎస్ఐ ఓ ఇన్‌స్పెక్టర్‌కు మావయ్య అవుతారు. ఆ ఎస్ఐ పనిచేసిన అన్ని స్టేషన్లలో ఆరోపణలు మూటగట్టుకున్నారు. ఈ ఫిర్యాదులన్నీ స్వయంగా అధికారులకు చేరాయి. ఈ బదిలీ వద్దని సీపీ, ఏడీసీపీ, ఏసీపీ చెప్పారు. అయినా రాజకీయ బాణాన్ని ఉపయోగించి ఆరోపణలు ఉన్న క్రైం ఎస్ఐని తన స్టేషన్‌కు తెచ్చుకున్నారు. ఈ బదిలీకి ఓ ఎమ్మెల్యే బావమరిదితో సిఫార్సులు చేయించినట్టు ఆరోపణలు ఉన్నాయి. జరిగిన తప్పుల గురించి తెలుసుకుని మందలిస్తే వారికి వెంటనే అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధి నుంచి ఫోన్‌కాల్స్ వెళ్తుండటం గమనార్హం.

## మున్సిపల్ సిబ్బందికి శిక్షణ

**అమరావతి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):** స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ 2.0 కింద స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా మున్సిపల్ సిబ్బందికి నైపుణ్య పెంపుదల శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ మార్గదర్శకాలు విడుదల చేస్తూ మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సాహాస్, వాష్ ఇన్‌స్టిట్యూట్‌లు కలిసి 13 జిల్లాల్లో, ఏఐఎల్ఎస్‌జీ మరో 13 జిల్లాల్లో మున్సిపల్ సిబ్బంది, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక బృందాలు, విద్యార్థులు, శానిటేషన్ సిబ్బంది, ఇతర పట్టణ పారిశుధ్య సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నాయి. శిక్షణ నిమిత్తం 70 పట్టణ స్థానిక సంస్థలకు రూ.14.89 కోట్లు, 53 పట్టణ స్థానిక సంస్థలకు రూ.8.94 కోట్లు మంజూరు చేశారు.

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 96,104, 115 |
| చికెన్ విత్ స్కిన్ | 184 |
| చికెన్ స్కిన్‌లెస్ | 194 |

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 590

## జనశిక్షణా సంస్థాన్‌లో నేటి నుంచి శిక్షణా కార్యక్రమాలు

మొగల్రాజపురం: నిరుద్యోగులకు జూలైలో స్వయం ఉపాధి నిమిత్తం జనశిక్షణా సంస్థాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు ఒకటో తేదీ (మంగళవారం)నుంచి కటింగ్ అండ్ టైలరింగ్, డ్రెస్‌మేకింగ్, బ్యూటీకేర్ అసిస్టెంట్, అసిస్టెంట్ డ్రెస్‌మేకర్, జామ్,జ్యూస్ తయారీ, అసిస్టెంట్ హ్యాండ్ ఎంబ్రా యిడరీ, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ, రిఫ్రిజరేషన్, జ్యూట్ క్రాఫ్ట్ ప్రొడక్ట్ మేకర్, బాతిక్ ప్రింటింగ్, అసిస్టెంట్ ఫ్రూట్ వెజిటబుల్ ప్రాసెసింగ్ ప్రిజర్వేషన్, ఫ్యాషన్ జ్యూయలరీ, మిర్రర్ వర్క్ తదితర వాటిలో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జనశిక్షణా సంస్థాన్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తదితరులు

## జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో పీబీ సిద్ధార్థ విద్యార్థులకు పతకాలు

మొగల్రాజపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): న్యూ ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పీబీ సిద్ధార్థ విద్యార్థులు పలు విభాగాల్లో స్వర్ణ, రజిత పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. సోమవారం కళాశాలలో పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐ.నాగ శివరామస్వామి స్వర్ణపతకం, ఏసిహెచ్ రామకృష్ణ రజిత పతకం, ఎం.సుధేష్ణ స్వర్ణ, రజిత పతకం సాధించారని చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను డైరెక్టర్ వేమూరి బాబూరావు, క్రీడల విభాగాధిపతి డాక్టర్ టీవీ బాలకృష్ణారెడ్డి, జిమ్ శిక్షకుడు శ్యామ్, సిద్ధార్థ అకాడమీ ప్రతినిధులు అభినందించారు.

## రాష్ట్రస్థాయి రోబోటిక్ శిక్షణా తరగతులు



పటమట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రోబోటిక్స్ పీవోటీ శిక్షణా కార్యక్రమం ఎలక్ట్రో ప్రో ఇండియా ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులకు 20 జిల్లాల నుంచి ట్రైనీలు హాజరయ్యారు. రోబోటిక్ ఎలా చేయాలనే విషయంపై విద్యార్థులకు శిక్షణనిచ్చారు. సంస్థ సీఈవో వెంకటేష్ సప్పగడ్డి మాట్లాడుతూ 20 జిల్లాల్లో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో ఈ కార్యక్రమంలో నిర్వహించి తద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యం వెలికి తీస్తామన్నారు. విద్యార్థులు ఆసక్తిగా రోబోటిక్స్‌ను తిలకించారు. కేవీఆర్ ఫౌండేషన్ ఇందిరా ప్రియదర్శిని, జీఎస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.



ఉత్పాదనల ఆవిష్కరణలో పాల్గొన్న నీలాంజన్, రమేష్‌బాబు, భార్గవ రెడ్డి, మనోజ్‌కుమార్ తదితరులు

## వ్యవసాయ రంగంలో సరికొత్త ఉత్పాదనల ఆవిష్కరణ

భారతీనగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగ ఉత్పత్తులలో ప్రపంచ ప్రఖ్యాతి పొందిన జర్మనీకి చెందిన బీఏఎస్ఎఫ్ కంపెనీ అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన సాంకేతిక పరిశోధనతో రూపొందించిన రెండు సరికొత్త ఉత్పాదనలైన వాలెక్సియా, మిబెల్యాలను సోమవారం గురునానక్ రోడ్లోని హోటల్ ఫ్రైడ్ మాధవలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా బీఏఎస్ఎఫ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సౌత్ ఆసియా హెడ్ నీలాంజన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిజినెస్ యూనిట్ లీడ్ రమేష్‌బాబు, మార్కెటింగ్ మేనేజర్ భార్గవ రెడ్డి, మనోజ్‌కుమార్, వినయ్ ప్రభాత్, తదితరులు పాల్గొన్నారు.



జీజీహెచ్ జనరల్ సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కళ్యాణి సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది ఆమెను ఘనంగా సత్కరించారు. -ప్రభుత్వాసుపత్రి



ఏరోబిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య, తదితరులు

## 3వ ఏషియన్ ఏరోబిక్స్ హిప్ హాప్ పోటీలకు వీపీఎస్ సిద్ధార్థ విద్యార్థులు ఎంపిక

మొగల్రాజపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో జూలై ఒకటి నుంచి 4 వరకు జరగనున్న మూడవ ఏషియన్ ఏరోబిక్స్ హిప్ హాప్ పోటీలకు వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూలు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య తెలిపారు. సోమవారం విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ 18 విభాగానికి కుమారి కె.శ్రీసరయు (8బి), మాస్టర్ ఎం. హిమేష్ (7ఎ), వి. మౌనిక (4డి) ఈ పోటీలకు హాజరవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రోజ్‌మేరీ, ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి, ఏరోబిక్ కోచ్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి

### ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



విద్యార్థులకు యూనిఫాం, బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కృష్ణలంక, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హితవు పలికారు. తూర్పు పరిధి కృష్ణలంక అమరజీవి పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ హైస్కూల్‌లో సోమవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు యూనిఫాం, స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు నాణ్యమైన స్కూల్ బ్యాగ్‌లను అందచేస్తున్నారని చెప్పారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో బ్యాగ్‌లు అందిస్తున్నామన్నారు. మంచి భవనం, క్రీడా మైదానంతో మంచి వాతావరణంతో ప్రభుత్వ స్కూల్‌ను తీర్చిదిద్దారని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు రమేష్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. వేములపల్లి రంగారావు, మోటేపల్లి చిన్నా, గొరిపర్తి నామేశ్వరరావు, కేశనం భావన్నారాయణ, జనసేన నాయకులు కొవ్వూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

రాణిగారితోట: రాణిగారితోట 17వ డివిజన్‌లో సోమవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పర్యటించారు. ఆయన రూ.41లక్షలతో చేపట్టిన డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డివిజన్‌లో సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. అనంతరం డివిజన్‌కు చెందిన రెండు కుటుంబాలకు జీవనోపాధి నిమిత్తం రెండు టిఫిన్ బండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాయిరంగమ్మ, ముని పోలిపల్లి, మొకర ఆదిబాబు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, పాల్గొన్న అధ్యాపకులు

## విద్యార్థుల హాజరు మెరుగుపర్చాలి

● సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు

ప్రభుత్వాసుపత్రి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మెడికల్ కాలేజీలో విద్యార్థుల హాజరు శాతం మెరుగుపర్చేలా అధ్యాపకులు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఏడుకొండలరావు సూచించారు. సోమవారం ఫ్యాకల్టీలతో ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు పెంపొందాలంటే అధ్యాపకులు హాజరు నియమాలను తుచ తప్పకుండా పాటించాలన్నారు. ప్రతిభ కల విద్యార్థులను గుర్తించి వారిని గోల్డ్ మెడల్స్‌తో సత్కరించే కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. అకడమిక్ కార్యకలాపాల్లో నాణ్యత పెంచే దిశగా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, పాల్గొన్నారు.

## మెడిటేషన్‌తో సంపూర్ణ ఆరోగ్యం

● పోక్సో కోర్టు న్యాయమూర్తి భవానమ్మ



మాట్లాడుతున్న పోక్సో కోర్టు న్యాయమూర్తి వి.భవానమ్మ

విజయవాడ లీగల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మెడిటేషన్‌తో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పోక్సో కోర్టు న్యాయమూర్తి వి.భవానమ్మ తెలిపారు. బెజవాడ బార్ అసోసియేషన్‌లో ఏకం సంస్థ వారు శ్రీ ప్రీతాజీ వారిచే వన్‌నెస్ ఎక్స్‌పీరియన్స్ అనే మెడిటేషన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన న్యాయమూర్తి భవానమ్మ మాట్లాడుతూ జడ్జిగా తాము కూడా నిత్యం ఒత్తిడికి గురౌతుంటామని మెడిటేషన్, యోగా వంటివి చేయడం ద్వారా ఆరోగ్యాన్ని పొంది మనశ్శాంతిగా ఉండేందుకు వీలవుతుందన్నారు. బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే భాషా మాట్లాడుతూ ఆధ్యాత్మిక గురువు శ్రీ ప్రీతాజీ మార్గంలో ఏకం సంస్థ బోధికురాలు శ్రీ ఆప్తీజీ బెజవాడ బార్ అసోసియేషన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం శుభపరిణామం అని తెలిపారు. సీనియర్ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా, బార్ కార్యవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పటమటలంక రుద్రభూమి అభివృద్ధికి రూ.లక్ష విరాళం



పటమటలంక రుద్రభూమి అభివృద్ధికి విరాళం అందిస్తున్న గుత్తికొండ వరలక్ష్మి

వన్‌టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి ): పటమటలంక రుద్రభూమి అభివృద్ధికి గుత్తికొండ వరలక్ష్మి తన తల్లి నల్లూరి భాగ్యమ్మ జ్ఞాపకార్థం లక్ష రూపాయలు విరాళం అందించారు. గురునానక్ నగర్‌లోని ఎంపీ శివనాథ్ కార్యాలయంలో రుద్రభూమి అభివృద్ధి కమిటీ సభ్యులకు సోమవారం ఆమె చెక్కు అందించారు. కమిటీ సభ్యులు మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, నల్లూరి వెంకట సుబ్బారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్, గుత్తికొండ మురళిలు పాల్గొన్నారు.

## లయోలలో నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాల పంపిణీలో పాల్గొన్న ప్రిన్సిపాల్ ఫాదర్ మెల్కియార్, అధ్యక్షుడు అనుదీప్ తదితరులు

భారతీనగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాలలో ఫాదర్ గార్డెన్ లైబ్రరీ హాల్‌లో మైత్రిక ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం నోటు పుస్తకాల పంపిణీ జరిగింది. ప్రిన్సిపాల్ ఫాదర్ మెల్కియార్ విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. మైత్రిక ఆర్గనైజేషన్ అధ్యక్షుడు అనుదీప్ మాట్లాడుతూ ఈ ఏడాది 1900 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ సెక్రటరీ డాక్టర్ జి.ఏ ప్రసాద్ రావు, సంస్థ సభ్యులు డాక్టర్ మువ్వ శ్రీనివాస్‌రెడ్డి, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాకు న్యాయం చేయండి

● వైద్య విద్యార్థుల నిరాహార దీక్ష



విజయవాడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో వైద్య విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పర్మినెంట్ సర్టిఫికేట్ ఇవ్వకుండా ఏడాదిన్నరగా ఏపీఎంసీ చుట్టూ తిప్పుకుంటున్నారని వైద్య విద్యార్థులు ఆరోపణలు చేశారు. తమ సమస్యను పరిష్కరించాలంటూ సోమవారం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ గేటు ముందు నిరాహార దీక్ష చేశారు. నిరాహార దీక్షకు ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు.

## ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

● అదనపు కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ చంద్రశేఖర్

కార్పొరేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం అందించాలని నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికను అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంలో నగర ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను అదనపు కమిషనర్ స్వీకరించి మాట్లాడుతూ పిర్యాదులపై వెంటనే స్పందించడంతో పాటు, వాటికి శాశ్వత పరిష్కారం చూపే విషయమై అధికారులకు సూచనలు ఇచ్చారు. ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికలో 13 పిర్యాదులు అందినట్లు తెలిపారు. చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్, సీఈ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి, పర్యవేక్షణ ఇంజనీర్లు పి. సత్యనారాయణ, పి. సత్యకుమారి, పాల్గొన్నారు.

## దివ్యాంగులకు టైలరింగ్‌లో శిక్షణ

లబ్బీపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మూగ, బధిర విద్యార్థులు, మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీలో శిక్షణ, ఉపాధి పొందేందుకు మూడు నెలల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ ఛైర్‌పర్సన్ అమృతకుమార్ తెలిపారు. బెంజిసర్కిల్‌లోని సమన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్‌లో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం సందర్శించి మాట్లాడుతూ శిక్షణ ఇచ్చి వారికి ఆర్థిక భరోసా కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. ఫిక్కీ ఫ్లో ఇనిషియేటింగ్ హెడ్ విజయలక్ష్మీ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఫ్లో ద్వారా సహకారాన్ని అందిస్తున్నామని, శిక్షణ పొందిన వారికి ప్లేస్‌మెంట్స్ కూడా చూపించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమనా కాలేజీ ఛైర్‌పర్సన్ సమనా, ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ సీనియర్ వైస్ ఛైర్మన్ సుప్రియ మల్లినేని, వైస్ ఛైర్మన్ రజని చిత్ర, కార్యదర్శి సుమబిందు అట్లూరి, దీప్తి చలసాని, కోశాధికారులు పాల్గొన్నారు.

## యూజీడీ సమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు ?




మాట్లాడుతున్న లంక దుర్గారావు

పటమట, జూన్ 30 (ఆంధ్ర జ్యోతి): పటమట ప్రాంత ప్రజలను ఏళ్ల తరబడి వెంటాడుతూ ఉన్న భూగర్భ మురుగునీటి సమస్య లకు పరిష్కారం ఎప్పుడని సీపీఐ నాయకులు ప్రశ్నించారు. 10, 11, 12 డివిజన్లకు సంబంధించి సీపీఐ శాఖ మహాసభ పటమట భాగయ్య వీధిలోని బిట్రా ప్రింటర్స్‌లో సోమవారం నిర్వహించారు. సీపీఐ నాయకులు లంక దుర్గారావు మాట్లాడుతూ బెంజిసర్కిల్ వద్ద నుంచి చెక్‌పోస్టు వరకు జాతీయ రహదారి విస్తరణ ఎందుకు ఆలస్యం అవుతుందో చెప్పాలన్నారు. ఈ సమావేశంలో పరుచూరి అజయ్, బిట్రా ధనరాజ్, సక్కుబాయ్, దోనేపూడి సూరిబాబు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డంపర్ బిన్ ఏర్పాటు చేయండి

పటమట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): దర్శిపేట మాబు సుభాని జెండాచెట్టు పక్కన డంపర్ బిన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. చుట్టుపక్కల నివాసాల వారు వ్యర్థాలను ఇక్కడ వేస్తుండటంతో ఈ ప్రాంతం అంతా దుర్గంధ భరితంగా ఉంటుంది. దీనికి తోడు కుక్కలు వ్యర్థాలను చిందర వందరగా రోడ్డు మీదకు లాగేస్తున్నాయి. శానిటరీ సిబ్బంది స్పందించి డస్ట్ బిన్ ఏర్పాటు చేయాలని, రోడ్డు మీద వ్యర్థాలు వేయకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిన జగన్

విద్యాధరపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ విద్యారంగాన్ని భ్రష్టు పట్టించాడని టీఎన్ఎస్ఎఫ్ జిల్లాప్రధాన కార్యదర్శి పి చరణసాయియాదవ్ విమర్శించారు. గురునానక్‌నగర్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఈసెట్ కౌన్సిలింగ్‌ను జాప్యం చేస్తోందంటూ జగన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పు పడుతున్నామన్నారు. 2022లో ఈసెట్ కౌన్సెలింగ్‌ను సెప్టెంబరులో ఎందుకు నిర్వహించాడో చెప్పాలన్నారు. మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థ గాడిన పడుతోందని, ఓర్వలేక జగన్ బురదజల్లే కార్యక్రమాన్ని చేపట్టాడన్నారు. జగన్‌కు తెలిసిందల్లా లాక్కోవడం, దోచుకోవడం, శవరాజకీయాలు చేయడమేనని విమర్శించారు. డి. గణేష్, బి. సూర్యకుమార్, కిషోర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఇళ్లను త్వరితగతిన నిర్మించండి

కమిషనర్ ధ్యానచంద్ర



మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పేదలకు అందించే ఇళ్లను త్వరితగతిన నిర్మించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని నూతన మీటింగ్ హాలులో కాంట్రాక్టర్లు, లబ్ధిదారులు, వీఎంసీ హౌసింగ్ అధికారులతో సోమవారం సాయంత్రం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంలో కమిషనర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లు అందరూ సహకరించాలని త్వరితగతిన ఇళ్లన్నీ పూర్తి చేయాలని సూచించారు. కాంట్రాక్టర్లు, అధికారుల మధ్య ఉన్న సమన్వయ లోపంలో నెలకొన్న సమస్యలను ముఖాముఖిగా చర్చించుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం తరపు నుంచి వారికి సంపూర్ణ సహాయం అందుతుందని, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. కేటాయించిన ఇళ్ల నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి, ఎస్ఈ (వర్క్స్) పి. సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) పి. వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

**● వ్యోమగామి జాహ్నవి**

రెడ్డిగూడెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ఒత్తిడిని అధిగమించి గమ్యానికి చేరుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని వ్యామగామిగా ఎంపికైన తొలి తెలుగు మహిళ ధంగెటి జాహ్నవి అన్నారు. రంగాపురం గురుకుల పాఠశాల (కేజీబీవీ) బాలికలతో సోమవారం ముఖాముఖి అయి పలు విషయాలపై అవగాహన కల్పించారు. తానూ సాధారణ కుటుంబంలో నుంచి వచ్చానని, చందమామపైకి వెళ్లాలనే సంకల్పంతో నాసా నిర్వహించే ప్రతి కార్యక్రమంలో పాల్గొనేదాన్నన్నారు. తొలుత ఆమెకు విద్యార్థినులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. అడిషినల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.మహేశ్వరరావు, డీసీడీవో విశ్వభారతి, ప్రిన్సిపాల్ ఎం శ్యామల, తబిత, ముప్పిడి నాగేశ్వర రెడ్డి, కుప్పిరెడ్డి అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే ఆర్యవైశ్యులకు అత్యున్నత స్థానం

**● ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్**

విద్యాధరపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఆర్యవైశ్యులకు అత్యున్నత స్థానం కల్పించిన నేత సీఎం చంద్రబాబు అని ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ అన్నారు. ఆదివారం తమిళనాడు రాష్ట్రం సేలంలో జరిగిన ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ వింగ్ ప్రారంభోత్సవంలో డూండీ రాకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఘనత ఎన్డీయే కూటమి ప్రభుత్వానిదన్నారు. అనంతరం రాకేష్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందచేశారు. అరవిందన్, వినోద్‌కుమార్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించండి

భారతీనగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జీఎల్ఎంగ్రేడ్-2 (ఎనర్జీ అసిస్టెంట్లు) సమస్యలపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను సోమవారం చిలకలూరి పేట తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినత పత్రం అందజేసినట్టు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ రాజు, జీ కనకలింగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ రాజు, జీ కనకలింగేశ్వరరావ, యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర నేతలు జీఎల్ఎం గ్రేడ్-2 కన్వీనర్ పెంచల ప్రసాద్, నాయబ్ రసూల్, రాజయ్య పాల్గొన్నారు.

# సీఆర్డీఏ కార్యాలయంలో డబ్ల్యూబీ, ఏడీబీ బృందాలు

**అమరావతి అభివృద్ధి పనులను వివరించిన సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు**

విజయవాడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ బృందాలు విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయాన్ని సందర్శించాయి. ఈ సందర్భంగా సీఆర్డీఏ కార్యాలయంలో సోమవారం బ్యాంకుల బృందాలతో కమిషనర్ కే కన్నబాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బృందంలోని సభ్యులకు అమరావతి నిర్మాణ పనులు, టెండర్ల ప్రక్రియలో పురోగతిని, ఇటీవల ఇచ్చిన లెటర్ ఆఫ్ అవార్డు గురించి వివరించారు. ప్రాజెక్టులు, శ్రామిక, మానవ వనరుల వినియోగం ఇతర విషయాలను బృందంలోని సభ్యులకు వెల్లడించారు. వరదల నియంత్రణకు చేపట్టిన జాగ్రత్తలు, పచ్చదనం పెంపొందించడానికి చేపడుతున్న చర్యలను వివరించారు. అర్బన్, రాజధాని ప్రాంతంలో అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే హౌసింగ్ ప్రాజెక్టులు, రాజధాని నిర్మాణ ప్రాజెక్టులో ప్రోగ్రామ్, మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీల భాగస్వామ్యం, ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. రాజధానిలో అమలు చేస్తున్న సామాజిక సంక్షేమ కార్యకలాపాలు, మహిళల ప్రాతినిధ్యం, యువత, మహిళలకు అందిస్తున్న నైపుణ్య శిక్షణ, పునరావాస కార్యకలాపాలు, రైతులు, రైతు కూలీల నుంచి నమోదైన అర్జీల పరిష్కారం గురించి బృందంలోని సభ్యులకు కూలంకుశంగా వివరించారు. అనంతరం బ్యాంకుల బృందాల సభ్యుల అడిగిన ప్రశ్నలకు కమిషనర్ సమాధానాలిచ్చారు. అడిషనల్ కమిషనర్లు జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్, మల్లారపు నవీన్, సీఆర్డీఏ, అమరావతి కార్పొరేషన్ లిమిటెడ్‌లోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కన్నబాబు

# మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

**● త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి**

లబ్బీపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి ప్రతి ఒక్కరూ ప్రాముఖ్యత ఇవ్వాలని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి అన్నారు. ఇండ్లాస్ హాస్పిటల్స్‌లో నూతనంగా ప్రారంభించిన ఎంఫిల్ క్లినికల్ సైకాలజీ, పీడీసీపీ కోర్సులకు సంబంధించి అభ్యర్థులకు అడ్మిషన్ పత్రాల పంపిణీ బందరు రోడ్డు లోని ఒక హోటల్‌లో సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే వికసిత్ భారత్ లక్ష్యం సిద్ధిస్తుందన్నారు. ప్రపంచ ఆరోగ్య కేంద్రంగా ఆరత్ అభివృద్ధి సాధిస్తోందన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు సైతం మెరుగైన వైద్యం కోసం మన దేశానికి తరలి వస్తున్నారన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ మనసిక వైద్యాన్ని ప్రజలకు చేరువచేసేందుకు ఇండ్లాస్ హాస్పిటల్స్‌లో నూతన కోర్సులను ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. అనతరం ఎం.ఫిల్ క్లినికల్ సైకాలజీ, ప్రొఫెషనల్ డిప్లమో ఇన్ క్లినికల్ సైకాలజీ కోర్సులకు సంబంధించిన బ్రోచర్‌ను గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి, మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆవిష్కరించారు. ఇండ్లాస్ హాస్పిటల్స్ క్లినికల్ సైకాలజీ విభాగం డైరెక్టర్లు డాక్టర్ ఇండ్లా రామసుబ్బారెడ్డి, డాక్టర్ విశాల్ మాట్లాడుతూ నూతన కోర్సులను డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ ఆధ్వర్యంలో ప్రారంభించామన్నారు. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పీ చంద్రశేఖర్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, డాక్టర్ వి.రాధికా రెడ్డి పాల్గొన్నారు.




బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు

# ప్రజా పరిపాలనకు ఏడాది పూర్తి

**● మూతబడిన అశోక్ లేల్యాండ్‌ను పునఃప్రారంభించాం**

**● 8 వేల మందికిపైగా ఉద్యోగావకాశాలు కల్పించాం: ఎమ్మెల్యే యార్లగడ్డ**



ఎన్టీఆర్ విగ్రహానికి యార్లగడ్డ నివాళులు

గన్నవరం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యం గెలిచి ప్రజా పరిపాలన ఆరంభమై ఏడాది నిండిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విధ్వంసం నుంచి వికాసం వైపు ప్రయాణం మొదలైందని, ప్రాధాన్యత క్రమంలో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. స్థానిక రోటరీ ఆడిటోరియంలో సోమవారం నియోజకవర్గ పరిశీలకులు వద్రాణం హరిబాబు నాయుడు అధ్యక్షతన 'సుపరిపాలనకు తొలి అడుగు' సభ జరిగింది. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధిని విస్మరించారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తరలిపోయిన పరిశ్రమలు వెనక్కి వస్తున్నాయన్నారు. 8 వేల మందికి పైగా యువతకు ఉద్యోగవకాశాలు కల్పించామన్నారు. ఉంగుటూరు, విజయవాడ రూరల్ మండలంలో పరిశ్రమలు ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించి, వాటి వివరాలతో సీఎం చంద్రబాబును కలసి చర్చించి ఈ రెండు మండలాల్లోను మినీ పారిశ్రామికవాడల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడ విస్తరణకు పక్కనే ఉన్న 470 ఎకరాల అసైన్డ్ భూముల సేకరకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా, వీరపనేనిగూడెంలో పరిశ్రమల ఏర్పాటుకు మరో 49ఎకరాల భూమి అందుబాటులోకి వచ్చిందన్నారు. టీడీపీ నేతలు గూడపాటి తులసీమోహన్, చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, ఆళ్ల గోపాలకృష్ణ, మూల్పూరి సాయికల్యాణి, మేడేపల్లి రమాదేవి, తుల్లిమిల్లి ఝాన్సీ, కొల్లా ఆనంద్ పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరించిన భాస్కరరావు, బ్యాంకుల ప్రతినిధులు

### నేటి నుంచి సంతృప్తస్థాయి
# బ్యాంకింగ్ సేవల క్యాంపెయిన్

వన్‌టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడికి బ్యాంకింగ్ సేవలను సంతృప్త స్థాయి (సాచ్యురేషన్)లో అందించేందుకు ప్రభుత్వ బ్యాంకులు జూలై 1 నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు 3 నెలల పాటు క్యాంపైన్‌ను నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర బ్యాంకర్ల కమిటీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ జీఎం సీవీఎస్ భాస్కరరావు అన్నారు. వన్‌టౌన్ ఆర్ఆర్ అప్పారావు వీధిలోని యూనియన్ బ్యాంక్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనియన్ బ్యాంక్, కెనరాబ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆప్కాబ్‌లు సంయుక్తంగా క్యాంపైన్‌ను నిర్వహిస్తాయన్నారు. మరోవైపు డిజిటల్ మోసాలపైనా అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లాస్థాయి లీడ్ బ్యాంక్ విధానం ద్వారా సమన్వయం చేసుకుని లీడ్ జిల్లా మేనేజర్ల పర్యవేక్షణతోపాటు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ నిత్యం క్యాంప్‌లను పరిశీలిస్తుందన్నారు. అనంతరం బ్రోచర్‌ను విడుదల చేశారు. కెనరా బ్యాంక్ జీఎం విజయలక్ష్మి, ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్ రెడ్డి, ఏపీ గ్రామీణబ్యాంక్ జీఎం జమీలాల్, ఎస్‌బీఐ ఏజీఎం వెంకట్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

## జెట్‌సిటీ పనులను త్వరగా పూర్తిచేయాలి: కలెక్టర్

కృష్ణలంక, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జక్కంపూడి, వేమవరం గ్రామాల్లో జెట్ సిటీ పనులను త్వరగా పూర్తిచేయాలని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మున్సిపల్, రెవెన్యూ, ఏపీఐఐసీ, ఏపీఈడీసీవో వారిని సమన్వయంతో పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. తన చాంబర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, ఆర్‌డీవో కావూరి చైతన్య, వీఎంసీ సిటీ ప్లానర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, ఏపీ ఎకనామిక్ సిటీ ప్రమోషన్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్, విజయవాడ రూరల్ తహసీల్దార్ పాల్గొన్నారు.

## జాతీయ పోటీల విజేతలకు ప్రోత్సాహకాలు

**● శాప్ చైర్మన్ రవినాయుడు**

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడాపోటీల విజేతలకు రాష్ట్రప్రభుత్వం సకాలంలో ప్రోత్సహకాలను విడుదల చేయడం వల్ల వారిలో మరింత ఉత్తేజాన్ని రేకెత్తించేందుకు దోహద పడుతుందని శాప్ చైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. ఉత్తరాఖండ్‌లో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 14 వరకు జరిగిన 30వ జాతీయ పోటీల్లో గెలుపొందిన రాష్ట్ర క్రీడాకారులకు ప్రభుత్వం పోత్సహకాలను విడుదల చేసినట్టు సోమవారం ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 మంది విజేతలకు రూ.91.75 లక్షలు ప్రభుత్వం విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## జాతీయ సాఫ్ట్ టెన్నిస్‌లో రాష్ట్రానికి స్వర్ణం



విజయవాడ, స్పోర్ట్స్ 30 (ఆంధ్రజ్యోతి): హర్యానాలోని పంచాకులలో ఈ నెల 26 నుంచి 30 వరకు జరిగిన 20వ జాతీయ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర క్రీడాకారులు స్వర్ణ పతకం కైవసం చేసుకున్నట్టు ఏపీ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డీ దిలీప్ కుమార్ తెలిపారు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ఎస్ఆరోన్ రోనల్ డిన్ హో (అనంతపురం), ఏ శ్రీ వైశాలి(కృష్ణాజిల్లా) స్వర్ణపతకం సాధించారన్నారు. 5 రోజులపాటు జరిగిన ఈ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర బాలుర, బాలికల జట్లు ప్రాతినిధ్యం వహించాయన్నారు. పతకం సాధించిన క్రీడాకారులను అసోసియేషన్ అధ్యక్షుడు వీ శ్రీనుబాబు, కోశాధికారి బీ నీరజ అభినందనలు తెలిపారు.

## ధాన్యం బకాయిలు చెల్లించాలి

**● సివిల్ సప్లయ్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా**

కానూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రబీ ధాన్యం బకాయిలు రైతులకు వెంటనే చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కానూరు బందరు రోడ్డులోని సివిల్ సప్లయ్ కార్పొరేషన్, పౌరసరఫరాల కమిషనర్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సివిల్ సప్లయ్ ఎండీ, పౌరసరఫరాల కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ జమలయ్య మాట్లాడుతూ వారం రోజుల్లో రైతులకు రావాల్సిన ధాన్యం బకాయిలు వారి ఖాతాల్లో జమవేస్తామని అధికారులు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ ఆందోళనలో రైతులతోపాటు నేతలు ఎం యల్లమందారావు, బుడ్డి రమేష్, పీ వెంకటేశ్వరరావు, వాసు, జీ కుటుంబరావు, నాగరాజు, భోగేశ్వరరావు, మురళి పాల్గొన్నారు.

# చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



## లుంగీ కట్టు.. మాస్ లుక్!

కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

## ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.



## పూజతో ప్రారంభం

తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

## సున్నితమైన హాస్యంతో...



హీరో రాణా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

## కథలో భిన్న కోణాలుంటాయి


**- శ్రీరామ్ వేణు**



"తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫిమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

## అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సీతార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.




నేషనల్ డాక్టర్స్ డే

# వైద్యులు... ప్రాణ దాతలు

**మృదుస్వభావులుగా, సున్నితంగా కనిపించే వైద్యులు కొన్ని సందర్భాల్లో యుద్ధ సైనికుల్లా మారిపోక తప్పదు. రోగి ప్రాణాలు కాపాడడం కోసం చురుగ్గా స్పందించి, యుద్ధప్రాతిపదికన సర్జరీలకు సిద్ధపడే పరిస్థితులను కూడా వైద్యులు ఎదుర్కొంటూ ఉంటారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా అలాంటి కొన్ని జీవితానుభవాలను వైద్యులు ఇలా పంచుకున్నారు.**

## ప్రసవం ఆమెకు ప్రాణాంతకం

ప్రసవం మహిళలకు పునర్జన్మ లాంటిదని ఊరికే అనలేదు. ప్రసవ సమయంలో, ప్రసవం తర్వాత మహిళల ప్రాణాలకే ముప్పు తెచ్చిపెట్టే పరిస్థితులు అకస్మాత్తుగా తలెత్తుతూ ఉంటాయి. సాధారణంగా గర్భిణిగా ఉన్నప్పుడే, సదరు మహిళది క్లిష్ట ప్రసవం కాబోతోందని ముందుగానే కనిపెట్టేస్తూ ఉంటాం. దాంతో అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రసవానికి అన్ని విధాలా సన్నద్ధమవుతూ ఉంటాం. కానీ అరుదుగా కొన్ని సందర్భాల్లో ప్రసవం తర్వాత సమస్యలు తలెత్తుతూ ఉంటాయి. అలాంటి సమస్యల్లో రక్తస్రావం ప్రధానమైనది.

ఒక సందర్భంలో సుఖ ప్రసవం జరిగిన ఒక మహిళకు ఆగకుండా రక్తస్రావం జరిగిపోవడం మొదలైంది. దాంతో ఉన్నపళాన ఆస్పత్రికి రమ్మని నాకు కబురొచ్చింది. అప్పటికే ఎంతో రక్తం ఎక్కించారు. అయినా ఆమె పరిస్థితి మెరుగుపడలేదు. ఆ సమయంలో అందరూ ఏం చేయాలో, రక్తస్రావాన్ని ఎలా ఆపాలో తెలియని అయోమయంలో పడిపోయారు. దాంతో ఆ క్షణమే నాకొక ఆలోచన తట్టింది. గర్భాశయం నుంచి రక్తస్రావం అవుతోంది. కాబట్టి గర్భాశయానికి రక్తాన్ని చేరవేసే రక్తనాళాన్ని మూసేయడం ద్వారా రక్తస్రావాన్ని ఆపవచ్చని నాకు అనిపించింది. నిజానికి ఆ చికిత్సను వైద్యులు ముందు నుంచే అనుసరిస్తూ ఉండి ఉండవచ్చు. కానీ నాకు అది కొత్త. ఆ పనిని ఎండోస్కోపీ ద్వారా చేయవచ్చని నాకు అనిపించింది. నిజానికి ప్రసవం జరిగిన వెంటనే ల్యాప్రోస్కోపీ చేయరు. కాబట్టి పొట్ట కోసి రక్తస్రావాన్ని ఆపే సర్జరీని ఎంచుకోవాలి. కానీ అంత పెద్ద సర్జరీకి బదులుగా ల్యాప్రోస్కోపీతోనే ఆ పనిని పూర్తి చేయవచ్చన్నది నా ఆలోచన, అలా మొదటిసారిగా ఒక ప్రయోగాత్మకమైన చికిత్సకు పూనుకున్నాను. అంతకంటే ముందు ఆ చికిత్స ఫలితం, పరిణామాల గురించి ఆమె కుటుంబ సభ్యులకు వివరించాను. ఎండోస్కోపీ మధ్యలో అవసరమైతే, ఓపెన్ సర్జరీ కూడా చేయవలసి రావచ్చు. సర్జరీ సఫలం కావచ్చు. లేదంటే విఫలమై గర్భసంచిని కూడా తొలగించవలసి రావచ్చు. ఆ విషయం కుటుంబ సభ్యులతో చర్చించి ఆ ప్రయోగాత్మకమైన సర్జరీకి పూనుకున్నాను. విజయవంతంగా రక్తనాళాన్ని కనిపెట్టి, దాన్ని మూసేయడం ద్వారా రక్తస్రావాన్ని ఆపగలిగాను. దాంతో ఆ క్షణమే రోగి రక్తపోటు సాధారణ స్థితికి చేరుకుంది. మరుసటి రోజే చురుగ్గా నడవడం మొదలుపెట్టింది. ఇలాంటి సందర్భాల్లో రక్తస్రావాన్ని ఆపి, మహిళతో పాటు ఆమె గర్భాశయాన్ని కూడా కాపాడగలిగినప్పుడు ఎంతో సంతోషం కలుగుతూ ఉంటుంది.




**డాక్టర్ రాధిక రెడ్డి**
సీనియర్ కన్సల్టెంట్ అబ్‌స్ట్రెటీషియన్ అండ్ గైనకాలజిస్ట్, ల్యాప్రోస్కోపీ సర్జన్,
బర్త్‌రైట్ బై రెయిన్‌బో హాస్పిటల్స్, హైదరాబాద్



## 82 ఏళ్ల మహిళకు గుండె సర్జరీ

వృద్ధుల్లో గుండె జబ్బుల చికిత్సలు క్లిష్టతరం. సర్జరీకి వాళ్ల శరీరాలు సహకరించవు. కాబట్టి సాధ్యమైనంత మేరకు ఇన్వేసివ్ చికిత్సలనే ఎంచుకుంటూ ఉంటాం! కానీ కొన్ని సందర్భాల్లో అది కూడా సాధ్యపడకపోవచ్చు. కొంత కాలం క్రితం అలాంటి ఒక క్లిష్టమైన పరిస్థితి ఎదురైంది. ఆమెకు 82 ఏళ్లు. కళ్లు తిరిగి పడిపోతున్న ఆమెను స్థానిక వైద్యులకు చూపిస్తే, వాళ్లు గుండె జబ్బుగా నిర్ధారించారు. పెద్ద వయస్కుల్లో గుండె దగ్గర బృహద్ధమని సన్నబడిపోతూ ఉంటుంది. దాంతో మెదడుకు సరిపడా రక్తం అందక కళ్లు తిరిగి పడిపోతూ ఉందామె. అయితే ఆమెది పెద్ద వయసు కాబట్టి క్యాథెటర్ ద్వారా రక్తనాళం గుండా బృహద్ధమనికి చేరుకుని దాన్ని మార్చే పద్ధతిని అనుసరిస్తూ ఉంటారు. అయితే ఈ ప్రక్రియకు ముందు రక్తనాళాల్లో అడ్డంకులను కనిపెట్టడం కోసం కరొనరీ యాంజియోగ్రామ్ కూడా చేయవలసి ఉంటుంది. ఈ పరీక్షలో ఆమె మూడు రక్తనాళాల్లో అడ్డంకులు ఉన్నట్టు తెలిసింది. అయితే ఆవిడది పెద్ద వయసు కాబట్టి క్యాథెటర్ ద్వారా కవాటాన్ని మార్చడానికి వైద్యులు వెనకాడారు. అలాగని ఓపెన్ హార్ట్ సర్జరీ చేసే ధైర్యం కూడా చేయలేకపోయారు. అలా ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో నా దగ్గరకు వచ్చిన ఆ వృద్ధురాలికి అత్యవసరంగా 3 బైపాస్‌లతో పాటు ఓపెన్ హార్ట్ సర్జరీ ద్వారా విజయవంతంగా కవాటాన్ని కూడా మార్చగలిగాను. సర్జరీ జరిగిన ఐదో రోజునే డిశ్చార్జ్ అయిపోయిందామె. ఏడాది తర్వాత వచ్చి నన్ను కలిసి, పనులన్నీ స్వయంగా చేసుకోగలుగుతున్నట్టు చెప్పినప్పుడు నాకెంతో సంతృప్తి కలిగింది.

ఇప్పటివరకూ దాదాపు 20 వేల గుండె సర్జరీలు చేశాను. కాబట్టి నేను తీసుకున్న శిక్షణ, సుదీర్ఘ అనుభవాలు ఈ సర్జరీకి అక్కరకొచ్చాయని అనుకోవచ్చు. పి.వి నరసింహారావు, ఎన్‌టి రామారావు, జైల్ సింగ్ లాంటి ప్రముఖులకు గుండె సర్జరీలు చేసిన అమెరికాలోని టెక్సాస్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లోనే నేను కూడా శిక్షణ పొందాను. అక్కడ 90, 100 ఏళ్ల రోగులకు కూడా గుండె సర్జరీలు చేసిన సందర్భాలున్నాయి. అలాగే మన దేశంలో గుండె సర్జరీలకు సంబంధించి కొన్ని ప్రొటోకాల్స్ ఉంటాయి. వాటిని నేనే రూపొందించాను. రక్తం పలచబడే మందులను జీవితాంతం వాడుకోవలసిన అవసరం లేని కృత్రిమ గుండె కవాటాన్ని కూడా రూపొందించాను. ప్రస్తుతం అది ప్రయోగ దశలో ఉంది. ఇలా గుండె సమస్యలు, చికిత్సల పట్ల నాకున్న లోతైన పరిజ్ఞానంతో క్లిష్టమైన సర్జరీలను సవాలుగా తీసుకుని, విజయవంతంగా పూర్తి చేయగలుగుతున్నాను.


**డాక్టర్ లోకేశ్వర రావు సజ్జ**
సీనియర్ కన్సల్టెంట్ కార్డియోథొరాసిక్ సర్జన్,
స్టార్ హాస్పిటల్స్, హైదరాబాద్.

## మరణం అంచు నుంచి వెనక్కి



రోగులకే కాదు కొన్ని సందర్భాల్లో వైద్యుల చేతిలో కూడా సమయం ఉండదు. మరీ ముఖ్యంగా అత్యవసరంగా రోగి ప్రాణాలు కాపాడవలసిన సందర్భాల్లో వైద్యులు చురుగ్గా ఆలోచించి, చకచకా నిర్ణయాలు తీసుకోవలసి వస్తూ ఉంటుంది. అలాంటి ఒక సందర్భం కొవిడ్‌కు ముందు ఎదురైంది. ఒక రోజు ఉదయాన్నే 32 ఏళ్ల మహిళను వాళ్ల కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికే కామెర్లతో కాలేయం పూర్తిగా దెబ్బతిని, కోమాలోకి వెళ్లిపోయిందామె. వాళ్లు మార్వాడీలు. వ్యాపారస్తులు. పెద్దగా చదువు లేదు కాబట్టి ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వాళ్లకెలాంటి అవగాహనా లేదు. దాంతో పరిస్థితి తీవ్రతను అంచనా వేయలేకపోయారు. ఆమెను పరీక్షించిన వెంటనే అత్యవసరంగా కాలేయ మార్పిడి చేయకపోతే, ప్రాణాలు దక్కవనే విషయాన్ని నేను అర్థం చేసుకున్నాను. అందుకు ఎక్కువ సమయం లేదు. 24 గంటల్లో కాలేయ మార్పిడి జరిగిపోవాలి. ఓ పక్క పరిస్థితిని తీవ్రతను కుటుంబ సభ్యులకు వివరించడంతో పాటు, మరోపక్క సర్జరీకి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలి. అంతా యుద్ధప్రాతికపదికన జరిగిపోవాలి. ఆ సమయంలో ప్రతి క్షణం విలువైనదే! మొదట కుటుంబ సభ్యులకు అర్థమయ్యేలా చెప్పి, కాలేయ మార్పిడికి ఒప్పించిన తర్వాత, రోగి తమ్ముడి నుంచి కాలేయాన్ని సేకరించాలని నిర్ణయించుకున్నాం. ఆ తర్వాత అతనికి పరీక్షలన్నీ చేసి కాలేయాన్ని దానం చేయడానికి అన్ని విధాలా అర్హుడని నిర్థారించుకున్నాం. తర్వాత అనుమతులన్నీ తీసుకుని, సర్జరీకి సిద్ధపడ్డాం. అలా రోగి ఆస్పత్రికి చేరుకున్న 24 గంటల్లోపే తెల్లవారుఝామున 3 గంటలకు సర్జరీ మొదలుపెట్టాం. రెండు ఆపరేషన్ టేబుళ్ల మీద అక్కా, తమ్ముళ్లకు ఏకకాలంలో సర్జరీ చేసి, తమ్ముడి నుంచి సేకరించిన 60% కాలేయాన్ని అక్కకు అమర్చాం. సర్జరీ నూరు శాతం విజయవంతమైంది. ఆరు వారాలకు ఇద్దరి కాలేయాలూ పూర్తి పరిమాణం మేరకు పెరుగుతాయి కాబట్టి అప్పటికి వాళ్లిద్దరూ పూర్తిగా కోలుకున్నారు.

తర్వాత కొంత కాలానికి ఆమె గర్భం దాల్చిందని తెలిసింది. ఇప్పటికీ అప్పుడప్పుడూ ఆమె ఆస్పత్రికి వచ్చి నన్ను కలుస్తూ ఉంటుంది. మరణం అంచుల వరకూ వెళ్లి, కాలేయ మార్పిడితో ప్రాణాలు దక్కించుకుని, పూర్తి ఆరోగ్యంతో కొత్త జీవితాన్ని గడుపుతున్న ఆమెను చూసిన ప్రతిసారీ నాకెంతో సంతృప్తి కలుగుతూ ఉంటుంది.

ప్రతి సర్జరీలో ముప్పులు ఉన్నట్టే, కాలేయ మార్పిడి సర్జరీలో కూడా కొన్ని ముప్పులుంటాయి. సర్జరీ కచ్చితంగా విజయవంతమవుతుందని చెప్పలేం! విఫలమయ్యే అవకాశాలు 30% ఉంటాయి. కాబట్టి కుటుంబానికి కౌన్సిలింగ్ ఇవ్వడం ఇక్కడెంతో కీలకంగా మారుతూ ఉంటుంది. సర్జరీ సమయంలో తలెత్తే సమస్యలు, సర్జరీ తదనంతర పరిణామాలను కుటుంబానికి వివరించడం ఒక ఎత్తైతే, సర్జరీ విఫలమై రోగి ప్రాణాలు కోల్పోయే అవకాశం కూడా ఉంటుందని వాళ్లకు అర్థమయ్యేలా చెప్పడం మరొక ఎత్తు. అలా కౌన్సెలింగ్ ముగించుకుని, మిగతా లాంఛనాలన్నీ పూర్తి చేసుకుని, తెల్లవారుఝామున 3 గంటలకు, తమ్ముడికీ, అక్కకూ ఏకకాలంలో సర్జరీలు మొదలుపెట్టాం. అవి ఉదయం పది గంటల వరకూ కొనసాగాయి. నిజానికి ఇలాంటి సందర్భాల్లో వైద్యులమైన మాలో కూడా ఎంతో కొంత ఆందోళన ఉంటూ ఉంటుంది. అలాగే సర్జరీ ఎలాగైనా సక్సెస్ కావాలనే బలమైన కోరిక కూడా ఉంటుంది. కాబట్టే సర్జరీ పూర్తి చేసి ఇంటికెళ్లిపోయినా, మా ఆలోచలన్నీ ఆస్పత్రి చుట్టూరా, రోగి ఆరోగ్యం చుట్టూరా తిరుగుతూ ఉంటాయి. ఇక్కడ ఇంకొక విషయం కూడా చెప్పాలి. వైద్యులు భావోద్వేగపరంగా రోగులతో, పరిస్థితులతో కొంత డిటాచ్డ్‌గా ఉండక తప్పదు. ఒకవేళ సర్జరీ విఫలమై, రోగి ప్రాణాలు కోల్పోవడం లాంటిది జరిగితే, బాధపడుతూ, నిరాశలో కూరుకుపోతే మేం మా వృత్తికి న్యాయం చేయలేం! కాబట్టి సాధ్యమైనంత మెరుగైన చికిత్సను అందించడం, సత్ఫలితాన్ని సాధించడం కోసం శాయశక్తులా కృషి చేయడమే లక్ష్యంగా పని చేస్తాం! ఇలా సర్జరీ నుంచి పూర్తిగా కోలుకుని నిండు ఆరోగ్యంతో కొత్త జీవితాన్ని గడుపుతున్న వాళ్లను చూసినప్పుడు ఎంతో ఆనందాన్ని పొందుతూ ఉంటాం!


**డాక్టర్ నవీన్ పోలవరపు**
సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, లివర్ స్పెషలిస్ట్,
యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ, హైదరాబాద్

---

పరిశోధన

## ఫంగస్‌తో క్యాన్సర్ చికిత్స

ఈజిప్టు ఫరో, టుటన్‌ఖమూన్ సమాధిలో బయల్పడి, ఫరో శాపంగా పేరు పొందిన 'యాస్పర్జిల్లస్ ఫ్లేవస్' అనే ఒక ఫంగస్, నేడు క్యాన్సర్ ఫైటర్‌గా మారింది. రక్త క్యాన్సర్‌లో కణ విభజనను ప్రభావవంతంగా అడ్డుకుంటున్న ఈ ఫంగస్, భవిష్యత్తు క్యాన్సర్ చికిత్సలకు ఆశాజ్యోతిగా మారబోతోందంటున్నారు పరిశోధకులు.



1922లో ఈజిప్టు ఫరో, టుటన్‌ఖమూన్ సమాధిని తెరిచినప్పుడు, అంతుపట్టని వ్యాధులు, ఆకస్మిక మరణాలు చోటుచేసుకున్నాయి. దాంతో భయంతో వణికిపోయిన ప్రపంచమంతా దాన్నొక ఫరో శాపంగా పరిగణించడం మొదలుపెట్టింది. కానీ ఆధునిక సైన్స్, ఆ శాపం వెనకున్న రహస్యమైన, ఆసక్తికరమైన ఒక వివరణను బహిర్గతం చేసింది. సీల్ చేసిన ఫరో సమాధిల్లో నెలకొని ఉన్నది మంత్రశక్తి కాదనీ, అదొక ప్రమాదకరమైన ఫంగస్ అనే విషయాన్ని సైన్స్ కనిపెట్టింది. అయితే టుటన్‌ఖమూన్ సమాధి లాంటి తేమతో కూడిన చీకటి ప్రదేశాల్లో వృద్ధి చెందే యాస్పర్జిల్లస్ ఫ్లేవస్ ఫంగస్, క్యాన్సర్ కణాలను లక్ష్యంగా చేసుకోగలిగే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉన్నట్టు పెన్సిల్వేనియా యూనివర్శిటీ పరిశోధకులు కనిపెట్టారు. యాస్పర్జిల్లస్ ఫ్లేవస్ ఫంగస్‌కు చెందిన అణువులను వేరు చేసి, మార్పులకు గురి చేసి, రక్త క్యాన్సర్ కణాల మీద వాటి ప్రభావాన్ని అధ్యయనం చేసి, అద్భుతమైన ఫలితాలను సాధించగలిగారు.

ఈ ఫంగస్‌కు చెందిన వేర్వేరు రూపాలను అన్వేషించినప్పుడు వాటిలోని కొన్ని ఫంగస్‌లకు ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉన్నట్టు కూడా పరిశోధకులు కనిపెట్టారు. ఈ ఫలితాలను పరిశీలించిన పరిశోధకులు...'ఫంగస్ నుంచే పెన్సిలిన్‌ను కనిపెట్టాం.

ఆ విధంగానే ప్రకృతి నుంచి మనం కనిపెట్టవలసిన ఔషధాలు మరెన్నో ఉన్నట్టు తాజా ఫలితాలు నిరూపిస్తున్నాయి. కణ విచ్ఛిత్తి కారకాలను అడ్డుకునే కాంపౌండ్లు ఈ ఫంగస్‌లో ఉన్నాయి కాబట్టి, పర్యావరణ హితమైన క్యాన్సర్ చికిత్సలు భవిష్యత్తులో అందుబాటులోకి రాబోతున్నాయి" అంటూ వెల్లడించారు.

---

యాంగ్జయిటీ డిజార్డర్

# ఆందోళన అవసరమా?

**ఆందోళన ప్రయోజనకరమైన లక్షణమే! పూర్తి సమర్థతతో పని చేయడానికీ, ఫలప్రదమైన ఫలితాన్ని సాధించడానికీ ఆందోళన ఎంతో కొంత దోహదపడుతుంది. అయితే ఇదే ఆందోళన దైనందిన జీవితాన్ని దెబ్బ తీస్తున్నా, ఆరోగ్యాన్ని కుదేలు చేస్తున్నా పరిస్థితిని తీవ్రంగానే పరిగణించాలంటున్నారు వైద్యులు.**

ఆందోళన అందరికీ ఉంటుంది. ఉండాలి కూడా! పరీక్షలకు ముందు ఆందోళన అన్నదే లేకపోతే, పూర్తిగా సిద్ధపడం. అయితే కొంతమందిలో ఆందోళన సాధారణ స్థాయి కంటే విపరీతంగా పెరిగిపోయి, లేని భయాలను ఊహించుకుంటూ ఉంటారు. ఈ పరిస్థితే 'యాంగ్జయిటీ డిజార్డర్'! దీన్లో రకాలున్నాయి. అవేంటంటే...

**ప్యానిక్ డిజార్డర్:** ఈ సమస్య ఉన్న వాళ్లు ఇంటర్వ్యూకు ముందు, ఏదైనా కొత్త పనికి పూనుకోబోయే ముందు విపరీతమైన ఆందోళనకు లోనవుతూ ఉంటారు. ఆ సమయంలో గుండె వేగం పెరిగిపోతుంది. నోరు పొడిబారిపోతుంది. శ్వాస కష్టమైపోతుంది. ఛాతీ పట్టేస్తుంది. చమటలు పట్టేస్తాయి. గొంతు నొక్కుకుపోతున్నట్టు కూడా అనిపిస్తుంది.

**ఫోబియా:** కొందరికి విమానం ఎక్కడమంటే భయం. ఇలాంటివాళ్లకు విమానం ఎక్కే ముందు విపరీతమైన ఆందోళన మొదలైపోతుంది. ఇంకొందరిక పరీక్షలంటే ఫోబియా ఉండొచ్చు. వీళ్లు పరీక్ష హాలుకు వెళ్లే ముందు ఆందోళనతో సతమతమైపోతూ ఉంటారు.

**ఒసిడి:** చేసిన పనే పదే పదే చేసే అలవాటున్న అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్‌ను కూడా ఆందోళన సమస్యగానే పరిగణించాలి. కొందరు ఇల్లు పదే పదే శుభ్రం చేస్తూ ఉంటారు, కడిగినదాన్నే పదే పదే కడుగుతూ ఉంటారు. ఇవి కూడా ఆందోళన లక్షణాలే!

### ఆందోళన కారణాలు?

**సెరటోనిన్:** మెదడులో ఉత్పత్తయ్యే సెరటోనిన్ హార్మోన్ మోతాదు తగ్గడం మూలంగా ఆందోళన పెరగవచ్చు. ఈ పరిస్థితి వంశపారంపర్యం. తల్లితండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించవచ్చు

**విటమిన్ల లోపం:** విటమిన్ డి, బి12 తగ్గిన వారిలో ఆందోళన పెరుగుతుంది

**థైరాయిడ్:** ఆందోళన అంతిమంగా కుంగుబాటుకు దారి తీస్తుంది. ఈ పరిస్థితి థైరాయిడ్ సమస్యలున్న వారిలో స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది

**పెంపకం:** కొందరు తల్లితండ్రులు పిల్లల పట్ల అతి జాగ్రత్తను కనబరుస్తూ ఉంటారు. 'అక్కడకు వెళ్లకు, ఆ పని చేయకు'.. అంటూ పెద్దలు భయపడుతూ, పిల్లలను భయపెడుతూ ఉంటారు. ఇలాంటి పెంపకంలో పెరిగిన పిల్లలు కూడా పెద్దయ్యాక, యాంగ్జయిటీ డిజార్డర్‌కు లోనవుతూ ఉంటారు

### ఎక్కువగా ఆందోళన పడుతున్నామా?

చాలా మంది తమలో ఆందోళన ఎక్కువ స్థాయిలో ఉన్నట్టు తెలుసుకోలేరు. దీర్ఘకాలంలో ఆ లక్షణం అంతర్గతంగా ఆరోగ్యాన్ని కూడా కుదేలు చేస్తుంది. ఆందోళన వల్ల హైపర్‌టెన్షన్ పెరిగి, గుండె జబ్బుకు దారితీయవచ్చు. అలాగే జీర్ణసంబంధ సమస్యలు వేధించవచ్చు. కాబట్టి ఎవరికి వారు తమలో ఆందోళన ఉందో, లేదో కనిపెట్టడం కోసం ఈ లక్షణాలను గమనించుకోవాలి.

**నిద్ర:** నిద్ర పట్టకపోవడం, పట్టినా అర్ధరాత్రి రెండు, మూడు గంటలకు మేల్కోవడం జరుగుతూ ఉంటుంది. ఉదయం నిద్ర లేచిన వెంటనే గాభరాగా ఉండడం. ఈ పరిస్థితి రెండు వారాలకు మించి కొనసాగితే యాంగ్జయిటీ డిజార్డర్‌గానే పరిగణించాలి

**నిలకడ లోపం:** రోజంతా రెస్ట్‌లెస్, కంగారుగా గడుపుతూ ఉండడం. ఎక్కడా కుదురుగా కూర్చోలేక, నడుస్తూ ఉండడం. చేయి లేదా కాలును అదే పనిగా ఊపుతూ ఉండడం, చమటలు పట్టడం, పేరు పెట్టి పిలిచినప్పుడు ఉలిక్కిపడడం లాంటివన్నీ యాంగ్జయిటీ డిజార్డర్ లక్షణాలే!

### పరిష్కారాలున్నాయి

కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీతో ఆందోళనను తగ్గించుకోవచ్చు. నిద్రాహారాలకూ ఆందోళనకూ దగ్గరి సంబంధం ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయులు తగ్గినా ఆందోళన పెరగవచ్చని అధ్యయనాల్లో వెల్లడైంది. కాబట్టి ఆహార, నిద్ర వేళలు కూడా కచ్చితంగా అనుసరించాలి. అలాగే ఆందోళనకు గురవుతూ సతమతమైపోయే బదులు ఆందోళన మూలాల్లోకి వెళ్లే ప్రయత్నం చేయాలి. ఎందుకు ఆందోళనకు లోనవుతున్నాం? అంత ఆందోళన పడవలసిన అవసరం నిజంగానే ఉందా? అని మనల్ని మనమే ప్రశ్నించుకోవాలి. అలాగే ఆందోళన కారణం గురించి సన్నిహితులతో, సహోద్యోగులతో పంచుకోవాలి. సమస్యకు పరిష్కారాన్ని పొందే మార్గాలను అనుసరించాలి. ఆందోళన తగ్గించుకోవడం కోసం యోగా, ధ్యానం సాధన చేయవచ్చు. వ్యాయామంతో కూడా ఆందోళన అదుపులోకొస్తుంది. ఎంత ప్రయత్నించినా ఆందోళన అదుపులోకి రాకపోతూ తప్పనిసరిగా వైద్యులను కలవాలి.



### పని ప్రదేశంలో ఆందోళన

సాధారణంగా ప్రతి ఉద్యోగికీ, పనికి సంబంధించి ఒక డెడ్ లైన్ ఉంటుంది. అలాగే సాటి ఉద్యోగుల నుంచి విమర్శలు, కామెంట్లు ఉంటూనే ఉంటాయి. ప్రమోషన్ కోసం పోటీ లాంటివి కూడా ఉంటాయి. ఇవన్నీ అన్ని పని ప్రదేశాల్లో ఉండేవే! అయితే పని ప్రదేశంలో ఆందోళనను తగ్గించుకోవడం కోసం కొన్ని చిట్కాలు పాటించాలి.

- ఆందోళన వెనకున్న భయాల గురించి తోటి ఉద్యోగులతో చర్చించాలి
- సహోద్యోగుల సహాయసహకారాలను స్వాగతించాలి
- పని ఒత్తిడిని తగ్గించుకోవడం కోసం పనులను విభజించుకుని, ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసుకోవచ్చు
- పనులను ప్రాధాన్యతాక్రమంలో విభజించుకుని, వరుసగా పూర్తి చేయవచ్చు
- పనుల జాబితాను రూపొందించుకుని, ముఖ్యమైన పనులకు తొలి ప్రాధాన్యం ఇస్తూ ఉండాలి
- వాస్తవిక డెడ్ లైన్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి. సామర్థ్యానికి మించి శ్రమించడం ఎంత మేరకు అవసరమనే విషయం గురించి ఆలోచించాలి. సామర్థ్యానికి తగిన డెడ్ లైన్స్‌ను ఏర్పాటు చేసుకుని, వాటిని అందుకోవడం కోసం శ్రమించాలి
- పెద్ద ప్రాజెక్టులను చిన్నవిగా విభజించుకుని, పూర్తి చేసుకోవాలి
- అప్పటికే పనులు ఎక్కువగా ఉన్నప్పుడు అదనపు పనులను స్వీకరించడం మానేయాలి


**డాక్టర్ జ్యోతిర్మయి**
సీనియర్ కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్,
మనహ క్లినిక్, హైదరాబాద్


రిటైనింగ్ వాల్ పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

## బుడమేరు రిటైనింగ్ వాల్ పూర్తి

- పనులను పరిశీలించిన మంత్రి నిమ్మల
- వైసీపీ హయాంలో గేట్లకు గ్రీజు కూడా పెట్టలేదని రామానాయుడు విమర్శ

ఇబ్రహీంపట్నం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం మొదలయ్యేలోపు యుద్ధ ప్రాతిపదికన బుడమేరు రిటైనింగ్(సీసీ) వాల్ నిర్మాణ పనులు పూర్తి చేశామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సోమవారం ఆయన బుడమేరు డైవర్షన్ కెనాల్‌పై పూర్తి కావచ్చిన రిటైనింగ్ వాల్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏప్రిల్‌లో సీసీ వాల్ నిర్మాణానికి అనుమతి రావడంతో మే నెలలో టెండర్లు పిలిచి పనులు చేపట్టేందుకు వీలుగా ఆదేశాలు ఇచ్చామన్నారు. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఎడమ కట్టపై సుమారు 3.9 కిలో మీటర్ల వద్ద సైఫన్ ఉన్న చోట గత ఏడాది సెప్టెంబరులో వరదలకు మూడు గండ్లు పడి విజయవాడను ముంచెత్తిందన్నారు. వరద సమయంలో ఏపీ సీఎం చంద్రబాబు గండ్లను పరిశీలించారని, మంత్రి లోకేశ్ సైతం ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. రూ.23 కోట్ల వ్యయంతో మూడు గండ్లు పడిన చోట 365 మీటర్ల సీసీ వాల్‌ను నిర్మించినట్లు చెప్పారు. బుడమేరు వరద ముంపునకు శాశ్వత పరిష్కారం కావాలంటే సుమారు 7 నుంచి 8 వేల కోట్లు అవసరం అవుతుందన్నారు. కొంతమేర వరద ముంపు తగ్గించే క్రమంలో లెఫ్ట్ బండ్‌ను ఒక మీటర్ ఎత్తు పెంచి గ్రావెల్ రహదారిగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీసం వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ గేట్లకు గ్రీజ్ సైతం పెట్టకపోవడంతో వరద సమయంలో గేట్లు సకాలంలో తెరుచుకోలేదన్నారు. రైతుల సహకారం, జేసీబీల సాయంతో గేట్లను తెరవాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. మరోసారి అలాంటి పరిస్థితులు రాకుండా మొత్తం 12 గేట్లను రూ.1.80 కోట్లతో నూతనంగా అమర్చి అభివృద్ధి చేసినట్టు చెప్పారు. ఎనికేపాడు నుంచి కొల్లేరుకు వెళ్లే బుడమేరు డ్రెయిన్ 57 కిలో మీటర్ల మేర పూడిక తీత పనులు చేస్తున్నట్టు తెలిపారు. కొల్లేరుకు వచ్చే వరద నీరు ఉప్పుటేరు మీదుగా సముద్రంలోకి పోయే విధంగా రూ.9 కోట్లు నిధులిచ్చి టెండర్లు పిలిచి డ్రెజ్జింగ్ చేస్తున్నట్లు చెప్పారు.

## డీసీఎంఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిల గడువు పెంపు

అమరావతి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 13 జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)ల అధికారేతర పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. ఈమేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జూన్ 27 నుంచి ఈ పెంపు అమల్లోకి వచ్చిందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# రూ.150కే పెయ్య దూడ



- నేటి నుంచి రైతులకు అందుబాటులో వీర్యం
- రాష్ట్ర వ్యాప్తంగా ఏడాదికి 10 లక్షల డోసులు
- ముర్రా గేదెలు, సంకర జాతి ఆవుల హబ్‌గా ఆంధ్రప్రదేశ్

గుంటూరు సిటీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గేదెలకు పెయ్యదూడలు మాత్రమే పుట్టేందుకు వీలుగా రూపొందించిన లింగ నిర్ధారిత వీర్యం రూ.150కే అందజేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ మర్రిపూడి శ్రీనివాసరావు వెల్లడించారు. ఆయన సోమవారం గుంటూరులోని తన కార్యాలయంలో మాట్లాడారు. 'లింగ నిర్ధారిత వీర్యం విలువ బహిరంగ మార్కెట్‌లో ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం అందుబాటులోకి తెస్తున్న వీర్యం ఒక్కో డోసు రూ.300 వరకు ఉండగా, రైతులకు రూ.150 సబ్సిడీతో ప్రభుత్వం సరఫరా చేస్తుంది. మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవటం వల్ల అతి తక్కువ ధరకే రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశం దక్కింది. గతంలో ఇదే లింగ నిర్ధారిత వీర్యం కోసం రైతులు రూ.550 చెల్లించాల్సి వచ్చేది. పశు యజమానులపై భారం తగ్గించేందుకు నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డుతో సంప్రదింపులు జరిపి తక్కువ ధరకు రైతులకు పంపిణీ చేసేలా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల డోసులు(ఒక్కో గేదెకు రెండు డోసులు) లింగ నిర్ధారిత వీర్యం గేదెలకు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ వీర్యం వేయటం వల్ల గర్భం దాల్చే ఐదు లక్షల గేదెల్లో కనీసం 90 శాతం పెయ్యదూడలు పుట్టే అవకాశం ఉంటుంది. ఈ కార్యక్రమం చేపట్టటం వలన నేరుగా 20 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. 2030 నాటికి పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 30 లక్షల డోసుల లింగ నిర్ధారిత వీర్యం గేదెలకు వేయటం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను ముర్రా గేదెలు, సంకర జాతి ఆవుల హబ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని చేరుకోగలుగుతాం. దానివల్ల రానున్న ఐదు సంవత్సరాల్లో పశువుల్లో స్త్రీ సంపద పెరిగి పాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది. లింగ నిర్ధారిత వీర్యం అతి తక్కువ ధరకే అందజేసే కార్యక్రమాన్ని మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నాం. పునరుత్పత్తి అవకాశం ఎక్కువగా ఉన్న గేదెలను ఎంపిక చేసి వీర్యం డోసులు ఇస్తాం. ఈ అవకాశం వినియోగించుకోవాలి' అని కోరారు.

## సిగాచి పరిశ్రమలో పేలుడు..
# 19 మంది దుర్మరణం


పరిశ్రమలో ఎగిసిపడుతున్న మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

**ఎయిర్‌వాక్స్ పేలడంతో ఎగిసిన అగ్నికీలలు.. 2 కిలోమీటర్ల మేర కంపించిన భూమి**

- 30 మంది కార్మికులకు తీవ్ర గాయాలు
- మరో 15 మంది కార్మికుల గల్లంతు
- తెలంగాణ పాశమైలారం పారిశ్రామిక వాడలో కుప్పకూలిన పరిశ్రమ గెస్ట్ హౌస్
- అందులో ఉన్న జనరల్ మేనేజర్ మృతి

సంగారెడ్డి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సిగాచి రసాయన పరిశ్రమలో భారీ పేలుడు సంభవించి, 19 మంది దుర్మరణం పాలయ్యారు. అగ్నికీలలు, పేలుడు ధాటికి పక్కనే ఉన్న భవనం కూలిపోవడం, పార్క్ చేసిన వాహనాలకు నిప్పంటుకోవడంతో.. మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో 16 మంది పరిస్థితి విషమంగా ఉంది. ఇంకో 15 మంది కార్మికులు గల్లంతైనట్లు సమాచారం. రాత్రి కడపటి వార్తలందేసరికి కూడా పరిశ్రమలో శిథిలాల వెలికితీత కొనసాగుతోంది. ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో 163 మంది ఉన్నట్లు తెలుస్తోంది. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయినట్లు అధికారులు చెబుతున్నారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే ప్రమాదాలున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాథమిక దర్యాప్తులో ఎయిర్‌వాక్స్ పేలినట్లు పేర్కొన్నారు. సాయంత్రానికి అది డయ్యర్ పేలుడు అయ్యి ఉండొచ్చని, రియాక్టర్ కాకపోవచ్చని వెల్లడించారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.


గాయపడిన కార్మికుడిని ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

### ఏం జరిగింది?

పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. హైదరాబాద్ శివార్లలోని పాశమైలారంలో సిగాచి పరిశ్రమలో.. ఉదయం షిఫ్ట్‌లో 6 గంటలకు పలువురు కార్మికులు విధులకు హాజరయ్యారు. జనరల్ షిఫ్ట్‌లో భాగంగా ఉదయం 9 గంటల నుంచి కార్మికులు, సూపర్‌వైజర్లు, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది, అధికారులు లోనికి వచ్చారు. సరిగ్గా 9.10 గంటల సమయంలో భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు తీవ్రతతో 2 కిమీ వరకు భూమి కంపించింది. భారీ శబ్దం వినబడింది. పరిసర పరిశ్రమల్లోని కార్మికులు భూకంపం వచ్చిందంటూ బయటకు పరుగులు పెట్టారు. రోడ్డుపైన, పరిశ్రమల్లో పార్క్ చేసిన పలు వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. పేలుడు జరిగిన సమయంలో పరిశ్రమలో 163 మంది ఉన్నారని సమాచారం. ప్రమాదంలో హాజరు రికార్డు కూడా బుగ్గిపాలైందని తెలిసింది. పేలుడు సంభవించగానే.. అగ్నికీలలు వేగంగా వ్యాప్తిచెందాయి. పరిశ్రమలోని పార్కింగ్‌లో ఉన్న వాహనాలకు సైతం నిప్పంటుకుంది. ఆ వెంటనే పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగ అలుముకుంది. దీంతో అక్కడున్నవారికి ఏం జరిగింది? ఏం జరుగుతోంది? అనేది అర్థం కాలేదు. లోపల బాధితుల హాహాకారాలతో పరిసర ప్రాంతాలు దద్దరిల్లుతున్నా.. లోనికి వెళ్లలేనంతగా పొగ వ్యాప్తి చెందింది. స్థానిక పోలీసులతోపాటు.. రిజర్వ్ బలగాలు, 11 ఫైరింజన్లు, అగ్నిమాపక సిబ్బంది, హైడ్రా, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి. మృతుల సంఖ్య 19కు చేరినట్లు అర్ధరాత్రి ప్రకటించారు. పేలుడు ధాటికి మూడంతస్తుల గెస్ట్‌హౌస్ భవనం కూలిపోవడంతో.. అందులో ఉన్న జనరల్ మేనేజర్ ఎలాన్‌గోవన్ దుర్మరణంపాలయ్యారు. రాత్రి కడపటి వార్తలందేసరికి.. శిథిలాల తొలగింపు కొనసాగుతోంది. ప్రమాదానికి ఎయిర్‌వాక్స్ పేలుడే కారణమని చెబుతున్న అధికారులు.. డయ్యర్ పేలి ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రమాద తీవ్రతకు కార్మికుల మృతదేహాలు కాలిన ముద్దలుగా మారాయి. పలు మృతదేహాల విషయంలో కనీస ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. ఒంటిపైన దుస్తులు పూర్తిగా కాలిపోయి.. చేతులు, కాళ్లు, తల, పొట్టభాగం ఉడికించినట్లుగా మారిపోయాయి. డీఎన్‌ఏ పరీక్షతోనే మృతులను గుర్తించాల్సి ఉంటుందని పోలీసులు వివరించారు.

# సజ్జలకు చెప్పి మెడికల్ సీటు ఇప్పిస్తా..

(మొదటి పేజీ తరువాయి)

వొడిగట్టునట్టు ఆ ఫిర్యాదులో బాధితుడు మన్నే సుబ్బారావు ఆరోపించారు. "డబ్బులు తిరిగి ఇవ్వాలని ప్రేమ్‌చంద్‌ను అడిగా. ఆ మొత్తం సజ్జల రామకృష్ణారెడ్డికి ఇచ్చానని, ఆయన ఇవ్వగానే ఇస్తానని చెబుతున్నాడు. అప్పటివరకు ఆగలేకుంటే చేతనైంది చేసుకోండి...తిరిగి మా ప్రభుత్వం రాగానే నీ అంతు చూస్తాన"ంటూ బెదిరిస్తున్నాడని ఆ ఫిర్యాదులో వాపోయారు. బాధితుడి కథనం ప్రకారం, తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామానికి చెందిన మన్నే సుబ్బారావు కుమారుడు రూప్ సాయికి కౌన్సెలింగ్ ద్వారా చండీగఢ్ లో మెడికల్ పీజీ సీటు వచ్చింది. అయితే అక్కడ పీజీ చేసిన తర్వాత మరో రెండేళ్లు అక్కడే పని చేసేవిధంగా బాండ్‌పై సంతకాలు చేయాలని ఆ కాలేజీ యాజమాన్యం షరతు పెట్టింది. దీంతో ఆ సీటు వదులుకున్నారు. మళ్లీ ఎంట్రెన్స్ రాయగా విజయవాడ పిన్నమనేని కళాశాలలో సీటు వచ్చింది. అయితే, చండీగఢ్‌లో సీటు వచ్చినా చేరని కారణంగా తమ కాలేజీలో చేర్చుకోలేమని కౌన్సిలింగ్ సందర్భంగా మేనేజ్‌మెంట్ తెలిపింది. ఈ క్రమంలో సుబ్బారావు తనకు తెలిసిన వారి ద్వారా సజ్జలకు అత్యంత సన్నిహితుడైన తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట పరిధిలోని వాడపాలెం గ్రామానికి చెందిన అడపా ప్రేమ్‌చంద్‌ను కలిశారు. రెండు కోట్లు ఇస్తే సజ్జల ద్వారా చెప్పించి విజయవాడ పిన్నమనేని కళాశాలలో సీటు ఇప్పిస్తానని సుబ్బారావును ఆయన నమ్మించారు. వైసీపీ కేంద్ర కార్యాలయానికి సుబ్బారావును తీసుకువెళ్లి సజ్జల చాంబర్ వద్ద 45 లక్షల రూపాయలు ప్రేమ్‌చంద్ తీసుకుని లోపలకు వెళ్లారు. ఆ మొత్తం సజ్జలకు ఇచ్చినట్లు బయటకు వచ్చి సుబ్బారావుకు తెలిపారు. ఆ తరువాత రావులపాలేనికి చెందిన సెవెన్ స్టార్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత విజయలక్ష్మి భర్త గుత్తుల అవినాశ్, భీమవరానికి చెందిన కట్టివాటి బాల రెడ్డి ఖాతాల ద్వారా మరో రూ. 75 లక్షలు ప్రేమ్‌చంద్ తీసుకున్నారు. మీ సీటు విషయాన్ని సజ్జల, సీఎంవో ధనుంజయ రెడ్డి చూస్తున్నారని సుబ్బారావుకు ప్రేమ్‌చంద్ చెప్పారు. సజ్జల, ధనంజయరెడ్డితో ఫోన్ చేయించి విజయవాడ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రర్ రాధిక రెడ్డి ద్వారా పిన్నమనేని కాలేజీ మేనేజ్‌మెంట్‌కు చెప్పించానని... అయితే సీటుకు నాలుగు కోట్లు అడుగుతున్నారని సుబ్బారావుకు ఆయన తెలిపారు. తాను అంత డబ్బులు ఇచ్చుకోలేని.. తన డబ్బు తనకు తిరిగి ఇవ్వాలని సుబ్బారావు అడిగారు. అయితే బెంగళూరులో మంత్రి పెద్దిరెడ్డికి, సజ్జలకు రామయ్య మెడికల్ కళాశాల, రాజరాజేశ్వరి మెడికల్ కళాశాలల్లో వాటా ఉందని ప్రేమ్‌చంద్ తెలిపారు. బెంగళూరు తీసుకువెళ్లి రామయ్య మెడికల్ కళాశాలలో పీజీ సీటు ఇప్పిస్తానని సుబ్బారావుకు చెప్పారు. అంతే కాకుండా అక్కడి రెవిన్యూ శాఖ మంత్రి పేరుతో ఫోర్జరీ లెటర్ తీసుకున్నారు. రామయ్య మెడికల్ కళాశాలలో ఎంఎస్ జనరల్ సర్జన్‌గా సుబ్బారావు కుమారుడికి సీటు కేటాయించినట్లు తప్పుడు పత్రాలు సృష్టించి సుబ్బారావుకు ప్రేమ్‌చంద్ ఇచ్చారు. ఆ లెటర్ తీసుకొని రామయ్య మెడికల్ కళాశాలకు వెళ్లి విచారించగా... అదంతా ఫేక్ అని తేలింది." అని తన ఫిర్యాదులో సుబ్బారావు తెలిపారు. తమ డబ్బు తమకు తిరిగి ఇవ్వాలని అడగ్గా రెండు దఫాలుగా ఐదు లక్షలు చొప్పున మొత్తం 10 లక్షలు ప్రేమ్‌చంద్ ఇచ్చారని, మిగిలిన మొత్తానికి ఐదు చెక్కులు ఇచ్చారని, అందులో మూడు చెక్కులు బ్యాంకులో జమ చేయగా బౌన్స్ అయ్యాయన్నారు. ప్రేమ్‌చంద్‌ను సంప్రదిస్తే తనకు ఉన్న స్థలాలు విక్రయించి డబ్బులు ఇస్తానంటూ ఆ స్థలాలను తన పేరుతో అగ్రిమెంట్ కూడా రాశారని సుబ్బారావు తెలిపారు. అయితే, అక్కడ స్థలాలు లేవని ఆ తర్వాత తెలుసుకున్నానని చెప్పారు. డబ్బు కోసం గట్టిగా పట్టుబట్టగా, ఆ డబ్బులు సజ్జల రామకృష్ణారెడ్డికి ఇచ్చానని, ఆయన ఇవ్వగానే తిరిగి ఇస్తానని చెబుతున్నారనీ, ఇంకా మాట్లాడితే నీ దిక్కు ఉన్న దగ్గర చెప్పుకో అంటూ బెదిరిస్తున్నారని తన ఫిర్యాదులో తెలిపారు. ప్రేమ్‌చంద్‌తోపాటు గుత్తుల అవినాశ్, భీమవరానికి చెందిన కట్టివాటి బాల రెడ్డి తదితరులపైనా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### గుడ్లు, బియ్యం మింగేశాడు..

వైసీపీ హయాంలో సజ్జల రామకృష్ణారెడ్డి ద్వారా పౌర సరఫరాల శాఖలో గుడ్లు, బియ్యం, ఇతర సరుకుల సప్లయి కాంట్రాక్టును ప్రేమ్‌చంద్ సంపాదించారు. సరుకుల సరఫరాలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడినట్టు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. విశాఖ ఇసుక తోట దగ్గర ఐదు కోట్ల ఖాళీ స్థలాన్ని కబ్జా చేసిన వ్యవహారంలోనూ ఆయన పేరు ప్రముఖంగా వినిపించింది. రాజమండ్రిలో డీజే కన్‌స్ట్రక్షన్స్ లో రెండు కోట్లు విలువ చేసే ఫ్లాట్‌ను ప్రేమ్‌చంద్ ఆక్రమించుకున్నట్టు చెబుతున్నారు. పోలీసులు విచారణ జరిపితే ప్రేమ్ చంద్ అక్రమాలు వెలుగులోకి వస్తాయని ఆయన బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

## మోహిత్‌రెడ్డికి ఏసీబీ కోర్టు ఝలక్

- ముందస్తు బెయిల్ పిటిషన్ డిస్మిస్

విజయవాడ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు షాక్ ఇచ్చింది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను న్యాయాధికారి పి.భాస్కరరావు డిస్మిస్ చేశారు. మద్యం కేసులో మోహిత్‌రెడ్డి ఏ39గా ఉన్నాడు. తండ్రి భాస్కర్‌రెడ్డిని సిట్ అరెస్టు చేశాక ఆయన అజ్ఞాతంలోకి వెళ్లాడు. సిట్ పోలీసులు అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ ఆయన కోర్టును ఆశ్రయించారు. తర్వాత మధ్యంతర బెయిల్ ఇవ్వాలంటూ మరో పిటిషన్ వేశారు. వాటిలో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగియడంతో న్యాయాధికారి భాస్కరరావు సోమవారం తీర్పును వెలువరించారు.

## దర్యాప్తునకు సహకరించండి

- వారానికి ఒకసారి పోలీసు స్టేషన్ అధికారి ముందు హాజరు అవ్వండి
- అమరావతిపై నీచ వ్యాఖ్యల కేసులో జర్నలిస్ట్ కృష్ణంరాజుకు షరతులు
- బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు

అమరావతి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతి మహిళలపై నీచ వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో జర్నలిస్ట్ కృష్ణంరాజుకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే.. పలు షరతులు విధించింది. రూ.10 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని, దర్యాప్తునకు సహకరించాలని, వారంలో ఓ రోజు దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. 'సాక్షి' చానల్ డిబేట్‌లో అమరావతిని వేశ్యల రాజధానిగా పేర్కొంటూ కృష్ణంరాజు నీచ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రాజధాని ప్రాంతానికి చెందిన దళిత జేఏసీ నాయకురాలు కంభంపాటి శిరీష తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నీచ వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజును ఏ1గా, యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావును ఏ2గా, సాక్షి చానెల్ యాజమాన్యాన్ని ఏ3గా పేర్కొంటూ.. పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ2 కొమ్మినేనికి కొన్నాళ్ల కిందటే షరతులతో కూడిన బెయిల్ మంజూరు అయింది. తాజాగా తనకు కూడా బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ జర్నలిస్ట్ కృష్ణంరాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది డీఎస్ఎన్వీ ప్రసాద్‌బాబు వాదనలు వినిపించారు. పిటిషనర్‌పై నమోదైన సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనన్నారు. అయినప్పటికీ మేజిస్ట్రేట్ జ్యుడీషియల్ కస్టడీ విధించారని తెలిపారు. అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పోలీసులు అనుసరించలేదన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను కోర్టు ముందు ఉంచాలని గత విచారణ సందర్భంగా తమను ఆదేశించారని, పెన్‌డ్రైవ్‌లో సదరు వ్యాఖ్యల వీడియోలను కోర్టు ముందు ఉంచామని తెలిపారు. సాక్షి మీడియా నుంచి పిటిషనర్‌కు చెల్లింపులు జరిగాయని, కేసు దర్యాప్తులో భాగంగా ఆయన బ్యాంక్ ఖాతాలు పరిశీలించగా ఈ విషయం వెల్లడైందన్నారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. జర్నలిస్టు కృష్ణంరాజుకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు.

# ఐపీఎస్‌ల క్వాష్ పిటిషన్లపై 18లోగా కౌంటర్

*జెత్వానీ కేసులో రాష్ట్రప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం.. విచారణ 21కి వాయిదా*

అమరావతి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ముంబై మోడల్/సినీ నటి కాదంబరి జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా తాతా, విశాల్ గున్నీ, అప్పటి ఏసీపీ కె.హనుమంతరావు, దర్యాప్తు అధికారి కె.సత్యనారాయణ వేసిన క్వాష్ పిటిషన్లపై జూలై 18కల్లా కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను జూలై 21కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేత కుక్కల విద్యాసాగర్ ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు ఆధారంగా పోలీసులు తనను వేధించారని జెత్వానీ కంప్లయింట్ ఇవ్వడంతో పై పోలీసు అధికారులపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కేసు దర్యాప్తును సీఐడీకి బదిలీ చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ పీఎస్ఆర్, కాంతిరాణా, గున్నీ, హనుమంతరావు, సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల విచారణ జరిపిన న్యాయమూర్తి.. కేసు ఆధారంగా తదుపరి చర్యలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలు సోమవారం విచారణకు రాగా.. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. ఈ కేసు కారణంగా పిటిషనర్లు సస్పెన్షన్‌లో ఉన్నారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తామన్నారు. కేసు ఆధారంగా పిటిషనర్లపై తదుపరి చర్యలన్నింటినీ నిలుపుదల చేస్తూ ఇప్పటికే ఉత్తర్వులు ఉన్నాయని గుర్తుచేశారు. వ్యాజ్యాలపై అత్యవసరంగా విచారణ జరపాల్సిన అవసరం లేదన్నారు. జెత్వానీ తరఫు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు వాదనలు వినిపిస్తూ.. పీఎస్ఆర్ దాఖలు చేసిన పిటిషన్‌లో ఫిర్యాదుదారు జెత్వానీకి నోటీసులు అందలేదని తెలిపారు. అన్ని పక్షాల వాదనలనూ పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. జెత్వానీకి నోటీసు అందించాలని పీఎస్ఆర్ తరఫు న్యాయవాదిని ఆదేశించారు. జూలై 18లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రాసిక్యూషన్‌కు స్పష్టం చేస్తూ విచారణను జూలై 21కి వాయిదా వేశారు.

## 5 వేల మినీ అంగన్వాడీల అప్‌గ్రేడ్

- త్వరలో వాటిలో ఆయా పోస్టుల భర్తీ: మంత్రి సంధ్యారాణి

అమరావతి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 7 వేల మినీ అంగన్వాడీ కేంద్రాలకుగాను, 5 వేల మినీ అంగన్వాడీ కేంద్రాలకు మెయిన్ అంగన్వాడీ హోదా కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు విడుదలవుతాయని తెలిపారు. మినీ అంగన్వాడీల్లో ఇప్పటి వరకు ఒక్క కార్యకర్తలు మాత్రమే పనిచేసే వారని, ఆయాలు ఉండేవారు కాదని తెలిపారు. మినీకి మెయిన్ అంగన్వాడీ హోదా కల్పించిన తర్వాత, ఆ 5వేల మందికి పూర్తిస్థాయి అంగన్వాడీ టీచర్ హోదా ఇస్తూ చట్టబద్ధమైన వేతనాలు, విధులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈ కేంద్రాల్లో అంగన్వాడీ 5 వేల మంది ఆయాల నియామకానికి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

## డైట్ చార్జీల పెంపునకు కృషి: మంత్రి సవిత

గుంటూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులకు ఇచ్చే డైట్ చార్జీల పెంపునకు కృషి చేస్తానని మంత్రి సవిత తెలిపారు. మంత్రి పదవి చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమెను రాష్ట్ర బీసీ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘ ప్రతినిధులు క్యాంప్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. మంత్రి సవిత మాట్లాడుతూ డైట్ చార్జీల పెంపు విషయమై ఇప్పటికే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు. సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల హాస్టళ్లకు సంబంధించి డైట్ చార్జీల పైనా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీసీ వసతి గృహసంక్షేమాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్, గౌరవ అధ్యక్షుడు దయానంద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## అడ్మిషన్ల ఆలస్యంతో కాలేజీలపై ప్రభావం

అమరావతి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): డిగ్రీ అడ్మిషన్లలో విధానపరమైన నిర్ణయాల జాప్యంతో బోధనపై ప్రతికూల ప్రభావం పడుతుందని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లెక్చరర్ల జేఏసీ ఆందోళన వ్యక్తం చేసింది. డిగ్రీ కరిక్యులమ్ ఫ్రేమ్ వర్క్‌పై నిర్ణయం తీసుకోవడంలో ఏర్పడిన జాప్యం ప్రభుత్వ డిగ్రీ కాలేజీల అడ్మిషన్లపై పడుతుందని అభిప్రాయపడింది. దీనిపై జేఏసీ ప్రతినిధులు ఎం.రాఘవరెడ్డి, పి.గోపాలనాయుడు, ఎం.శ్యాంబాబు, ఎం.శ్రీనివాసరెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

## ఎమ్మెల్యే కావాలనుకుంటే కాంగ్రె‌స్‌లో చేరండి: షర్మిల

అమరావతి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): 'కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల మీద గౌరవం ఉన్నవాళ్లు, నాయకత్వం మీద నమ్మకం ఉన్నవాళ్లు, భవిష్యత్తులో ఎమ్మెల్యే కావాలనుకుంటున్నవాళ్లు ముందుకు రావాలి' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం పిలుపునిచ్చారు.'పార్టీ కార్యకర్తలను కలుపుకుని వెళ్లే వాళ్లు, వైఎస్ఆర్ ఆశయాలను నిలబెట్టే వాళ్లను కాంగ్రెస్ పార్టీ మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తోంది. చేరికలకు నేను పూచీ. ఈ నాలుగేళ్లలో ప్రజా నాయకులుగా ఎదిగే అవకాశం ఉంది. చివరి నిమిషంలో వచ్చి టికెట్ తీసుకోవడం సరికాదు. కాంగ్రెస్ పార్టీకి అభివృద్ధి ఒక్కటే అజెండా. రండి.. జాయిన్ విత్ మీ..' అంటూ షర్మిల పిలుపునిచ్చారు.

## స్మార్ట్ మీటర్లు, చార్జీల పెంపుపై ఉద్యమం

అమరావతి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్తు చార్జీల పెంపు, అదానీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని 26 జిల్లాల్లో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని వామపక్ష పార్టీలు ప్రకటించాయి. వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను కలుపుకుని త్వరలోనే కార్యాచరణ రూపొందించాలని సోమవారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో నిర్ణయించాయి. సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకుడు పి. ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ తదితరులు హాజరయ్యారు. నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు ప్రాంతంలో షిర్డిసాయి అనుబంధ ఇండోసోల్ కంపెనీకి భూములను అతి తక్కువ ధరలకే అప్పగించేందుకు చేస్తున్న భూ సమీకరణను వ్యతిరేకిస్తూ అక్కడి రైతులు చేస్తున్న ఆందోళనకు వామపక్షాలు మద్దతు ప్రకటించాయి. కరేడులో పర్యటించి స్థానిక రైతులతో మాట్లాడి ప్రత్యక్ష ఆందోళనకు సమాయత్తం కావాలని నిర్ణయించారు. ఈ నెల 9న అఖిల భారత కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు వామపక్షాలు సంఘీభావం ప్రకటించాయి.

## ధాన్యం బకాయిల కోసం రైతుల ధర్నా

- వారంలో చెల్లిస్తామంటూ అధికారుల హామీ



ధాన్యం బకాయిలు చెల్లించాలంటూ ఆందోళన చేస్తున్న రైతులు

అమరావతి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రైతులకు ధాన్యం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలోని పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం సివిల్ సప్లయిస్ కమిషనర్ సౌరభ్ గౌర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ మనజీర్ జిలానీ సమూన్‌లను కలసి వినతిపత్రాలు అందజేశారు. వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారని రైతు సంఘాల ప్రతినిధులు తెలిపారు.

## నిబంధనల ప్రకారం నడుచుకోండి

- పెద్దారెడ్డి ఇంటి కూల్చివేతపై హైకోర్టు ఆదేశం

అమరావతి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి విషయంలో చట్టనిబంధనల ప్రకారం నడుచుకోవాలని పురపాలకశాఖ అధికారులను హైకోర్టు ఆదేశించింది. నివాసాల కూల్చివేత విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ న్యాపతి విజయ్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. తాడిపత్రిలోని సర్వే నెంబర్లు 639, 640, 641లోని 577.55 చదరపు గజాలలో ఉన్న తమ ఇంటి కూల్చివేతకు పురపాలకశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారంటూ పెద్దారెడ్డి సతీమణి రమాదేవి హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. లంచ్‌మోషన్‌గా ఈ వ్యాజ్యాన్ని విచారణకు న్యాయమూర్తి స్వీకరించారు.

### మాపై కేసు కొట్టేయండి.. హైకోర్టులో కాసు, అన్నాబత్తుని

వైసీపీ అధినేత జగన్ రెంటపాళ్ల పర్యటన సందర్భంగా అధికారుల ఆదేశాలను ఉల్లంఘించి రోడ్లపై రాకపోకలను స్తంభింపజేశారంటూ వీఆర్వో బూసిరాజు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి, అన్నాబత్తుని శివకుమార్, వైసీపీ అధికార ప్రతినిధి యనమల నాగార్జున హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు ఆధారంగా తదుపరి చర్యలను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యం మంగళవారం హైకోర్టు ముందు విచారణకు రానుంది.

## అవుకు పీఎస్పీ అనుమతులు రద్దు

అమరావతి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అవుకులో 800 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్కేంద్రం (పీఎస్పీ) నిర్మాణానికి 'ఆరో' ఇన్‌ఫ్రా సంస్థకు ఇచ్చిన అనుమతులను రాష్ట్ర ఇంధన శాఖ రద్దు చేసింది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారు చేయడంలో తీవ్రజాప్యం నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణానికి ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలంటూ ప్రభుత్వానికి రాష్ట్ర సంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్ఆర్ఈడీక్యాప్) సిఫారసు చేసింది. జాప్యానికి కారణాలు వివరించాలంటూ 'ఆరో' సంస్థకు నోటీసులు పంపినా ఫలితం లేకపోయింది. ఇంకోవైపు.. ప్రాజెక్టు నిర్మాణంలో అధిక ఆలస్యం జరుగుతుండడంతో అనుమతులు రద్దు చేస్తూ ఇంధనశాఖ తరఫున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వు జారీ చేశారు. కాగా, కడప జిల్లా కమలాపురం మండలం కొప్పోలులో చింతా గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 360 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్కేంద్రాన్ని స్థాపించేందుకు ప్రభుత్వం ఆమోదించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులిస్తూ ఇంధన శాఖ ఉత్తర్వు జారీ చేసింది. అలాగే కడప జిల్లా గండికోట వద్ద అదానీ సంస్థ చేపట్టదలచిన 1,000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్కేంద్రం సామర్థ్యాన్ని 1,800 మెగావాట్లకు పెంచేందుకూ సమ్మతిస్తూ ఆదేశాలిచ్చింది.



క్వాంటమ్ వ్యాలీ వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన స్టాల్‌లో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తదితరులు

అమరావతి క్వాంటమ్ వ్యాలీ.. దక్షిణాసియాలోనే మొదటిది: లోకేశ్

ఇక్కడ 50కి పైగా యూనికార్న్‌ల అభివృద్ధి

ఐబీఎం క్వాంటమ్ సిస్టమ్-2 త్వరలోనే అందుబాటులోకి

చంద్రబాబు సాంకేతిక విప్లవంలో ఇది సెకండ్ చాప్టర్

క్వాంటమ్ వర్క్‌షాపులో లోకేశ్ వెల్లడి

# ఐదేళ్లలో లక్ష ఉద్యోగాలు

అమరావతి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ఏర్పాటుచేసే క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ దక్షిణాసియాలోనే మొదటిదని ఐటీ, విద్య, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఇందులో ఐదేళ్లలో లక్ష మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. 50కి పైగా యూనికార్న్‌లు అభివృద్ధి చేస్తామన్నారు. ఈ వ్యాలీ చంద్రబాబు సాంకేతిక విప్లవంలో సెకండ్ చాప్టర్‌గా పేర్కొన్నారు. సోమవారం విజయవాడలో క్వాంటమ్ వ్యాలీ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. వచ్చే జనవరి 1న ప్రారంభించే ఈ క్వాంటమ్ వ్యాలీకి అనుబంధంగా.. ఆలోచనలను ఆవిష్కరణలుగా.. ఆవిష్కరణలను పరిశ్రమలుగా మార్చే ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఇది ఒకరోజు కార్యక్రమం కాదని.. నిరంతర కొనసాగుతుందని.. దీనికి అమరావతి కేంద్ర బిందువుగా ఉంటుందని అన్నారు. క్యూబిక్ ఆర్కిటెక్చర్ నుంచి క్రయోఎలక్ట్రానిక్స్ వరకూ.. అల్గారిథం అభివృద్ధి నుంచి క్వాంటమ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన ఐబీఎం క్వాంటమ్ సిస్టమ్-2 త్వరలోనే అమరావతిలో అందుబాటులోకి వస్తుందని, ఇది చాలా గర్వించదగ్గ విషయమని చెప్పారు. ఆసియాలో మొట్టమొదటి క్వాంటమ్ ప్రమాణాల టెస్ట్‌బెట్‌ను ఎన్సీఎల్, ఐఈఈఈ, ఏడబ్ల్యూఎస్, సీయూక్ భాగస్వామ్యంతో నిర్వహిస్తామని వెల్లడించారు. ఐబీఎం, టీసీఎల్, హెచ్‌సీఎల్, టెక్ మహీంద్ర వంటి అగ్రగామి సంస్థల సహకారంతో క్వాంటమ్ స్టార్టప్ ఎకోసిస్టమ్ అభివృద్ధి చేస్తామన్నారు. ప్రధాని మోదీ ప్రకటించిన జాతీయ క్వాంటమ్ మిషన్‌కు అనుసంధానంగా గ్లోబల్ భాగస్వామ్యంతో వ్యాలీ పార్కును నిర్మిస్తామన్నారు. ఐఐటీలు, ఐఐఎస్, టోక్యో వర్సిటీల సహకారంతో విద్యార్థుల్లో క్వాంటమ్ కంప్యూటింగ్ సాంకేతిక నైపుణ్యాన్ని వృద్ధి చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ మేధో రాజధానిగా ఆవిర్భవిస్తోందని లోకేశ్ అన్నారు. సీఎం చంద్రబాబులాంటి నాయకుడు ఉండడం అదృష్టంగా పేర్కొన్నారు. విజన్ అంటే ఇప్పుడు వెలాసిటీ, ఇన్నోవేషన్, గ్లోబల్ రేస్‌లో చేరడం కాదని.. మనమే దారిచూపాలని అన్నారు.

## 2029కల్లా మూడో క్వాంటమ్ కంప్యూటర్

### సాంకేతికతలో రాష్ట్రానికి సంపూర్ణ సహకారం

'ఆంధ్రజ్యోతి'తో ఐబీఎం ఇండియా ఎండీ సందీప్ పటేల్ అమరావతి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మూడో క్వాంటమ్ కంప్యూటర్‌ను 2029 నాటికి అందుబాటులోకి తెస్తామని ఐబీఎం ఇండియా ఎండీ సందీప్ పటేల్ చెప్పారు. ఇప్పటికే క్వాంటమ్ కంప్యూటింగ్‌ను బ్యాంకులు, పేటీఎం వంటి ఆర్థిక సంస్థలు వినియోగిస్తున్నాయని 'ఆంధ్రజ్యోతి'తో చెప్పా రు. సాంకేతికతలో రాష్ట్రానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌తో సంప్రదాయ సాఫ్ట్‌వేర్ రంగం తీవ్రంగా నష్టపోతుందన్న ఆందోళన ఉందన్న ప్రశ్నకు.. కొత్త సాంకేతిక నైపుణ్యం వస్తున్నప్పుడు ఇలాంటి ఆందోళనలు తప్పవని బదులిచ్చారు. ప్రస్తుతం రెండో క్వాంటమ్ కంప్యూటర్‌ను ఐబీఎం రూపొందించిందని.. 2029 నాటికి అత్యంత వేగవంతమైన మూడో క్వాంటమ్ కంప్యూటర్‌ను సిద్ధం చేస్తామన్నారు.

## గ్లోబల్ గేట్‌వేగా 'అమరావతి' వ్యాలీ

» డిక్లరేషన్‌కు వర్క్‌షాపు ఆమోదం

అమరావతి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ప్రారంభమయ్యే క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ 2035 నాటికి ప్రపంచ లైట్ హౌస్‌గా మారుతుందని జాతీయ వర్క్‌షాపు పేర్కొంది. క్వాంటమ్ టెక్నాలజీని అత్యాధునిక కంప్యూటేషన్‌కు బదలాయిస్తూ.. అమరావతి వ్యాలీని గ్లోబల్ గేట్‌వేగా మార్చాలని.. పెట్టుబడులు పెట్టేందుకు స్టార్టప్‌లకు ప్రోత్సాహకాలివ్వాలని తీర్మానించింది. ఈ మేరకు డిక్లరేషన్‌ను ఆమోదించింది. క్వాంటమ్ కంప్యూటింగ్ అండ్ అల్గారిథమ్స్, క్వాంటమ్ సెన్సింగ్ అండ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ మెటీరియల్ అండ్ చిప్స్, కెపాసిటీ బిల్డింగ్, సాండర్డైజేషన్, స్టార్ట్ అప్ ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్‌పై వర్క్‌షాపులో విస్తృతంగా చర్చ జరిగింది. వ్యాలీ ప్రారంభమయ్యే 2026 జనవరి 1న 100 క్వాంటమ్ ఆల్గారిథమ్‌లను పరీక్షిస్తారు. 2027 జనవరి 1నాటికి మూడు క్వాంటమ్ కంప్యూటర్లు క్యూబిట్ టెక్నాలజీతో, సూపర్ కండక్టింగ్ సర్క్యూట్‌తో అందుబాటులోకి వస్తాయి. 2028 జనవరి 1న 1,000 కొత్త అల్గారిథమ్స్‌ను పరీక్షిస్తారు. 2029 జనవరి 1వ తేదీనాటికి 1,000 క్యూబిట్స్ క్వాంటమ్ సామర్థ్యానికి చేరుకుంటాయి. అలాగే అమరావతిలో అకాడమీని స్థాపించాలని నిర్ణయించారు. ఇందులో ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సులు ఉంటాయి. 20 యూనివర్సిటీల్లో టెక్నికల్ సర్టిఫికేషన్ కోర్సులను ప్రవేశపెడతారు.

# 'క్వాంటమ్' ఆవిష్కరణలకు ఆకాశమే హద్దు!



క్వాంటమ్ వ్యాలీ వర్క్‌షాపులో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఐటీ కంపెనీల ప్రతినిధులు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. దిగ్గజ సంస్థలైన ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ భాగస్వామ్యంతో రాష్ట్రప్రభుత్వం దీనిని ఏర్పాటు చేస్తోందన్నారు. క్వాంటమ్ వ్యాలీపై సోమవారం విజయవాడలో ఏర్పాటుచేసిన జాతీయ వర్క్‌షాపునకు సీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఐటీ, ఫార్మా, వాణిజ్య, నిర్మాణ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థల ప్రతినిధులు, కేంద్రప్రభుత్వంలోని ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులో లేకపోతే.. యుద్ధాలు కూడా చేయలేని పరిస్థితి నెలకొందని సీఎం ఈ సందర్భంగా చెప్పారు. అమరావతిని గ్లోబల్ క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని.. అధునాతన సాంకేతిక కేంద్రంగా మారుస్తామని, ఇక్కడకు తరలిరావాలని స్టార్టప్ కంపెనీలను ఆహ్వానించారు. 'నేషనల్ క్వాంటమ్ మిషన్‌ను కేంద్రం ప్రకటించిన వెంటనే అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును చేపట్టే బాధ్యతను ఐబీఎం, ఎల్ అండ్ టీ, టీసీఎస్‌కు అప్పగించాం. ఈ పార్కుకు అనుబంధంగా పూర్తిస్థాయి ఎకో సిస్టమ్‌ను ఏర్పాటుచేసి.. అన్నారు. 100కు పైగా మెథడాలజీ(యూజ్ కేస్)లను విశ్లేషణాత్మకంగా పరీక్షిస్తాం. అమరావతికి ఒక యంత్రాన్ని తీసుకొచ్చి క్వాంటమ్ కంప్యూటింగ్ వచ్చేసిందని అనుకోవడం లేదు. వివిధ ఉపకరణాల నుంచి రియల్ టైమ్ డేటా విశ్లేషణకు, వ్యవసాయంలో మట్టిలోని తేమ వంటి అంశాలను పరిశీలించడానికి క్వాంటమ్ కంప్యూటింగ్ అవసరం. క్వాంటమ్ టెక్నాలజీ, డీప్ టెక్నాలజీ, కృత్రిమ మేధ (ఏఐ) ఇప్పుడు సరికొత్తసాంకేతిక విప్లవం. ఈ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు కొన్ని సానుకూలతలు ఉన్నాయి. రాష్ట్రంలో స్పేస్ సిటీ, స్పేస్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో విస్తృత అవకాశాలున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ సేవలను వాట్సాప్ ద్వారా అందిస్తున్నాం. ఆగస్టు 15వ తేదీ నుంచి పౌర సేవలన్నీ ఆన్‌లైన్‌లో అందిస్తాం. పాలనలో పౌరుల నివాసాల జియో ట్యాగింగ్, సర్వీస్ డెలివరీ, ఆన్‌లైన్ ఫైళ్లు, క్లౌడ్ డేటాలను వినియోగిస్తున్నాం. క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీలో స్టార్టప్‌లనూ చేరిస్తే అవకాశాలు విస్తృతమవుతాయి. ఇది సాంకేతికతను మరోస్థాయికి చేరుస్తుంది' అని వివరించారు. అమరావతి సహా ఐదు ప్రాంతాల్లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని.. వాటిని సద్వినియోగం చేసుకోవాలని పరిశ్రమలు, స్టార్టప్‌లను కోరారు. 'బహుళ జాతి సంస్థలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని భాగస్వాములు కావాలి. ఇప్పుడే పెట్టుబడులతో రావలసిన అవసరం ఉంది. భారత్‌లోనే ఉత్పత్తులను తయారుచేసి.. ఇక్కడి మార్కెట్‌ను వినియోగించుకోవాలి. రాష్ట్రంలో ప్రతి కుటుంబం నుంచీ ఒక పారిశ్రామికవేత్తను తయారుచేయాలన్న లక్ష్యం పెట్టుకున్నాం' అని తెలిపారు.

### నాడు హైటెక్ సిటీని నిర్మించా..

పాలనలో పారదర్శకత, వేగం, జవాబుదారీతనం తీసుకురావడానికి ఐటీ ఒక్కటే మార్గమని దృఢంగా విశ్వసించానని సీఎం చెప్పారు. హైదరాబాద్‌లో హైటెక్‌సిటీ నిర్మాణంతో బలమైన ఎకోసిస్టమ్‌ను సృష్టించామని.. ఫలితంగా ఇప్పుడు సైబరాబాద్ ప్రపంచ ఐటీ కేంద్రంగా మారిందని గుర్తుచేశారు. ఇప్పుడు తెలంగాణ ఆదాయంలో 75 శాతం హైదరాబాద్ నుంచే వస్తోందన్నారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ కూడా దేశానికి మార్గనిర్దేశం చేయాలని ఆకాంక్షించారు. తమ లక్ష్యాలను కేంద్రప్రభుత్వ సహకారంతో సాధిస్తామని వెల్లడించారు.

### క్వాంటమ్ విజన్ లక్ష్యాలను లోకేశ్ సాధించాలి..

లోకేశ్ ఐదో తరగతి చదువుతున్నప్పుడే తాను ఐటీ రంగాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విస్తరించేందుకు కృషి చేశానని.. ఇప్పుడు క్వాంటమ్ కంప్యూటింగ్ వచ్చేసిందని.. లోకేశ్ ఐటీ మంత్రి అయ్యారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అమెరికాలోని కార్నెగీ మెలన్ విశ్వవిద్యాలయంలో చదువుకున్న ఆయన.. ఇప్పుడు ఐటీ మంత్రిగా ఉండడం సంతోషదాయకమన్నారు. క్వాంటమ్ టెక్నాలజీ విజన్ లక్ష్యాలను సాధించే బాధ్యతను ఆయనకు అప్పగించానని చెప్పారు. భవిష్యత్ పాలనకు క్వాంటమ్ కంప్యూటింగ్ దిక్సూచిగా పనిచేస్తుందన్నారు. తాను నిత్య విద్యార్థినని, భవిష్యత్ టెక్నాలజీని పాలనకు, అభివృద్ధికి సమ్మిళితం చేయాలన్నదే తన లక్ష్యమన్నారు. ఈ వర్క్‌షాపులో కొత్త టెక్నాలజీ గురించి తెలుసుకునేందుకు 4 గంటల పాటు కొత్త అంశాలను రాసుకుంటూనే ఉన్నానని చెప్పారు. ఈ వర్క్‌షాపులో.. అమరావతిలో ఏర్పాటుచేసే క్వాంటమ్ కంప్యూటర్ నమూనాను ఐబీఎం ప్రదర్శించింది. దీనితో పాటు పలు క్వాంటమ్ టెక్నాలజీ స్టార్టప్‌లను లోకేశ్‌తో కలిసి చంద్రబాబు పరిశీలించారు.

## భావి యుద్ధాలన్నీ క్వాంటమ్ కంప్యూటింగ్‌తోనే..

సబ్‌మెరైన్ల నిర్వహణ కూడా: వక్తలు

అమరావతి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్' పేరు చెబితే.. హైదరాబాద్ డీఆర్‌డీవో గుర్తుకొస్తుందని పలువురు వక్తలు అన్నారు. భవిష్యత్‌లో యుద్ధాలన్నీ క్వాంటమ్ కంప్యూటింగ్ సాంకేతిక సహకారంతోనే ముందుకు సాగుతాయని తెలిపారు. విజయవాడ వర్క్‌షాపులో క్వాంటమ్ కంప్యూటింగ్ అల్గారిథమ్స్‌పై జరిగిన చర్చాగోష్ఠిలో కేంద్ర ప్రభుత్వ సాంకేతిక నైపుణ్య సంస్థల ప్రతినిధులు మాట్లాడారు. భారీ ఆర్థిక లావాదేవీలు .. డిజిటల్ చెల్లింపులు, బ్యాంకుల సేవలు, ఔషధాల నమూనాలు, విద్య, వైద్యరంగంలో క్వాంటమ్ కంప్యూటింగ్ సేవలు వేగవంతం కానున్నాయని ఐబీఎం క్వాంటమ్ కంప్యూటింగ్ హెడ్ డాక్టర్ వెంకట ఎల్.సుబ్రహ్మణ్యం చెప్పారు. భవిష్యత్ యుద్ధాలన్నీ మానవ రహిత క్షిపణులు, డ్రోన్ల సహకారంతోనే జరుగుతాయని విశాఖ ఎన్ఎస్‌టీఎల్-డీఆర్‌డీవో శాస్త్రవేత్త సాజీ వీఎఫ్ వెల్లడించారు. డ్రోన్ల సహకారంతో శత్రుదేశ స్థావరాలు, ఆయుధాల ధ్వంసం, సైనికులపైనా పైచేయి సాధించేందుకు క్వాంటమ్ కంప్యూటింగ్ పరిజ్ఞానం ఉపయోగపడుతుందని తెలిపారు.

## బనకచర్లపై కొర్రీ

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టంచేసింది. అనుమతులన్నీ తీసుకున్నాక టీవోఆర్ రూపకల్పనకు మళ్లీ ప్రతిపాదనలు సమర్పించాలని సోమవారం ఢిల్లీలో జరిగిన ఈఏసీ 33వ సమావేశంలో రాష్ట్రప్రభుత్వానికి సూచించింది. ఈ భేటీకి ఈఏసీ ఛైర్మన్ జీజే చక్రపాణి, కమిటీ సభ్యులు ఉదయ్‌కుమార్ ఆర్‌వై, జేవీ త్యాగి, కార్తీక్ సప్రే, అజయ్‌కుమార్ లాల్, రాకేశ్ గోయల్, బలరాం కుమార్, శాస్త్రవేత్త యోగేంద్ర పాల్ సింగ్ హాజరయ్యారు.

**జలవనరుల శాఖ గుర్రు..** ఈఏసీ తీరుపై ఏపీ జలవనరుల శాఖ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తోంది. పర్యావరణ సమస్యలు ఉన్నాయో లేదో పరిశీలించకుండా.. తన పరిధిలో లేని అంతర్రాష్ట్ర సమస్యలను ప్రస్తావిస్తూ ప్రాజెక్టు ఫైలును తిప్పిపంపడంపై అభ్యంతరం వ్యక్తంచేస్తోంది. సముద్రంపాలయ్యే 3 వేల టీఎంసీల్లో కేవలం 200 టీఎంసీలను వరద సమయంలో రాష్ట్రం పరిధిలో మాత్రమే వాడుకుంటే అంతర్రాష్ట్ర సమస్యలు ఎలా వస్తాయని ప్రశ్నిస్తోంది. 'జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం ముంపుపై ఇప్పటికే కేంద్రం ఆయా రాష్ట్రాలతో సంప్రదింపుల ప్రక్రియ చేపట్టింది. నేరుగా ప్రధాని మోదీయే బీజేపీ పాలిత రాష్ట్రాలైన ఒడిసా, ఛత్తీస్‌గఢ్ సీఎంలతో చర్చిస్తున్నారు. పోలవరం నుంచి నీరు నేరుగా సముద్రంలోకే పోతోంది. సముద్రంలోకి వెళ్లే నీటిని మా రాష్ట్రం సరిహద్దులోనే వాడుకుంటే.. అంతర్రాష్ట్ర సమస్య ఎందుకొస్తుంది?' అని అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. చిన్న చిన్న విషయాలకు కూడా పర్యావరణ శాఖ కొర్రీలు వేయడం సహజమేనని.. కానీ ఈ-మెయిల్స్‌లో పలు ఫిర్యాదులు అందాయంటూ ఫైలును తిప్పి పంపుతున్నామని చెప్పడం ఏమిటని సాగునీటి రంగ నిపుణులు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈఏసీ లేవనెత్తిన అంశాలపై ప్రభుత్వ స్థాయిలో కూలంకషంగా చర్చించి తదుపరి కార్యాచరణ ఖరారుచేస్తామని జల వనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

## రిటైరైన ఇద్దరు ఐఏఎస్‌లకు రీ-ఎంప్లాయిమెంట్

» గవర్నర్ కార్యదర్శిగా హరిజవహర్‌లాల్

» బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా సత్యనారాయణ కొనసాగింపు

అమరావతి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రీ - ఎంప్లాయిమెంట్ కింద మరో ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులకు సర్వీసు కొనసాగింపు ఇచ్చింది. సోమవారంతో 60 ఏళ్లు పూర్తి చేసుకుని రిటైరైన ఎం.హరిజవహర్‌లాల్, ఎస్.సత్యనారాయణలకు సర్వీసును పొడిగించింది. 2005 బ్యాచ్‌కు చెందిన హరిజవహర్‌లాల్ ప్రస్తుతం గవర్నర్ కార్యదర్శిగా రాజ్‌భవన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే, 2006 బ్యాచ్‌కు చెందిన సత్యనారాయణ బీసీ సంక్షేమశాఖ కార్యదర్శిగా ఉన్నారు. వీరిద్దరు జూన్ 30న రిటైరయ్యారు. అయినా వీరి సేవలను ఉపయోగించుకోవాలని భావించిన ప్రభుత్వం వీరి సర్వీసును పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతమున్న పోస్టుల్లోనే ఎక్స్‌అఫిషియో కార్యదర్శులుగా వీరు మరో ఏడాదిపాటు విధులు నిర్వర్తించనున్నారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ కార్యదర్శిగా ఉన్న 1999 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి కేఆర్‌బీహెచ్ఎన్ చక్రవర్తి కూడా సోమవారం పదవీ విరమణ చేశారు. ఆయనకు మాత్రం ప్రభుత్వం ఎలాంటి కొనసాగింపూ ఇవ్వలేదు.

# రాష్ట్ర బీజేపీ కొత్త సారథి మాధవ్

» ఆయన పేరును ఖరారు చేసిన అధిష్ఠానం

» దీంతో ఒకటే నామినేషనే దాఖలు

» నేడు అధికారిక ప్రకటన



బీజేపీ కొత్త అధ్యక్షుడు మాధవ్, నేతలు శ్రీనివాస వర్మ, పురందేశ్వరి తదితరులు

అమరావతి, విశాఖపట్నం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడెవరనే సందిగ్ధతకు తెర పడింది. పార్టీ శ్రేణులకు అధిష్ఠానం ఎట్టకేలకు స్పష్టత ఇచ్చింది. వెనుకబడిన వర్గాలకు చెందిన ఉత్తరాంధ్ర నాయకుడు పీవీఎన్ మాధవ్‌ను ఈ పదవి కోసం ఎంపిక చేసింది. అనేక మంది పెద్దలు పోటీ పడినా మాధవ్‌నే ఈ పదవి వరించింది. సుదీర్ఘకాలంగా ఆయన చేసిన సేవలను బీజేపీ అధిష్ఠానం గుర్తించి కీలకమైన బాధ్యతలు అప్పగించింది. దీంతో సోమవారం ఆయన విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో అధ్యక్ష స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. ఐదు సెట్ల నామినేషన్లు ఎన్నికల అధికారి పాకా సత్యనారాయణకు సమర్పించారు. పార్టీ ప్రస్తుత అధ్యక్షురాలు పురందేశ్వరి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి శివ ప్రకాశ్, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, బీజేపీ ఎమ్మెల్యేలు పార్థసారథి, విష్ణుకుమార్ రాజు, నల్లమిల్లి రామక్రిష్ణారెడ్డి, ఎన్. ఈశ్వర రావు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి బీజేపీ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఢిల్లీ పెద్దల ఆదేశాలతో ఇతరులెవ్వరూ నామినేషన్ వేయకపోవడంతో మాధ వ్ పేరు అధ్యక్షుడిగా ఖరారైంది. మంగళవారం కొత్త అధ్యక్షుడి పేరు అధికారికంగా ప్రకటించనున్నట్లు ఎన్నికల పరిశీలకుడిగా వచ్చిన కర్ణాటక బీజేపీ ఎంపీ మోహన్ తెలిపారు. విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్లో జరిగే రాష్ట్ర బీజేపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పేరును అధికారికంగా ప్రకటిస్తారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్న పురందేశ్వరిని అధినాయకత్వం మార్చే అవకాశం ఉందని జనవరి నుంచే పార్టీలో అంతర్గతంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆశావాహులు ఎవరికి వారు తమకున్న పరిచయాలతో ఢిల్లీలో ప్రయత్నాలు చేశారు.అయితే సుదీర్ఘకాలంగా పార్టీలో క్రమశిక్షణతో పని చేస్తున్న మాధవ్ వైపు అధిష్ఠానం మొగ్గు చూపింది.

### మాధవ్ రాజకీయ ప్రస్థానం

విశాఖపట్నానికి చెందిన పాతతరం బీజేపీ నాయకుడు పీవీ చలపతి రావు కుమారుడు మాధవ్. చలపతిరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేశారు. అదే వారసత్వాన్ని తన పనితీరు ద్వారా మాధవ్ అందిపుచ్చుకున్నారని మిత్రులు చెబుతున్నారు. చలపతిరావు దంపతులకు అనకాపల్లిలో 1973 ఆగస్టు 10న మాధవ్ జన్మించారు. విశాఖ జిల్లా ఆనందపురం మండలం గుడిలోవ సంఘ్ పాఠశాలలో ఒకటి నుంచి 12వ తరగతి వరకు చదువుకున్నారు. విశాఖపట్నం వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం పూర్తిచేశారు. ఏఐసీడబ్ల్యుఏలో సీఏ చేసి, అక్కడే కంప్యూటర్ అప్లికేషన్స్‌లో పీజీ డిప్లమో చేశారు. ఆంధ్ర యూనివర్సిటీలో ఎంబీఏ చేశారు. మాధవ్ విద్యార్థి దశలో ఏబీవీపీలో చేరి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం)లో 2003లో చేరి క్రియాశీల రాజకీయ జీవితానికి శ్రీకారం చుట్టారు. 2003 నుంచి 2007 వరకు బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పనిచేశారు. 2007 నుంచి 2010 వరకు మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చేశారు. 2010-2013 వరకూ బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 2009లో విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యేగా బీజేపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా 2017లో పోటీ చేసి విజయం సాధించారు. శాసన మండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా సేవలు అందించారు. మాధవ్‌కు మాతృభాషతోపాటు ఇంగ్లిష్, హిందీ భాషల్లో మంచి పట్టు ఉంది. విశాఖపట్నంలో బీజేపీ జాతీయ నాయకుల సమావేశాలు నిర్వహిస్తే వారి ప్రసంగాన్ని అనువదించే బాధ్యత ఆయనకే అప్పగిస్తారు. ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తదితరుల ప్రసంగాలను అనువదించిన అనుభవం మాధవ్‌కు ఉంది.

## తెలంగాణకు రాంచందర్‌రావు

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక

» నూతన సారథిగా నేడు అధికారిక ప్రకటన



కార్యకర్తలతో రాంచందర్‌రావు ఆనందోత్సాహం

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ తెలంగాణ నూతన అధ్యక్షుడిగా పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ నారపరాజు రాంచందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి సోమవారం ఆయన ఒక్కరే నామినేషన్ వేశారు. నూతన అధ్యక్షుడిగా రాంచందర్‌రావు పేరును సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి శోభా కరంద్లాజే మంగళవారం అధికారికంగా ప్రకటించనున్నారు. రాంచందర్‌రావు నామినేషన్ దాఖలు సమయంలో ఆయన వెంట పార్టీ ప్రస్తుత అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మరో కేంద్రమంత్రి బండి సంజయ్‌తోపాటు ఎంపీలు, సీనియర్ నేతలు ఉన్నారు.

### నక్సల్స్ దాడితో రెండు నెలలు మంచంపైనే..

ఎన్.రాంచందర్‌రావు అంటే న్యాయవాదిగా, మాజీ ఎమ్మెల్సీగా మాత్రమే చాలామందికి తెలుసు. కానీ, విద్యార్థి రాజకీయాల్లో ఆయన రాడికల్స్‌కు ఎదురొడ్డి పోరాడారు. ఉస్మానియా వర్సిటీలో ఏబీవీపీ మనుగడలో లేని సమయంలో రాంచందర్‌రావు అందులో చేరి ఆ సంఘాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. రాంచందర్‌రావు వర్సిటీ లైబ్రరీలో ఉన్న సమయంలో నక్సలైట్లు ఏకంగా అక్కడికి వచ్చి ఆయనపై దాడిచేశారు. దీంతో రెండు నెలల పాటు ఆస్పత్రిలో మంచానికే పరిమితమయ్యారు. మరోవైపు నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో రాంచందర్‌రావు అంచెలంచెలుగా ఎదిగారు. 1986లో బీజేపీలో చేరి కార్పొరేటర్‌గా తొలిసారి చేశారు. పార్టీలో పలు బాధ్యతలు చేపట్టారు. బీజేపీ లీగల్ సెల్‌లో క్రియాశీల పాత్ర పోషించారు. 2015లో శాసనమండలి సభ్యుడిగా ఎన్నికై బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా చేశారు.

## బీజేపీకి ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి సోమవారం పార్టీ కార్యాలయంలో స్వయంగా అందజేశారు. పార్టీకి రాజీనామా చేసినందున ఎమ్మెల్యేగా తనను అనర్హుడిగా ప్రకటించాలంటూ స్పీకర్‌కు లేఖ రాయాలని కిషన్‌రెడ్డిని కోరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. అధ్యక్ష పదవికి తాను కూడా నామినేషన్ వేస్తానని రెండు రోజుల క్రితమే ప్రకటించిన రాజాసింగ్.. ఈ మేరకు సోమవారం రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు. అయితే తనకు మద్దతిచ్చేవారిని 'పదవిలో ఉంటారా? సస్పెండ్ చేయాలా?' అంటూ కొందరు బెదిరించారని, తద్వారా నామినేషన్ వేయకుండా తనను అడ్డుకున్నారని ఆరోపించారు.

## నేడు తూర్పున సీఎం పర్యటన

» ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్న చంద్రబాబు

రాజమహేంద్రవరం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మంగళవారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం మలకపల్లిలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ఉండవల్లిలోని నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.30 గంటలకు కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి కారులో 10.45 గంటలకు మలకపల్లి చేరుకుంటారు. లబ్ధిదారుల ఇంటికి స్వయంగా వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ చేస్తారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో పాల్గొన్ని పీ-4 పథకం కింద నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకునే వారితో ముఖాముఖి సంభాషిస్తారు. అనంతరం కాపవరంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. కాపవరం నుంచి 3.30 గంటలకు రాజమండ్రి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 3.40 గంటలకు బయలుదేరి చిత్తూరు పర్యటన నిమిత్తం బెంగళూరు వెళతారు. ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి కందుల దుర్గేశ్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

## సంఘ విద్రోహశక్తులను ప్రోత్సహిస్తున్న వైసీపీ

» విధ్వంసకరంగా జగన్ యాత్రలు: మంత్రి పార్థసారథి



పంగులూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం కృషిచేస్తుంటే వైసీపీ సంఘ విద్రోహశక్తులను ప్రోత్సహిస్తూ విధ్వంసం సృష్టించేందుకు తెగించిందని మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపించారు. బాపట్ల జిల్లా పంగులూరు మార్కెట్ యార్డ్‌లో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. రైతుల పరామర్శ పేరుతో జగన్ చేపడుతున్న యాత్రలు విధ్వంసకరంగా ఉన్నాయి. పెట్టుబడులు పెట్టే వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు వైసీపీ భూతాన్ని తిరిగి రానీయమని గట్టిగా చెప్పాల్సిన పరిస్థితి తలెత్తింది' అని అన్నారు. పొగాకు రైతులను ప్రభుత్వం పూర్తిగా ఆదుకుంటుందని మరో మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, కలెక్టర్ వెంకట మురళి పాల్గొన్నారు.

## వైసీపీ వ్యవసాయాన్ని ముంచింది: శ్రీనివాసరెడ్డి

అమరావతి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో వ్యవసాయ రంగాన్ని జగన్ నట్టేట ముంచితే ఏడాది పాలనలోనే కూటమి ప్రభుత్వం అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చి ఆదుకుంటోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'కూటమి ప్రభుత్వం ఖరీఫ్, రబీ సీజన్లకు కలిపి 68 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లోనే డబ్బులను ఖాతాల్లో జమ చేసింది. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే వైసీపీ బకాయిలు చెల్లించింది' అని శ్రీనివాసరెడ్డి విమర్శించారు.

## ఆరోగ్య సమాజంతోనే స్వర్ణాంధ్ర సాధ్యం

» ఏడాదిలో ప్రజారోగ్యంలో ఎన్నో మార్పులు

» ఆరోగ్యశాఖపై సమీక్షలో మంత్రి సత్యకుమార్

అమరావతి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు ఆరోగ్యంతో కూడిన సమాజం ఎంతో అవసరమని ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజారోగ్య రంగంలో ఎదురైన అనుభవాలు, మంత్రిత్వ శాఖ చేసిన ప్రయత్నాలు, సాధించిన ఫలితాల నేపథ్యంలో... 2025-26కు సంబంధించిన ఎజెండాపై సోమవారం సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆరోగ్యంతో కూడిన సమాజం కోసం ప్రతి ఏడాది ఒక అడుగు ముందుకు వేయాలని ఉన్నతాధికారులకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రజారోగ్య రంగంలోని అస్తవ్యస్త పరిస్థితిని అధిగమించడానికి కృషి చేసిందని, ఫలితంగా కొంతమేర మార్పు తీసుకురాగలిగామని చెప్పారు. వైద్యసిబ్బంది హాజరు మొదలుకొని, అత్యాధునిక వైద్యసేవల కల్పన వరకూ 20 విషయాలపై ప్రగతిని ప్రతి మూడు నెలలకొకసారి సమీక్షిస్తానని స్పష్టం చేశారు. ఐపీఎం, డ్రగ్ కంట్రోల్ విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయాలన్నారు.

# గెస్ట్ ఫ్యాకల్టీ వేతనాలు పెంపు!

- గిరిజన గురుకులాల్లో ఔట్ సోర్సింగ్‌కు 6-7 వేల మేరకు పెరగనున్న జీతాలు

అమరావతి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ గెస్ట్ ఫ్యాకల్టీకి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వీరి వేతనాలు పెంచనున్నట్టు తెలిపింది. దీంతో ఒక్కొక్క ఉపాధ్యాయుడికి రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు వేతనం పెరగనుంది. వాస్తవానికి ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న ఈ అధ్యాపక సిబ్బందికి వేతనాలు పెరగలేదు. గత వైసీపీ ప్రభుత్వానికి వందలసార్లు విన్నవించుకున్నా కరుణించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్, మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని కలిసి పలు దఫాలుగా తమ గోడును వెళ్లబోసుకున్నారు. దీంతో మంత్రి సంధ్యారాణి స్పందించి అధికారులు, ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులతో చర్చించారు. సిబ్బందికి జీతాలు తక్కువగా ఉండటంతో ఎట్టకేలకు వారి వేతనాలు పెంచేందుకు నిర్ణయం తీసుకున్నారు. దీని ప్రకారం గిరిజన గురుకులాల్లో పనిచేసే సుమారు 1,650 మంది గెస్ట్ ఫ్యాకల్టీలకు ఒక్కొక్కరికీ రూ.6 వేల నుంచి రూ.7 వేల మేరకు వేతనాలు పెరగనున్నాయి. గురుకుల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్లు, ఫిజికల్ డైరక్టర్స్, లైబ్రరియన్స్‌కు రూ.18 వేల నుంచి రూ.24 వేల వరకు వేతనాలు పెంచనున్నారు. అదేవిధంగా టీజీటీ, పీఈటీ, ఆర్ట్స్ క్రాఫ్ట్ సిబ్బందికి కూడా ఇదే తరహాలో జీతాలు పెరగనున్నాయి. దీంతో పాటు స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ, కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీలో పనిచేసే జూనియర్ లెక్చరర్లు, ఫిజికల్ డైరక్టర్లు సుమారు 58 మందికి రూ.6 నుంచి రూ.7 వేలకు పెంచనున్నారు.

# మా గోడు పట్టించుకోండి సార్!

- ఉపాధి ఎంసీపీల్లోని అటెండర్ల ఆవేదన
- జీతం పెంచి, తమ ఖాతాల్లో వేయాలని వినతి

అమరావతి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి చిరు జీతాలకే పనిచేస్తున్న తమ గోడు పట్టించుకోవాలని డ్వామా మండల కేంద్రాల్లో(ఎంసీపీ) పనిచేస్తున్న అటెండర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడో ఉపాధి హామీ పథకం ప్రారంభమైనప్పటి నుంచి మండల కంప్యూటర్ సెంటర్‌లో అటెండర్లుగా పనిచేస్తున్న తమకు రూ.6 వేల వేతనమే ఇస్తున్నారని చెబుతున్నారు. ప్రతి రోజు ఆఫీసు సమయం కంటే ముందే ఎంసీసీ కేంద్రాలకు వచ్చి కార్యాలయం శుభ్రం చేసి, సిబ్బందికి తాగునీరు అందించి, సాయంత్రం దాకా సిబ్బంది ఏం పని చెప్తే ఆ పనులు చేసే తమకు రూ.6 వేలు మాత్రమే అందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ వేతనం పొందాలన్నా.. డ్వాక్రా గ్రూపు లీడర్, సంబంధిత కమ్యూనిటీ కోఆర్డినేటర్, డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్‌ల సంతకాల కోసం వేచి చూడాల్సి వస్తోందని అంటున్నారు. ఈ జీతాలు ఉపాధి హామీ నిధులతో ఇస్తున్నా.. దానికి డ్వాక్రా సిబ్బంది సంతకాలు ఎందుకో అర్థం కావడం లేదని వాపోతున్నారు. కొన్ని చోట్ల డ్వాక్రా సిబ్బంది సంతకాలు పెట్టకుండా వేధిస్తుండటంతో జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు.

### అప్పుడు టీడీపీ పెంచడమే!

మండల కేంద్రంలో డ్వామా, వెలుగు కార్యక్రమాలు ఒకే భవనంలో నిర్వహిస్తుంటారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఈ భవనాల నిర్మాణాలను అప్పట్లో పూర్తి చేశారు. 'వెలుగు' ద్వారా అటెండర్లను నియమించేందుకు అప్పట్లో డ్వాక్రా గ్రూపులోని సభ్యులను అటెండర్లుగా నియమించుకున్నారు. మొదట్లో రూ.1,000 వేతనం ఉన్న వారికి 2007లో రూ.3 వేలకు పెంచారు. ఆ తర్వాత 2014-19 మధ్య కాలంలో రూ.6 వేలకు పెంచారు. ఈ వేతనాలను వారి అకౌంట్లలో జమ చేసేలా నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత వైసీపీ హయాంలో తమ జీతాలు పెంచాలని ఎంసీసీ సిబ్బంది పలు దఫాలుగా అప్పటి కమిషనర్, ఉపాధి హామీ డైరెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. అప్పట్లో ఉపాధి హామీ పథకం డైరక్టర్‌గా పనిచేసిన చినతాతయ్య వారి గోడును పట్టించుకోకపోవడమే కాక వారి వేతనాలను ఖాతాల్లో వేయకుండా తిరిగి పాత విధానం అమల్లోకి తెచ్చారు. డ్వాక్రా గ్రూపు లీడర్, సీసీ, ఏపీఓ సంతకాలు చేస్తేనే వారికి జీతాలు ఇచ్చే విధంగా నిబంధనలు పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 650 మంది దాకా మండల కంప్యూటర్ కేంద్రాల్లో అటెండర్లు పనిచేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలను తొలగించాలని వానే కమిషనర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సానుభూతితో జీతాలు పెంచాలని కోరుతున్నారు.

# మొరాయించిన లగేజీ స్కానర్లు

- అలిపిరి చెక్ పాయింట్ వద్ద తిప్పలు
- మ్యాన్యువల్‌గా తనిఖీ చేసిన అధికారులు
- భారీగా బారులు తీరిన వాహనాలు, భక్తులు
- రెండున్నర గంటలపాటు ఇబ్బందులు
- విద్యుత్ అంతరాయమే కారణం: సీవీఎస్వో

తిరుపతి(నేరవిభాగం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని అలిపిరి చెక్‌పాయింట్ వద్ద సోమవారం ఉదయం లగేజీ స్కానర్లు మొరాయించాయి. దీంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. బస్సులు, సొంత, అద్దె వాహనాల్లో తిరుమలకు వచ్చే భక్తుల లగేజీని ఇక్కడి స్కానర్లలో తనిఖీ చేస్తారు. దీనికోసం 2021లో విహాంత్, వివాల్వ్ కంపెనీల ప్రతినిధులు ఆరు లగేజీ స్కానర్లు ఏర్పాటు చేశారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం, సర్వర్లు మొరాయించడంతో సోమవారం ఉదయం 6.55 గంటల ప్రాంతంలో లగేజీ స్కానర్లు పనిచేయడం మానేశాయి. దీంతో భక్తులు తమ లగేజీని స్కాన్ చేయించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో అలిపిరి ఏవీఎస్వో రమేశ్, విజిలెన్స్ విభాగం ఇన్‌స్పెక్టర్ పురుషోత్తంలు.. అదనపు సిబ్బందిని రంగంలోకి దింపారు. మ్యాన్యువల్‌గా భక్తుల లగేజీలు తనిఖీ చేసి కొండపైకి పంపారు. దీనివల్ల తనిఖీకి ఆలస్యమవడంతో వాహనాలు బారులు తీరాయి. స్కానర్ల వద్ద భక్తుల క్యూ పెరిగింది. ఒక దశలో భక్తులు సహనం కోల్పోయి తనిఖీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఇద్దరు టెక్నీషియన్లను పిలిపించి స్కానర్లు పనిచేయడానికి చర్యలు తీసుకున్నా విద్యుత్ అంతరాయంతో సర్వర్లు మొరాయించి.. పనిచేయలేదని తెలిసింది. చివరకు రెండున్నర గంటల తర్వాత స్కానర్లు పనిచేశాయి. అప్పటికే వందలాదిగా వాహనాలు, భక్తులు బారులు తీరారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్లే స్కానర్లు పని చేయలేదని సీవీఎస్వో మురళీకృష్ణ తెలిపారు. కాగా, ఈ మ్యాన్యువల్ తనిఖీ సందర్భంగా ఓ భక్తుడు డ్రోన్ తీసుకు రావడాన్ని సిబ్బంది గమనించారు. దీంతో అతడిని వెనక్కి పంపేశారు.



చెక్‌పాయింట్ వద్ద బారులు తీరిన కార్లు




భక్తుల లగేజీని మ్యాన్యువల్‌గా తనిఖీ చేసి పంపుతున్న అధికారులు

# జూలైలో వానలే వానలు!

- దేశంలోని 80 శాతం ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం
- రాష్ట్రంలో ఎక్కువ జిల్లాల్లో మంచి వర్షాలు

విశాఖపట్నం, పోలవరం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జూలై నెలలో దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. జూలైలో వర్షపాతం దీర్ఘకాలిక సగటులో 106 శాతం కంటే ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. జూలై నెలకు సంబంధించి వర్షపాతం, ఉష్ణోగ్రతలపై సోమవారం బులెటిన్ విడుదల చేసింది. దేశంలోని 80 శాతం ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. మిగిలిన 20 శాతం ప్రాంతాలు.. తమిళనాడు, కేరళ, బిహార్, ఈశాన్య భారతంలో తక్కువ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. మధ్యభారతం దాని చుట్టుపక్కల రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కానుంది. గోదావరి, కృష్ణా బేసిన్‌లో పుష్కలంగా వర్షాలు కురవనున్నాయి. కాగా, దేశవ్యాప్తంగా జూన్‌లో సగం రోజులు దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నప్పటికీ.. రెండో అర్థభాగంలో చాలా ప్రాంతాల్లో పుష్కలంగా వర్షాలు కురిశాయి. దీంతో జూన్‌లో సాధారణం కంటే తొమ్మిది శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. కాగా, జూన్‌లో ఆంధ్రప్రదేశ్‌లో సగం కంటే ఎక్కువ ప్రాంతాల్లో వర్షాభావం



కొనసాగింది. జూలైలో ఎక్కువ ప్రాంతాల్లో మంచి వర్షాలు కురుస్తాయని ఐఎండీ వెల్లడించింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, కాకినాడ నుంచి నెల్లూరు వరకు, నంద్యాల, కడప జిల్లాలో సాధారణం కంటే ఎక్కువగా వర్షాలు కురుస్తాయి. రాయలసీమలో సాధారణ వర్షపాతం నమోదవుతుంది. అల్లూరి, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదు కానుంది.

### శ్రీశైలానికి భారీగా వరద

శ్రీశైలం ప్రాజెక్టుకు భారీ వరద కొనసాగుతోంది. సోమవారం ఉదయం 1.50 లక్షల క్యూసెక్కుల ప్రవాహం రాగా.. రాత్రి 11 గంటల సమయానికి 1,18,736 క్యూసెక్కులకు తగ్గింది. రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యం 215.81 టీఎంసీలకు గాను.. 157.49 టీఎంసీల నిల్వ ఉంది. నీటిమట్టం పెరగడంతో కుడి, ఎడమ భూగర్భ విద్యుత్కేంద్రాల్లో విద్యుదుత్పాదన ప్రారంభించారు.

### గోదావరికి వరద

గోదావరి నీటిమట్టం పెరగడంతో సోమవారం పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 34,426 క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. స్పిల్‌వే 48గేట్లు, స్లూయిజ్ గేట్ల నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు.

# ఊరించి.. ఉసూరుమనిపించి!

- 'అల్పపీడనం'తో వేసిన అంచనాలు తలకిందులు
- రాష్ట్రంలో జూన్‌లో 23.8% తక్కువ వానలు

విశాఖపట్నం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం సోమవారం నాటికి బెంగాల్ తీర ప్రాంతంలో కొనసాగుతోంది. ఈ అల్పపీడనంతో ఉత్తర కోస్తా వరకు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేశారు. ఉత్తర కోస్తాలో అనేక చోట్ల వర్షాలు, అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ బులెటిన్ కూడా విడుదల చేసింది. అయితే సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ మేఘాలు ఆవరించినప్పటికీ తుంపర తప్ప ఒక మోస్తరు వర్షం కూడా కురవలేదు. దీంతో అల్పపీడనం ఉసూరుమనిపించిందని వాతావరణ నిపుణుడొకరు వ్యాఖ్యానించారు. కాగా, జూలై తొలి వారం చివరిలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పలు మోడళ్లు చెబుతున్నాయి. అయితే బెంగాల్‌కు ఆనుకొని ఏర్పడే అల్పపీడనాల వల్ల ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లో తప్ప కోస్తాంధ్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లలో వర్షాలు కురిసే అవకాశం తక్కువని వాతావరణ నిపుణుడు ఒకరు విశ్లేషించారు.

### రాష్ట్రంలో నిరాశపరిచిన 'జూన్'

జూన్‌లో దేశవ్యాప్తంగా 165.3 మి.మీకు గానూ 180.8 మి.మీ (సాధారణం కంటే 9శాతం ఎక్కువ) వర్షపాతం నమోదైంది. అయితే ఏపీలో మాత్రం జూన్ నిరాశపరిచింది. జూన్‌లో 97.4 మి.మీ.కు గానూ 74.7 మి.మీ. వర్షపాతం (సాధారణం కంటే 23.8 శాతం తక్కువ) నమోదైంది. వర్షాలు తక్కువగా కురవడంతో మెట్ట పంటల సాగుపై ప్రభావం చూపుతుందని, వరి నారు పోసుకునేందుకు ఇంకా అనుకూల పరిస్థితులు రాలేదన్నారు.



# మూడో వారంలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్?

- అందుబాటులో 2 లక్షలకుపైగా సీట్లు
- ఇంకా తేలని ఫీజులు

అమరావతి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ జూలై మూడో వారంలో ప్రారంభమయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈఏపీసెట్ కౌన్సెలింగ్ నిర్వహణపై సాంకేతిక విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఆగస్టులో తరగతులు ప్రారంభించేలా కౌన్సెలింగ్ తేదీలు నిర్ణయించనున్నారు. గతేడాది కూడా ముందే ఈఏపీసెట్ కౌన్సెలింగ్ నిర్వహించడంతో దాదాపు 30వేల అడ్మిషన్లు పెరిగాయి. ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత శాతం కూడా భారీగా పెరిగింది. దీంతో అడ్మిషన్లు ఇంకా పెరిగే అవకాశం ఉంది. కాగా, ఈ ఏడాది ఈఏపీసెట్ ఇంజనీరింగ్ విభాగంలో 1,89,748 మంది అర్హత సాధించారు. గతేడాది రాష్ట్రానికి ఏఐసీటీఈ 1.81 లక్షల ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి అనుమతిచ్చింది. ఈ ఏడాది ప్రైవేటు యూనివర్సిటీలు పెరగడంతో ఇంజనీరింగ్ సీట్ల సంఖ్య 2లక్షలు దాటే అవకాశం కనిపిస్తోంది. దీనిపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయాల్సి ఉంది. మరోవైపు ఫీజులు ఇంకా ఖరారు కాలేదు. గతంలో నిర్ణయించిన ఫీజులపై యాజమాన్యాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో 2024-25 విద్యా సంవత్సరానికి మాత్రమే ఫీజులు ఖరారు చేశారు. న్యాయస్థానం ఆదేశాలతో ఈ ఏడాది ఫీజులు నిర్ణయించాల్సి ఉంది.

### 9 నుంచి ఈసెట్ కౌన్సెలింగ్

డిప్లొమా నుంచి నేరుగా బీటెక్ రెండో ఏడాదిలో చేరే విద్యార్థుల కోసం ఈనెల 7న ఈసెట్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌ను సాంకేతిక విద్యాశాఖ విడుదల చేయనుంది. ఈనెల 9 నుంచి 22 వరకు మొదటి విడత, 30 నుంచి ఆగస్టు 4 వరకు రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించింది. జూలై 24 నుంచి రెండో ఏడాది ఇంజనీరింగ్ తరగతులు ప్రారంభమవుతాయి.

# లిక్కర్ 'సొమ్ము' 30 కోట్లు సీజ్

- బ్యాంకు ఖాతాల్లోని నగదు స్తంభన
- రాజ్ కసిరెడ్డి 'అదాన్' అకౌంట్లో 16.12 కోట్లు
- గరికపాడు వద్ద పట్టుబడ్డ 8.37 కోట్ల నగదు
- ఎస్ఎన్‌జే షుగర్స్ ఖాతాలో 5 కోట్లు
- ఎంపీ డిస్టిలరీస్ నుంచి 50 లక్షలు

అమరావతి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతిపెద్ద మద్యం కుంభకోణంలో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అత్యంత కీలక ముందడుగు వేసింది. వైసీపీ పాలనలో వేల కోట్లు ప్రజల నుంచి దోచుకుని వాటాలు పంచుకున్న లిక్కర్ మాఫియాకు గట్టి షాక్ ఇచ్చింది. నిందితులకు చెందిన 29,99,05,244 రూపాయలను జప్తు చేసింది. ప్రభుత్వాన్ని సీఐడీ కోరడంతో జప్తునకు అనుమతిస్తూ సోమవారం హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. లిక్కర్ స్కామ్‌లో కర్త, కర్మ, క్రియగా భావిస్తున్న రాజ్ కసిరెడ్డి(ఏ-1)కి చెందిన అదాన్ డిస్టిలరీస్ బ్యాంకు ఖాతా నుంచి 16.12 కోట్ల రూపాయలను సిట్ సీజ్ చేసింది. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు ఓట్లు కొనేందుకు తరలిస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అనుచరుల నుంచి కృష్ణా జిల్లా సరిహద్దుల్లోని గరికపాడు చెక్‌పోస్టు వద్ద పోలీసులు సీజ్ చేసిన 8.37 కోట్ల రూపాయలు(బెజవాడ ట్రెజరీలో ఉంది) సైతం జప్తు చేసింది. జగన్ పాలనలో మద్యం సరఫరాలో కీలకంగా వ్యవహరించి, ఆ తర్వాత రాజ్ కసిరెడ్డికి గోవాలో డిస్టిలరీ(లీలా బెవరేజెస్)ని తప్పక వదులుకున్న ఎస్ఎన్‌జే షుగర్స్ అండ్ ప్రొడక్ట్స్‌కు చెందిన చెన్నైలోని బ్యాంకు అకౌంట్ నుంచి 5 కోట్ల రూపాయలు, ఎంపీ డిస్టిలరీస్ బ్యాంకు అకౌంట్ నుంచి 50 లక్షలు విత్ డ్రాకు అవకాశం లేకుండా చేసింది. గరికపాడు చెక్ పోస్టు వద్ద ఎన్నికల సమయంలో పట్టుబడ్డ సొమ్మును చెవిరెడ్డి పంపిన వ్యక్తులు రాజ్ కసిరెడ్డి నుంచి తాడేపల్లికి తీసుకొస్తున్నట్లు సిట్ ఆధారాలు సేకరించింది. రాజ్ కసిరెడ్డికి చెందిన అదాన్ డిస్టిలరీస్‌కు ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి 800 కోట్లు జమైంది. అందులో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లోని ఒక బ్యాంకులో 16.12 కోట్లు ఉన్నట్టు దర్యాప్తు అధికారులు గుర్తించారు. మరోవైపు మద్యం ఆర్డర్ల కోసం ఎస్ఎన్‌జే షుగర్స్ అండ్ ప్రొడక్ట్స్ నుంచి లిక్కర్ మాఫియా నగదు అడగ్గా.. అజ్ఞాత ఖాతాల్లోకి ఐదు కోట్లు పంపించింది. ఎంపీ డిస్టిలరీస్ కూడా అదే బాటలో నడిచి అడ్డంగా బుక్కైంది.

# బిగుస్తున్న ఉచ్చు

(మొదటి పేజీ తరువాయి)

బాలాజీ కుమార్ యాదవ్(ఏ-35), ఎద్దల నవీన్ కృష్ణ(ఏ-36)ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఇద్దరిని విజయవాడకు తీసుకొచ్చి జైలుకు పంపనున్నారు. దీంతో అరెస్టయిన వారి సంఖ్య పదకొండుకు చేరింది. వ్యాపారుల నుంచి వసూలు చేసిన డబ్బులను హైదరాబాద్‌లో రాజ్ కసిరెడ్డి, వెంకటేశ్ నాయుడు(చెవిరెడ్డి బినామీ) నుంచి బాలాజీ కుమార్, ఎద్దల నవీన్ తీసుకొచ్చి వైసీపీ అభ్యర్థులకు చేర్చారనే ఆరోపణలున్నాయి. తాడేపల్లిలో క్యాష్ స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసి వందల కోట్ల రూపాయలు తరలించడంలో కీలకపాత్ర పోషించారు.

### తుడా కార్లలో మద్యం ముడుపులు

మద్య నిషేధం హామీతో 2019లో అధికారంలోకి వచ్చిన జగన్.. మరోసారి ఎలాగైనా గెలవాలనే పథక రచనలో భాగంగా మద్యం ముడుపులు ఎన్నికల్లో ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికలకు ఆర్నెల్ల ముందు నుంచి హైదరాబాద్, విజయవాడ, తాడేపల్లి, ఒంగోలు, తిరుపతి ప్రాంతాలకు రూ.వందల కోట్లు తరలించే బాధ్యతను చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి అప్పగించారు. చెవిరెడ్డి తన మనుషుల్ని రంగంలోకి దించి వందల కోట్లను వైసీపీ అభ్యర్థులకు పంచేందుకు హైదరాబాద్ నుంచి తుడా కార్లలో తరలించారు. నమ్మకస్తులైన బాలాజీ కుమార్, ఎద్దల నవీన్ పలుమార్లు రూ.కోట్లను తెలుగు రాష్ట్రాల మధ్య తరలించారు. ఈ క్రమంలో గతేడాది మే మొదటి వారంలో కృష్ణాజిల్లా సరిహద్దుల్లో ఎన్నికల అధికారులకు రూ.8.37 కోట్లు పట్టుబడగా.. ఈ నగదు తమది కాదన్నట్లు మెల్లిగా తప్పుకొని చెన్నైకి పారిపోయారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మద్యం కుంభకోణంపై సిట్ ఏర్పాటు చేసి కూకటివేళ్లతో పెకిలిస్తోంది. సిట్ అధికారులు అనుమానితుల్ని, వ్యాపారుల్ని, అధికారుల్ని ప్రశ్నించి సోదాలు నిర్వహించారు.

### కసిరెడ్డితో మొదలై...

లిక్కర్ స్కామ్‌లో కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డి ఏప్రిల్ 21న విదేశాలకు పారిపోతుండగా హైదరాబాద్ విమానాశ్రయంలో సిట్ అధికారులు అరెస్టు చేశారు. అప్పటి నుంచి వరుస బెట్టి ఒక్కొక్కరిని జైలుకు పంపుతున్నారు. మాజీ సీఎం జగన్ దగ్గర కార్యదర్శిగా పనిచేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి (ఏ-31), మాజీ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి (ఏ-32), భారతీ సిమెంట్స్ కంపెనీ శాశ్వత డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప(ఏ-33), చెవిరెడ్డి(ఏ-38)తో పాటు వెంకటేశ్ నాయుడు(ఏ-34) సజ్జల శ్రీధర్ రెడ్డి(ఏ-6), బూనేటి చాణక్య (ఏ-8), దిలీప్(ఏ-30)ను విజయవాడ జైలుకు పంపారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి(ఏ-39)తో పాటు బాలాజీ కుమార్, ఎద్దల నవీన్ పరారీ అయ్యారు. ఈ ముగ్గురి కోసం వేట మొదలెట్టిన సిట్ బృందాలు బాలాజీ, నవీన్‌ని మధ్యప్రదేశ్‌లో అదుపులోకి తీసుకున్నారు.

### డబ్బుల కోసం ఫోన్ చేసి..

సిట్ అధికారులు చెవిరెడ్డిని అరెస్టు చేయడంతో బాలాజీ కుమార్, ఎద్దల నవీన్ అరెస్ట్ భయంతో ఆలయాలు సందర్శిస్తూ నేపాల్ వర కూ వెళ్లారు. చేతిలో డబ్బులు అయిపోవడంతో బాలాజీ కుమార్ తిరుపతిలోని తన తండ్రికి అజ్ఞాత సెల్ నెంబర్ నుంచి ఫోన్ చేశాడు. ఆన్‌లైన్‌లో పంపితే ఏటీఎం నుంచి డ్రా చేసుకున్నప్పుడు ఎక్కడ పట్టుబడతామోనని నగదు పంపాలని కోరాడు. తిరుపతి నుంచి ఒక వ్యక్తి క్యాష్ తీసుకుని ఇండోర్‌కు బయలుదేరాడు. అప్పటికే బాలాజీ తండ్రి ఫోన్‌పై నిఘా పెట్టిన సిట్ అధికారులు ఆయన కుమారుడికి డబ్బులు పంపిన వ్యక్తిని అనుసరించారు. మధ్యప్రదేశ్‌లో నిఇండోర్‌లో ఒక హోటల్లో ఉన్న బాలాజీ, నవీన్‌ను అదుపులోకి తీసుకుని స్థానిక కోర్టులో ప్రవేశ పెట్టారు. అక్కడి నుంచి ట్రాన్సిట్ వారెం ట్ తీసుకుని విజయవాడకు తీసుకొస్తున్నట్లు తెలిసింది.

## మద్యం స్కాం కేసులో.. సిట్ కస్టడీకి చెవిరెడ్డి, వెంకటేశ్

- ఏసీబీ కోర్టు అనుమతి
- చెవిరెడ్డికి ఇంటిభోజనం నిరాకరణ

విజయవాడ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెరుకూరి వెంకటేశ్‌నాయుడిని సిట్ విచారించేందుకు కస్టడీకి ఇస్తూ ఏసీబీ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. వారిని మంగళవారం నుంచి 3 రోజులపాటు ప్రశ్నించేందుకు అనుమతించింది. ఈ మేరకు న్యాయాధికారి పి.భాస్కరరావు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. జైల్లో ఉన్న చెవిరెడ్డికి ఇంటి నుంచి భోజనాన్ని అనుమతించడానికి కోర్టు నిరాకరించింది. ఇంకోవైపు.. ఈ కేసులో బెయిల్ కోసం చెవిరెడ్డి, వెంకటేశ్‌తో పాటు నిందితులు దిలీప్, చాణక్య వేసిన పిటిషన్లపై విచారణను కోర్టు జూలై 3కి వాయిదా వేసింది.

# అత్తమామలపై మచ్చుకత్తితో దాడి

- అక్కడికక్కడే ఇద్దరు వృద్ధుల మృత్యువాత
- భార్యపైనా కత్తి వేటు.. తీవ్రగాయాలు.. పరారీలో భర్త





మృతులు కల్లయ్య, జయమ్మ (ఫైల్)

దుత్తలూరు (ఉదయగిరి), జూన్ 30(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తు.. భార్యపై అనుమానం అతడిలో విచక్షణ కోల్పోయేలా చేసింది. కట్టుకున్న భార్యతో పాటు అత్తామామలపై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. దీంతో అత్తామామలు అక్కడికక్కడే మృతి చెందగా, భార్య తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి చేరుకుంది. నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం కమ్మవారిపాళెం సమీపాన ఏసీ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి ఈ దారుణం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కాలనీకి చెందిన ఏలూరి వెంగయ్య, వెంకాయమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. మద్యానికి బానిసైన వెంగయ్య కొన్ని నెలలుగా భార్యను అనుమానిస్తూ తరచూ వివాదానికి దిగేవాడు. ఈ తరుణంలో ఆదివారం కాలనీలో కొందరితో కలిసి వెంకాయమ్మ వింజమూరు మండలం గుండెమడగల చెరువులో చేపల కోసం వెళ్లింది. చేపలు విక్రయించగా వచ్చిన రూ.300 నగదుతో రాత్రి 7 గంటలకు ఇంటికొచ్చింది. ఇంటికొచ్చిన వెంకాయమ్మతో ఎవరికి చెప్పి చేపలకు వెళ్లావు.. మందు తాగొచ్చి నీ అంతు చూస్తానంటూ వెంగయ్య తీవ్రంగా హెచ్చరించాడు. భయభ్రాంతులకు గురైన ఆమె.. పెద్దకుమార్తెను వెంటబెట్టుకుని సమీపంలోని తన తల్లిదండ్రుల ఇంటికెళ్లింది. 11 గంటల ప్రాంతంలో పూటుగా మద్యం సేవించి వచ్చిన వెంగయ్య మచ్చు కత్తి చేత పట్టుకుని.. అత్తగారింటికి వెళ్లి.. గొడవకు దిగాడు. అత్తామామలు సర్దిచెప్పే ప్రయత్నం చేయగా.. అత్త చలంచర్ల జయమ్మ (59), మామ కల్లయ్య (64)లపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావమై వారిరువురూ అక్కడికక్కడే మృతిచెందారు. ఆ వెంటనే భార్యపై కూడా దాడి చేయడంతో ఆమె కొంతదూరం వెళ్లి పడిపోయింది. చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకోగా వారిపై కూడా వెంగయ్య కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించగా వారు ఎదురు తిరగడంతో పరారయ్యాడు. వెంగయ్య కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు ప్రారంభించినట్లు ఉదయగిరి ఎస్ఐలు ఆదిలక్ష్మి, రఘునాథ్ తెలిపారు.

# కారులోనే కడతేరారు

- కారులో కూర్చుని బీర్లు తాగిన ఇద్దరు యువకులు
- మత్తులో నిద్రలోకి.. ఊపిరాడక కారులోనే అన్నదమ్ముల మృతి

తిరుచానూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వారిద్దరూ అన్నదమ్ములు.. ఆదివారం కావడంతో బీర్లు తెచ్చుకున్నారు. ఎవరూ చూడకుండా కారులో కూర్చుని తాగారు. కొద్దిసేపటికే మత్తులోకి జారుకున్నారు. ఈలోగా పెట్రోల్ అయిపోయి కారు ఆగడంతో ఏసీ పనిచేయలేదు. దీంతో ఊపిరాడక ఆ ఇద్దరూ మృతిచెందారు. తిరుపతి జిల్లా తిరుచానూరులో ఈ సంఘటన చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... బుచ్చినాయుడు కండ్రిగ మండలం గోవిందప్పనాయుడు కండ్రిగకు చెందిన దిలీప్ (25), వినయ్ (20) వరుసకు అన్నదమ్ములు. దిలీప్ గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ.. తిరుపతి గోపాల్‌రాజుల కాలనీలో ఉంటూ.. తిరుచానూరు కాలువగడ్డ వీధిలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఆయనకు భార్య, పిల్లలున్నారు. వినయ్ టీటీడీ ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి వారు బీరుబాటిళ్లు తెచ్చుకున్నారు. దిలీప్ ఇంటి వద్ద ఉన్న కారుపై పట్టా కప్పి.. లోపలకు వెళ్లి డోర్లు వేసుకున్నారు. కారులో ఏసీ ఆన్ చేసుకుని అర్ధరాత్రి వరకు మద్యం తాగారు. ఆ తర్వాత మత్తులోకి జారుకున్నారు. కారులో పెట్రోల్ అయిపోవడంతో ఇంజన్, ఏసీ ఆగిపోయాయి. అద్దాలు మూసి ఉండడం, కారు డోర్లు కూడా లాక్ కావడంతో ఊపిరాడక ఆ ఇద్దరూ మృతిచెందారు. సోమవారం ఉదయం దిలీప్ భార్య జ్యోతి, బంధువులు కారు వద్దకు వచ్చి చూడగా దిలీప్, వినయ్ విగత జీవులుగా పడి ఉన్నారు. మరో తాళంతో కారు డోర్ ఓపెన్ చేసి ఇద్దరినీ బయటకు తీయగా.. అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న తిరుచానూరు ఎస్ఐ సాయినాథ్ చౌదరి సంఘటనా స్థలానికి చేరుకుని దిలీప్, వినయ్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీకి తరలించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఈ-స్టాంపుల కుట్ర వెనుక టీడీపీ నేత!

- మాజీ ఎమ్మెల్యే ఉన్నం తనయుడు మారుతి హస్తం
- కుంభకోణంలో ఎస్ఆర్‌సీ కంపెనీ పాత్ర కనిపించలేదు
- కల్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు కీలక ప్రకటన
- పార్టీ అధినేతకు ఫిర్యాదు చేస్తా: ఎమ్మెల్యే సురేంద్ర

అనంతపురం క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో సంచలనం రేపిన నకిలీ ఈ-స్టాంపుల కుంభకోణం కొత్త మలుపు తిరిగింది. దీని వెనుక కల్యాణదుర్గం మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి కుమారుడు, టీడీపీ నేత మారుతి హస్తం ఉందని కల్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు ప్రకటించారు. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపారు. మరోవైపు దర్యాప్తు కొనసాగుతోందని, మరిన్ని అంశాలు వెలుగు చూస్తాయని ఎస్పీ జగదీశ్ మూడు రోజుల క్రితం ప్రకటించారు. ఈ నేపథ్యంలో కల్యాణదుర్గం డీఎస్పీ సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కుంభకోణంలో మాజీ ఎమ్మెల్యే తనయుడి పాత్ర ఉందన్నారు. నకిలీ ఈ-స్టాంపుల కుంభకోణం వైసీపీ కుట్ర అని ఇటీవల ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆరోపించారు. కానీ, పోలీసుల దర్యాప్తులో సొంత పార్టీ నేత పాత్ర బయటకు రావడం తీవ్ర చర్చనీయాంశమైంది.

**నిందితులతో కలిసి కుట్ర:** మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి కుమారుడు ఉన్నం మారుతి చౌదరి నకిలీ ఈ-స్టాంపుల కుంభకోణంలో కుట్రకు పాల్పడ్డారని డీఎస్పీ రవిబాబు తెలిపారు. మారుతి తరచూ యర్రప్ప అలియాస్ మీ సేవా బాబు, మరో వ్యక్తి మోహన్ బాబుతో ఫోన్‌లో మాట్లాడారని, డబ్బు ఆశచూపి వారిద్దరినీ లోబరుచుకున్నట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. ఆ ఇద్దరి నుంచి మారుతి పది నకిలీ ఈ-స్టాంప్‌లను తెప్పించుకున్నారని, వీటిలో నాలుగు ఎస్ఆర్‌సీ కంపెనీ పేరిట తెప్పించారని తెలిపారు. వాటిని ఎందుకు తెప్పించుకున్నారో తెలుసుకునేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నామన్నారు. నకిలీ ఈ-స్టాంపుల కుంభకోణంలో ఎస్ఆర్‌సీ కంపెనీ ప్రమేయం లేదని, వారు పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించారని నిందితుడు మోహన్ బాబు తమ విచారణలో చెప్పినట్టు డీఎస్పీ తెలిపారు. సొంత పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తనయుడు తనపై కుట్ర చేయడం, విష ప్రచారం చేయడంపై కల్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు టీడీపీ అధినాయకత్వానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఈ కేసులో ఇప్పటికే బోయ ఎర్రప్ప అలియాస్ మీసేవ బాబు, మోహన్‌బాబు, భువనేశ్వర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ-స్టాంపులను టాంపరింగ్ చేసి ప్రభుత్వ ఆదాయానికి రూ.25.48 లక్షలు గండి కొట్టినట్లు ఎస్పీ జగదీశ్ ఈ నెల 28న మీడియా ముఖంగా ప్రకటించారు. మరికొన్ని స్టాంపులను ఎవరు కొన్నారో తేలాల్సి ఉందని, దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు. ఎమ్మెల్యే అమిలినేనికి చెందిన సంస్థలకు క్లీన్ చిట్ ఇస్తూనే, మరో టీడీపీ నేత పేరును తెరపైకి తేవడం కలకలం రేపుతోంది. ఈ వ్యవహారం ఉమ్మడి అనంతపురంలో జిల్లాలో ఇటు టీడీపీ, అటు వైసీపీ వర్గీయుల్లో చర్చనీయాంశంగా మారింది.



ఉన్నం మారుతి చౌదరి



ఎమ్మెల్యే సురేంద్ర బాబు



డీఎస్పీ రవిబాబు

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.